

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 248 పేజీలు: 8 వెల: 6.50


## బీహార్ కూటములో సీట్ల తకరారు!

## మద్రాసు హైకోర్టు తీర్పుపై సుప్రీంలో విజయ్ సవాల్

5లో



ప్రమాదం వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత

# భగ్గుమన్న పటాసుల తయారీ కేంద్రం

### ఏడుగురు దుర్మరణం, వారిలో ఆరుగురు మంటల్లో బుగ్గి

### కోనసీమ జిల్లా రాయవరంలో దుర్ఘటన

### మృతుల కుటుంబాలను ఓదార్చిన హోంమంత్రి అనిత

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 8 (ప్రభాతవార్త):** బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం జరిగి ఏడుగురు మృతి చెందగా వీరిలో ఆరుగురు సజీవదహనమైన విషాద సంఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి.సావరంలో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ కేంద్రంలో జరిగింది. ఈ సంఘటన తెలిసిన వెంటనే హుటా >>2

## సిఎం చంద్రబాబు ఆవేదన 2లో

# రాష్ట్రానికి భారీ ఎఫ్‌డిఐ

## రూ. 87, 520 కోట్లతో విశాఖలో 'రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్' ఏర్పాటు

### రూ. 1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపిబి ఆమోదం

### 26 ప్రాజెక్టులద్వారా 67 వేలమందికి పైగా ఉద్యోగావకాశాలు

### మెగా ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు



బుధవారం ఎస్ఐపిబి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 08, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని (ఎఫ్‌డిఐ) ఆకర్షించిందన్నారు. అమెరికావెలుపల అతిపెద్ద డేటాసెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుందన్నారు. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపిబి సమావేశం.. ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపికి సాధించటంపై ఐటి మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపికి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయనిఅన్నారు. కేవలం 15 నెలలకాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సిఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీరంగానికి మేలు జరుగుతుందని సిఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపిబిల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధికోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయల >>2



# పసిడి మరింత పైపైకి

### ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం, వెండి ధరలు

### అప్పుడు తులం రూ. 99, ఇప్పుడు రూ. 1.25 లక్షలు పైనే

**ముంబయి, అక్టోబరు 8:** బంగారం ధరలు చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు సృష్టించాయి. బుధవారం అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర తొలిసారిగా ఔన్సుకు 4,000 డాలర్ల మార్కును దాటింది. ఈ ప్రభావంతో భారత మార్కెట్లోనూ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్తతలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్, ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం, జపాన్, అర్జెంటీనాలలో ఆర్థిక ఆందోళనలు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తీవ్రతరం కావడం వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీనికితోడు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలు కూడా పసిడికి మరింత డిమాండ్ పెంచుతున్నాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,000 దాటి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,002.53 డాలర్ల వద్ద ఆల్ టైమ్ రికార్డును నమోదుచేసింది. అదే సమయంలో యూఎస్‌కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.5శాతం పెరిగి ఔన్సుకు 4,025 డాలర్ల వద్దట్రేడ్‌అయింది. ఇక దేశీయమార్కెట్ విషయానికొస్తే, ఎంసిఎక్స్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో ఏకంగా రూ.1,22,101కి చేరింది. ప్రస్తుతం 0.69 శాతం పెరుగుదలతో రూ.1,21,949 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. సిల్వర్ ఫ్యూచర్స్ 0.73 శాతం పెరిగి కెజి ధర రూ.1,46,855 పలికింది. ఈ ఏడాది ఇప్పటికే దేశీయంగా బంగారం >>2



## బాణాసంచా ప్రమాదంపై డి.సిఎం పవన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** బాణాసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం తీవ్ర ఆవేదన కలిగించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యారించారు. డిసిఎంవో కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటు అగ్ని ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారని తెలిసి తీవ్రమైన బాధ కలిగిందని పవన్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. ఈ ప్రమాదంపై జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు అందాయి. ఈ దురదృష్టకర ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశాను. దీపావళి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో, సంబంధిత గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుంది అన్నారు.

## అనంతపురం మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి నాగమణి సస్పెన్షన్

### శిశు గృహంలో నెలల పసికందు మరణం కేసులో తొలి వేటు


**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం శిశుగృహాలో రెండు నెలల పసికందు మాస్టర్ నిరూప్ మృతిపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. శిశుగృహాను పర్యవేక్షించడంలో లోపం, బాలుడు మరణించినా ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సకాలంలో తెలియచేయడంలో జాప్యం కారణంగా ఆ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) పిడి నాగమణిని సస్పెండ్ చేసింది. ఈమేరకు మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఘటనకుకారణాలపై పూర్తి సమాచారం సేకరించి దానికనుగుణంగా ఇతర బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# రూ. 212 కోట్లతో రాజ్‌భవన్

### నిర్మాణానికి సిఆర్‌డిఏ ఆమోదం: సిఎం చంద్రబాబు

### భూములిచ్చిన ఊళ్లోనే రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలి

### అమరావతితోపాటు స్థానిక రైతులూ అభివృద్ధి చెందాలి: సిఎం



**విజయవాడ అక్టోబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథార్టీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణ పనులు రీస్టార్ట్ చేశాం. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులకే మొదటగా రాజధాని అభివృద్ధి ఫలాలు అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. భూములిచ్చిన రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో... అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చాం.. అలాగే ఎలాట్మెంట్ చేయాలి. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలి. సెక్రటేరియేట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే.. వాటిని వెంటనే పరిష్కరించుకుని ఖాజా టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిని చేరేలా ఉన్న రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరాన్ని ఓ రూపునకు తీసుకురావాలి." అని సిఎం చెప్పారు.

**రాజ్ భవన్ సహా వివిధ నిర్మాణలకు ఆమోదం..**
అమరావతిలో గవర్నర్ నివాసం రాజ్ భవన్ నిర్మాణానికి సిఆర్‌డిఏ అథార్టీ ఆమోదించింది. రూ. 212 కోట్ల వ్యయంతో రాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరగనుంది. రాజ్ భవన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సిఎం సూచించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సిఆర్‌డిఏ ఇచ్చేందుకు అథార్టీ ఆమోదం తెలిపింది. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథార్టీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులు అథార్టీ ఆమోదించింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సిఆర్‌డిఏ వ్యవహరించేలా >>2

## క్వారీలో పిడుగు పడి ముగ్గురు మృతి

### శ్రీకాకుళం జిల్లాలో ఘటన

**శ్రీకాకుళం, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి మండలంలో దుర్ఘటన జరిగింది. మండలంలోని జంగాలపాడులోని క్వారీలో పిడుగు పడి ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను వెంటనే వేర్వేరు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ:** పిడుగుపాటుకు గురైన బాధితులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డితో కలిసి బుధవారం పరామర్శించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులనుకలిసి సంఘటనగురించి అడిగి తెలుసుకున్నారు. కూలి పనులు చేస్తూ పిడుగుపాటుకు గురై షాక్ నుండి బయటపడిన తీరును జిల్లా కలెక్టర్‌కు బాధితులు వివరించారు. చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి ఆరా తీశారు. మెరుగైన >>2

# విద్యా వ్యవస్థను నం.1 చేయడమే లక్ష్యం

### ఉపాధ్యాయుల సహకారం కూడా కావాలి: మంత్రి లోకేష్



**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో మంత్రి సమావేశమయ్యారు. టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను (మ్యూచువల్, స్పౌజ్) విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న భాషా పండితుల సమస్యను పరిష్కరించడం పట్ల మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తిచేశాం. వచ్చే నాలుగేళ్ల పాటు ఫలితాలపైనే దృష్టిసారిస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లోపెట్టి దొంగ లెక్కలు చూపబోం. పారదర్శకంగా వ్యవహరిస్తాం. విద్యాశాఖను ఛాలెంజింగ్‌గా తీసుకున్నాం. ఏపిలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. అభ్యసన ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. దీనిని అధిగమించేందుకు కృషిచేస్తున్నాం. 150రోజుల్లో డిఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశాం. ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం.

**విద్యార్థులకు బాగా చదువు చెబితే అదే పెద్ద గిఫ్ట్**
టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు భాషా పండితులకు పదోన్నతులుకల్పించిన మంత్రి నారా >>2



సుసుము కిటగావా



రిచర్డ్ రాబ్సన్



ఒమర్ ఎం.యాఘి

# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### ఎడారి గాలి నుంచి నీటి సేకరణ టెక్నాలజీ ఆవిష్కరణ, మెటల్ ఆర్గానిక్స్ ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధికి గుర్తింపు

### మానవాళి సవాళ్లకు పరిష్కారం చూపే పరిశోధకులుగా ప్రశంసలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** కొత్త తరహా మాలిక్యులర్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేసినందుకు శాస్త్రవేత్తలు సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం.యాఘిలకు రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. లోహ-సేంద్రీయ చట్రాల అభివృద్ధి ద్వారా, మానవ సమాజం ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లను పరిష్కరించడానికి కొత్త అవకాశాలను అందించారు అని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. ఈ ముగ్గురూ ఎడారి గాలి నుండి నీటిని సేకరించడానికి, కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించడానికి ఉపయోగపడే పరమాణు నిర్మాణాలను సృష్టించారని అకాడమీ తెలిపింది. >>2

# అమరావతి నిర్మాణానికి మరో సంస్థ

## గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సహా పలు ప్రాజెక్టులు

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణం కోసం మరో సంస్థను ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు పలు ప్రాజెక్టులను ఈసంస్థ చేపట్టనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, ఆర్థిక అంశాలు, అప్పులు, చెల్లింపులతోపాటు ఇతర అంశాలన్నిటనీ ఇది పర్యవేక్షించనుంది. కంపెనీ చట్టంకింద ఏర్పాటు చేసే ఈ సంస్థకు పదిలక్షల షేర్లను ఒక్కోటి రూ.10 చొప్పున కేటాయించారు. బోర్డు డైరెక్టర్ల నిర్ణయం మేరకు ఈ ధర పెరుగుదల ఉండదనుంది. ఇప్పటికే రాజధాని కోసం ఏర్పాటుచేసిన ఏపి సిఆర్‌డిఏతోపాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా ఉంది. ఇవికాకుండా వేర్వేరు పేర్లతో సుమారు 14 కంపెనీలు రిజిస్టరయి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో పాటు ఎన్‌టిఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్‌సిటీ, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, రోప్‌వే, ఇన్నర్ రింగురోడ్డు, కొత్తగా గుర్తించే ఇతర ప్రాజెక్టులను దీని ద్వారా చేపట్టనున్నారు.

దీనిలో పట్టణాభివృద్ధిశాఖ, ఆర్థికశాఖ, విద్యుత్, ఆర్‌అండ్‌బి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శులతోపాటు ఏపి సిఆర్‌డిఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. అనంతరం ముగ్గురు ఇండిపెండెంట్ డైరెక్టర్లను ఎన్నుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు అవసరమైన నిధులు సమకూర్చడంతోపాటు భూములు తనఖా పెట్టుకునే హక్కును కూడా ఇచ్చారు. అలాగే యూజర్ ఛార్జీలు వసూలుకూ అవకాశం కల్పించారు. >>2


బుధవారం న్యూఢిల్లీలోని యశోభూమిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# నం.1 చేయడమే లక్ష్యం

>> లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపేలా రాష్ట్రవ్యాప్తంగా 'థాంక్యూ లోకేష్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. అలాంటి కార్యక్రమాలేవీ వద్దని, విద్యార్థులకు చదువు బాగా చెబితే అదే పెద్ద గిఫ్ట్ అని వారితో చెప్పారు ఏలూరు జిల్లాలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బి.లక్ష్మీ ప్రసన్న, నా భర్త కడపలో పనిచేస్తున్నారు. ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయిన వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ.. గత ఐదేళ్లుగా మేం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. బదిలీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేకపోయాం. ఇక బదిలీ కాదు అనే స్థిర నిర్ణయానికి వచ్చాం. ఈ సమయంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిగారి కలిసి మా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లాం. ధైర్యంగా ఉండాలని, విద్యాశాఖ మంత్రి కచ్చితంగా అంతర్ జిల్లా బదిలీలు చేస్తారని చెప్పారు. అనుకున్నట్లుగానే అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్ జిల్లాల బదిలీలు అంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. ఎన్నో ఏళ్లు పడుతుంది. ఎప్పటికో అవుతుందిలే అని భావించాం. నిర్దిష్ట సమయంలోనే నోటిఫికేషన్ రావడం, జీవో రావడం జరిగిపోయింది. మేం స్కూల్‌లో కూడా జాయిన్ అయ్యాం. ఇవాళ చాలా సంతోషంగాఉంది. మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వచ్చాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఏ.కొండయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీ బి.హైమారావు, ఫైనాన్షియల్ సెక్రటరీ జే.శ్రీనివాస్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షులు సంపత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా పేలుడు ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమలో బాణసంచా పేలుడు ఘటనలో పలువురి మృతిపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనలో పలువురు మరణించడం అత్యంత విషాదకరమని అన్నారు. రాయవరంలో జరిగిన ఈ ఘటన అత్యంత దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. మరణించినవారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## మమ్ముట్టి, దుల్కర్‌ల ఇళ్లల్లో ఇడి సోదాలు!

**తిరువనంతపురం, అక్టోబరు 8:** భూటాన్ లగ్జరీకార్ల స్మగ్లింగ్ కుంభకోణం కేసు మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రముఖ నటులు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చక్కలక్కల్ నివాసాలతో పాటు మొత్తం 17 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘనల ఆరోపణలపై ఈడీ ఈ చర్యలు చేపట్టింది. భూటాన్, నేపాల్ మార్గాల ద్వారా టయోటా ల్యాండ్ క్రూయిజర్, ల్యాండ్‌రోవర్ డిఫెండర్ వంటి ఖరీదైన వాహనాలను అక్రమంగా దిగుమతి చేస్తున్న ఓ ముఠాపై తమకు కచ్చితమైన సమాచారం అందిందని ఈడీ అధికారులు తెలిపారు. ఈ ముఠా భారత సైన్యం, అమెరికా రాయబార కార్యాలయం, విదేశాంగ మంత్రిత్వ శాఖ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్రమంగా వాహన రిజిస్ట్రేషన్లు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఈ కార్లను సినీ ప్రముఖులతో సహా పలువురికి తక్కువ ధరకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. 'ఆపరేషన్ నుమ్‌ఖోరు' కింద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న తన కారును విడుదల చేయాలని కోరుతూ దుల్కర్ సల్మాన్ కేరళ హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి పొందిన మరుసటి రోజే ఈడీ దాడులు జరగడం గమనార్హం. దుల్కర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఆ కారును 2004లో రెడ్ క్రాస్ కోసం చట్టబద్ధంగా దిగుమతి చేశారని, ఆ తర్వాత తాము కొనుగోలు చేశామని కోర్టుకు తెలిపారు. అయితే, కేసు విచారణ కొనసాగుతున్నందున కారును సీజ్ చేసే హక్కు తమకుందని కస్టమ్స్ అధికారులు వాదించారు.

# తయారీ కేంద్రం

>> హుటిన రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనిత సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కోనసీమ జిల్లా బాణసంచా తయారీ కేంద్రానికి వచ్చే ఏడాది వరకు అనుమతి ఉందని ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుదాఘాతం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు చెప్పడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు అన్ని రకాలుగా అండగాఉంటామన్నారు. మృతుల కుటుంబా లకు త్వరలో పరిహారం ప్రకటిస్తామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు ముందస్తు జాగ్రత్త నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బాణ సంచా తయారుచేసే కార్మికులకు బీమా కల్పించేలా చూస్తామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు తనిఖీ చేయాలని అధికారు లను ఆదేశించడం జరిగిందన్నారు. అయిన ప్పటికీ దురదృష్టవశాత్తు ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఆమె తొలుతగా కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి సావరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ తయారీ కేంద్రం పరిశీలించిన అనిత సహాయ చర్యలు, ఇతర వివరాలు తెలుసుకున్నారు. లింగం చిన్న బాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని అనే క్షతగాత్రులను కాకినాడ జిజిహెచ్‌కు మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతిని తెలిపారు. విద్యుత్ ఘాతంతో జరిగిన ఈ దురదృష్టకర సంఘటనలో ఆరుగురు కార్మికులు సజీవ దహనం కావడం బాధాకర మన్నారు. గాయ పడిన వారు త్వరగా కోలుకోవాలని ఆమె భగవంతుని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహు ల్ మీనా, ఆర్డీవో దేవరకొండ అఖిల, జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన శాఖ అధికారి సారథి, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు ఆవేదన

**విజయవాడ,అక్టోబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన కలచి వేసిందని సిఎం చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా సీఎం స్పందిస్తూ.. ఈ ఘోర ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ప్రమాద కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలకు సూచించామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇస్తూ సిఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కోనసీమ జిల్లా రాయవరం విషాద ఘటనపై సిఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర మంత్రులు స్పందిస్తూ.. విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదంపై హోం మంత్రి అనిత స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాద ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన గురించి జిల్లా అధికారులతో మాట్లాడారు మంత్రి. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు, గాయపడిన వారిపై అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రమాదానికి గురైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

**మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ సంతాపం**

కోనసీమ అగ్నిప్రమాదంపై మంత్రి వాసం శెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయవరంలోని బాణసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులతో మంత్రి ఫోన్లో మాట్లాడి సహాయ చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రమాద కారణాలపై పూర్తి స్థాయి వివరాలు ఇవ్వాలని మంత్రి సుభాష్ కోరారు. భద్రతా నిబంధనల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

## పిడుగు పడి ముగ్గురు మృతి

>> వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అత్యవసరమైన పరిస్థితిలో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించాలని వైద్యులను సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో కోలుకునే విధంగా వైద్య సేవలు అందిస్తామని, అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ ముగ్గురు కార్మికులు చనిపోగా, జిల్లా ఆస్పత్రిలో నలుగురు క్యాజువాల్టీ వార్డులో చికిత్స పొందుతున్నారన్నారు. మరొకరి పరిస్థితి విషమంగాఉండటంతో కార్పొరేట్ హాస్పిటల్‌కి తరలించామని తెలిపారు. ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగాఉన్నట్లు వెల్లడించారు. బాధితులకు ప్రభుత్వపరంగా మెరుగైన వైద్య సదుపాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మెళియాపుట్టి మండలంప్రాంతంలో ఎక్కువ పిడుగుపాటు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయంగా నివారణకు కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.


తూ.గో జిల్లా రాయవరంలో అగ్నికీలల్లో పటాసుల తయారీ కేంద్రం

# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

>> "వారు పదార్థాలను సృష్టించడానికి మార్గాలను కనుగొన్నారు. పూర్తిగా కొత్త పదార్థాలు, వాటి లోపలి భాగంలో పెద్ద కుహరాలు ఉంటాయి. వీటిని హోటల్‌లోని గదుల మాదిరిగా చూడవచ్చు. తద్వారా అతిథి అణువులు ఒకే పదార్థం నుండి ప్రవేశించి మళ్లీ నిష్క్రమించవచ్చు" అని నోబెల్ కమిటీ ఫర్ కెమిస్ట్రీ చైర్మన్ హైనర్ లింకే తెలిపారు. "అటువంటి చిన్న మొత్తంలో పదార్థం హ్యారీ పాటర్‌లోని హెర్మియోన్ హ్యాండ్‌బ్యాగ్ లాగా ఉంటుంది. ఇది చిన్న పరిమాణంలో భారీ మొత్తంలో గ్యాస్‌ను నిల్వ చేయగలదు" అని లింకే పేర్కొన్నారు. కిటగావా జపాన్‌లోని క్యోటో విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉండగా, రాబ్సన్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. యాఘి అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధిలో ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించారు. ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణ చేశారు. కొత్తరకం పరమాణు నిర్మాణాన్ని వీరు అభివృద్ధి చేశారు.

మెటల్‌ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్‌ల అభివృద్ధి అనేది రసాయన శాస్త్రవేత్తలకు సమాజంలోని పలు సవాళ్లను పరిష్కరించడానికి కొత్త అవకాశాలను అందించింది. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన విషపూరిత వాయువులను నిల్వ చేయడానికి ఎంఓఎఫ్ పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఫ్యాక్టరీలు, విద్యుత్ కేంద్రాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్‌ను సంగ్రహించి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి అనేక కంపెనీలు ఎంఓఎఫ్ పదార్థాలను పరీక్షిస్తున్నాయి. ఈ ముగ్గురు శాస్త్రవేత్తల ఆవిష్కరణలు పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమలలో సురక్షితమైన, సమర్థవంతమైన పరిష్కారాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘి తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘి అత్యంత స్థిరమైనలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా రూపుదిద్దుకున్నాయి. మెటల్ ఆర్గానిక్ ప్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకోవడానికి ఇది ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి అని నోబెల్ కమిటీ చైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.

**ఫిజిక్స్‌లో గూగుల్ శాస్త్రవేత్తలకు నోబెల్: సుందర్ పిచాయ్ హర్షం**

భౌతిక శాస్త్రంలో 2025కు గాను జాన్ క్లార్క్, మిషెల్ డెవోరెట్, జాన్ ఎం మార్టినిస్‌లకు నోబెల్ శాంతి పురస్కారం లభించడం పట్ల గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ హర్షం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో సంభవించే ఎనర్జీ క్వాంటిజేషన్‌పై చేపట్టిన డిస్కవరీకి గుర్తింపుగా నోబెల్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. ముగ్గురిలో ఇద్దరు గూగుల్‌సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు కావడం విశేషం. మిషెల్ డెవోరెట్.. గూగుల్ క్వాంటమ్ ఎఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ హార్డ్‌వేర్ టీమ్‌కి చాలా ఏళ్లుగా నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో వారికి ఈ అత్యున్నత పురస్కారం దక్కడంపై సుందర్ పిచాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మిషెల్ డెవోరెట్, జాన్ మార్టినిస్, జాన్ క్లార్క్‌లకు అభినందనలు. మిషెల్ మా క్వాంటమ్ ఎఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ చాలా ఏళ్లుగా హార్డ్‌వేర్ టీమ్‌కి నాయకత్వం వహించారు. ఐదు మంది నోబెల్ గ్రహీతలు ఉన్న కంపెనీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు.

## పేలుడు పదార్థాల అక్రమ రవాణా కేసులో ఒకరికి ఐదేళ్లు జైలు

**చిత్తూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలను రవాణా చేస్తున్న వ్యక్తికి చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బుధవారం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలిలా వున్నాయి. 2019 సంవత్సరంలో తమిళనాడు నుండి కుప్పంకు చట్టబద్ధమైన ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలను మురుగన్ మన్నుకన్ రవాణా చేస్తూ కుప్పం పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జిటి నాయుడు 22 ఫిబ్రవరి 2019 సాయంత్రం 4 గంటల సమయంలో కుప్పం మండలం కృష్ణాపురం గ్రామం మల్లనూరు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఓ ట్రాక్టర్ తమిళనాడు నుండి కుప్పం వైపుకు వచ్చింది. ఈ సమయంలో అక్కడ వున్న పోలీసులను చూసిన డ్రైవర్ మురుగన్ మన్నుకన్ భరత్ పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టరును వదలి పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే ఇన్స్‌పెక్టర్, సిబ్బంది వెంబడించి అతనిని పట్టుకుని విచారించగా తన పేరు మురుగన్ మన్నుకన్ అని, తాను రాళ్లను పేల్చి జీవనం సాగించేవాడని, తన వద్ద ఎలాంటి చట్టబద్ధ లైసెన్స్ లేదని తెలిపారు. తాను వేలూరు జిల్లాలోని అక్రమ విక్రేతల నుండి తక్కువ ధరకే జెలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లను కొనుగోలు చేసి గ్రామానికి తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో అప్పటి ఎస్ఐ ఇ వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి నుండి పోలీసులు 40 డిటోనేటర్లు, 40 జెలిటిన్ స్టిక్స్, ఒక మగ్గర్ బాక్స్, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించగా కోర్టు కేసు పూర్వపరాలను విచారించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక బుధవారం తీర్పు వెలువరించారు.

# రూ. 212 కోట్లతో రాజ్‌భవన్

>> అథార్టీలో నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్, ఎపి ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు అథార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో నిర్మించే హోటళ్ల వద్ద పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులు చేసేందుకు అథార్టీ అంగీకరించింది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలనా అంశాలకు అథార్టీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సిఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని... పార్కింగ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని సూచించారు. అమరావతి రాజధానిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. కామన్ పార్కింగ్ ప్రాంతాలు ఉండేలా ప్రణాళికలు చేయాలని సిఎం అధికారులకు చెప్పారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో ఇంటిగ్రేట్ చేయాలని... బ్లూ గ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సిఆర్డీఎ అథార్టీ సమావేశానికి మంత్రి నారాయణ, సిఎస్ కె.విజయానంద్, సిఆర్‌డిఎ, ఎడిసి మౌలికసదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అమరావతి నిర్మాణానికి మరో సంస్థ

>> **కొత్తగా ఏర్పాటయ్యే సంస్థ బాధ్యతలు**

కొత్త ప్రాజెక్టులకు నిధుల సేకరణతోపాటు అవసరమైన ప్రాజెక్టులు రూపొందించి వాటికి డిపిఆర్‌లు తయారు చేయనుంది. పిపిపి, ఇపిసి, హెచ్ఎఎం వంటి పద్ధతుల్లో కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతలను అప్పగించనుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులను అమలు చేసేందుకు వీలుగా పత్రాలు తయారు చేసే బాధ్యతనూ నిర్వర్తించనుంది. పిపిపి పద్ధతిలో ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ప్రణాళికనూ తయారు చేయనుంది. ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా కార్పొరేట్ సంస్థలనూ ఎంపిక చేసుకునే అవకాశమూ కొత్తగా ఏర్పాటు చేసుకునే సంస్థకు ఇచ్చారు.

## రాజధానిలో భూసేకరణకు ఉత్తర్వులు

### సమీకరణలో ఇవ్వని భూమిని తీసుకోవాలని నిర్ణయం

**విజయవాడ, అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో 217 చ.కి.మీల పరిధిలో సమీకరణలో రైతులు ఇప్పటి వరకు ఇవ్వని భూముల్ని...సేకరణ విధానంలో తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 343.36 ఎకరాల సేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్లను ఉపసంహరించుకొని,వాటిపై పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టేందుకు సీఆర్‌డీఏకు అనుమతినిచ్చింది. రాజధానిలో సమీకరణలో ఇవ్వని భూమి ఇంకా సుమారు 2,800 ఎకరాల వరకు ఉంది. ఆ మొత్తం సేకరణకు ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వకుండా...రాజధానిలో చేపట్టే ప్రాజెక్టుల వారీగా అవసరమైన చోట సేకరణ చేపడతారు. ఎక్కడ ఎంత భూమి అవసరమో సీఆర్‌డీఏ కమీషనర్ చెబితే...దాని సేకరణకు గుంటూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇస్తారు. '2013 భూసేకరణ చట్టం'నిబంధనల్ని అనుసరించి భూమిని సేకరిస్తారు. రాజధానిలో అక్కడక్కడా కొంత భూమిని సమీకరణలో ఇవ్వకపోవడంతో...మౌలిక వసతుల ప్రాజెక్టులు,వివిధ సంస్థలకు భూ కేటాయింపులు,రైతులకు స్థలాలు కేటాయించడం వంటి ప్రక్రియలకు విఘాతం కలుగుతోందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

# భారీ ఎఫ్‌డిఐ

>> సీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను, నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సిఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సిఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సిఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సిఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టిసిఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సిఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపిబి సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పసిడి మరింత పైపైకి

>> ధరలు 55 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచ, కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, గోల్డ్ ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడం వంటివి కూడా ధరల పెరుగుదలకు దోహదపడ్డాయి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పదిగ్రాముల బంగారం రూ 1,25,780గాను, 22 క్యారెట్ల బంగారం 1,12,900గాను నిలిచింది. ఢిల్లీలో 1.22,080రూపాయలు, 22 క్యారెట్లు 1,12,030గాను కొనసాగాయి. ముంబయిలో 24, 22 క్యారెట్లు వరుసగా రూ.1,22,030లు, 1,11,860లుగానడిచాయి. కోల్‌కత్తాలో కూడా రూ.1,22, 030, రూ.1,11,860లుగా ఒకేరకంగా కొనసాగాయి. ఇక దక్షిణాదిలో కీలకంగా పరిగణించే చెన్నైలో కూడా అవేధరలు కొనసాగాయి. బెంగళూరులో ధరలు 24 క్యారెట్లు 1,22,030గాను, 22 క్యారెట్లు 1,11,860గాను కొనసాగాయి. బంగారంతోపాటే వెండిధరలు కూడా ర్యాలీ తీసాయి. హైదరాబాద్‌లో కిలో వెండి 1,66,900గా కొనసాగితే విజయవాడలో 1,66,900, ఢిల్లీలోరూ.1,57,100, చెన్నైలో 1,66,900, కోల్‌కత్తాలో 1,57,100, ముంబయిలో 1,57,100గా కొనసాగాయి. బెంగళూరులో కూడా 1,57,100గాను, ఆభరణాల తయారీ ఎక్కువ ఉండో వదోదర, అహ్మదాబాద్‌లలో కూడా రూ.157,100గా నడిచాయి. అంతర్జాతీయంగా కరెన్సీ మార్కెట్, ఫండ్స్,ఈక్విటీల్లో ఎదురవుతున్న ప్రతికూల పవనాలు బులియన్ మార్కెట్‌కు కలిసొస్తున్నాయి. ఫెడ్‌రిజర్వుతోపాటు కీలక సెంట్రల్‌బ్యాంకులు ఫండ్‌రేట్స్ సడలిస్తే ఆప్రభావం బులియన్‌పై చూపిస్తోంది. 1950 నుంచి ఉన్న పసిడి ధరలను ఒకసారి పరిశీలిస్తే అన్నివర్గాలకు ఆశ్చర్యం కలుగక మానదు. ఈఏడాదిలోనే ఇప్పటివరకూ బంగారం 50వేల రూపాయలకు పైబడి పెరిగింది.

| సంవత్సరం | ధర 10 గ్రాములు. రూ.లలో |
|---|---|
| 1950 | 99 |
| 1970 | 184 |
| 1980 | 1330 |
| 1990 | 3200 |
| 2000 | 4400 |
| 2010 | 18,500 |
| 2020 | 48,651 |
| 2024 | 75,000 |
| 2025 (మార్చి) | 82,100 |
| 2025 (అక్టోబరు 8) | 1,25,780 |

## వారం - వర్జ్యం

09-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
తదియ రా.10.56
భరణి రా.8.04
వర్జ్యం : ఉ.6.49-8.15
దు.ఉ.9.56-10.43, 2) మ.2.41-3.28
శుభసమయం: ఉ.5.30-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు. సన్నిహితుల కలయిక.

**మిథునం:** భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. వస్తు లాభం.

**కర్కాటకం :** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. వాహనయోగం.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**తుల :** దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. శుభవార్తలు.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇంటాబయటా అనుకూలం.

**ధనుస్సు:** ఇతరుల విషయాలలో జోక్యం వద్దు. వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** శుభకార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. సమయస్ఫూర్తితో మెలగడం మంచిది.

**మీనం :** డాక్యుమెంట్లు, ముద్రణా పరమైన బాకీలు ఇబ్బందులకు గురిచేస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కల్తీ లిక్కర్‌పై ఉక్కుపాదం

## ములకల చెరువు కేసులో 21 మంది నిందితులుగా గుర్తింపు
## వారిలో 12 మంది అరెస్టు
## - ఫేక్ ప్రచారంపైనా చర్యలు : సీఎం చంద్రబాబు



లిక్కరుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష దృశ్యం

**విజయవాడ.అక్టోబరు 8.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కల్తీ లిక్కర్ తయారీ, అమ్మకాలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో ప్రజల ప్రాణాలను హరించే వారిపై కఠిన చర్యల ద్వారా ఉక్కుపాదం మోపాలని సీఎం స్పష్టం చేశారు. 15 నెలల్లో పటిష్ట చర్యల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టామని...ఇంతే సమర్ధవంతంగా పనిచేసి రాష్ట్రంలో కల్తీ లిక్కర్ అనేది లేకుండా చేయాలని చెప్పారు. ఏ ఒక్క చోటా కల్తీ లిక్కర్ తయారీ కేంద్రాలు కానీ, అటువంటి వ్యక్తులు కానీ ఉండకూడదని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ లిక్కర్ వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరవు కేసులో మొత్తం 21 మంది నిందితులుగా గుర్తించామని...అందులో ఇప్పటికి వరకు 12 మందిని అరెస్టు చేశామని...మిగితా నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ములకలచెరువు కేసులో ఎ1 గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ జరపుతున్నామని తెలిపారు. ముకలచెరువు కేసుల ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జనార్ధన్‌రావుకు చెందిన వ్యాపారాలపై తనిఖీలు జరిపామని తెలిపారు. ఈ తనిఖీల్లో కిరాణా షాప్ వెనుక కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. అద్దేపల్లి జనార్ధన్‌రావు ఇబ్రహీంపట్నంలోని మెస్సర్స్ తివిళి బార్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అతను 15 సంవత్సరాలుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడు. అధిక లాభాల కోసం నకిలీ మద్యం తయారీ ద్వారా చట్ట విరుద్ద కార్యక్రమాలు నిర్వహించారు. తన సోదరుడు అద్దేపల్లి జగన్ మోహన్ రావు ద్వారా కల్తీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకం చేపట్టాడు. వీరిద్దరు కొందరితో కలిసి కల్తీ మద్యం తయారు చేసినట్లు తనిఖీల్లో గుర్తించామని అధికారులు తెలిపారు. ఇక్కడ జరిపిన తనిఖీల్లో కల్తీ లిక్కర్ సీసాలు పట్టుకున్నామని తెలిపారు. ఇక్కడ కల్తీ లిక్కర్ వ్యవహారంలో మొత్తం 12 మందిని నిందితులుగా గుర్తించామని వీరిలో ముగ్గురిని ఇప్పటికి అరెస్టు చేశామని తెలిపారు. నలుగురిని పీటీ వారెంట్‌పై తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. నిందితుల కాల్ రికార్డులతో పాటు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని అధికారులు వివరించారు. కల్తీ లిక్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి.....ఈ మొత్తం వ్యవహారంలో పలు కీలక సూచనలు చేశారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన కల్తీ లిక్కర్ వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారంతో రాజకీయ ప్రయోజనం కోసం ప్రయత్నం చేస్తున్నాయని సీఎం అన్నారు. రాష్ట్రం అంతటా కల్తీ లిక్కర్ అని తప్పుడు ప్రచారంతో ప్రజలను భయపెడుతున్నారని....ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ లిక్కర్ బాటిల్ ఉందని ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రంలో కల్తీ లిక్కర్‌తో ప్రాణాలు పోతున్నాయని ఫేక్ ప్రచారాలు మొదలు పెట్టిన విషయాన్ని మంత్రులు కూడా అర్థం చేసుకోవాలని.... వైసీపీ నేతల రాజకీయ కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాలని సూచించారు. కల్తీ లిక్కర్ కారణంగానే అక్కడ చనిపోయారు...ఇక్కడ చనిపోయారు అని ప్రచారం చేస్తున్నారని.... ప్రతీ ఆరోపణ పైనా విచారణ జరపించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైతే పోస్టుమార్టం వంటి విధానాల ద్వారా మృతికి కారణాలు సైంటిఫిక్‌గా నిర్థారించి...వాస్తవాలు వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఏది నిజమో చెప్పడంతో పాటు..రాజకీయ కుట్రల్లో భాగంగా సహజ మరణాలపై తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో మరణాలు అని ప్రచారం చేస్తే దానికి రుజువు చూపాలని అడగాలని...తప్పుడు ప్రచారం అని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అయినా, సోషల్ మీడియా అయినా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లాభం పొందుదామనుకుంటే ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు సైలెంట్‌గా చూస్తూ ఊరుకోవని సీఎం హెచ్చరించారు. ఈ సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, లోకేష్ నేరుగా హాజరవ్వగా..హోంమంత్రి సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 2019లో వివేకా హత్య సమయంలో వైసీపీ ఆడిన డ్రామాలు, శవ రాజకీయాలను మరిచిపోవద్దని చెప్పారు. వాళ్లు ఫేక్ ప్రచారంతోనే ప్రజలను నమ్మించాలనే ప్రయత్నంలో ఉంటారన్నారు.

## డిసిఎం పవన్‌ను విమర్శించే స్థాయి పాలేరు నానికి లేదు
### - జనసేననేత కిరణ్ రాయల్




**తిరుపతి,అక్టోబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి పాలేరునానికి లేదని, నాని ఎవరి మనిషి అనేది ప్రజలందరికీ తెలుసని తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. పేర్నినాని కాదని పాలేరునాని అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. డిసిఎం పవన్‌కల్యాణ్ గురించి విమర్శించే స్థాయి పాలేరునానిగానీ, మాజీ సిఎం జగన్‌కుకూడా లేదని గట్టిగా స్పందించారు. పవన్‌కల్యాణ్ ఎక్కడ పర్యటిస్తున్నారు, ఏం చేస్తున్నారనేది పాలేరుకేమి తెలుసని ఎద్దేవాచేశారు.బుధవారం తిరుపతిలో మీడియాతో కిరణ్ మాట్లాడారు. దేశరాజకీయాల్లో పవన్‌కల్యాణ్ అవసరం ఎన్డీఎలో కీలకంగా ఉందన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే బందర్‌బస్టాండ్‌లో నాని నాలుకోస్తామని హెచ్చరించారు. సుగాలిప్రీతి కేసు గత ఐదేళ్లలో కానిస్టేబుల్ కూడా విచారణకు ఇవ్వలేదని, అలాంటిది ఐదేళ్ళ వైసిపి పాలనలో నకిలీ మద్యం పట్టుకున్నారా?ఒక్కరిపైనా కేసు పెట్టారా?అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు సిబిఐకి ఇచ్చిందని, నకిలీ మద్యంలో పెద్దోళ్ళు జైలుకెళ్ళడం తెలియదాలని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నేతలు హేమకుమార్,రుద్రకిశోర్; మనోజ్, సాయిదేవ్, సాయి.ఆది, లోకేశ్ పాల్గొన్నారు.

## విజయవాడ హత్య కేసులో వీడిన మిస్టరీ
### - ఇద్దరు నిందితుల అరెస్ట్

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 8,ప్రభాతవార్త** తన భార్య తనను వదిలి వెళ్ళడానికి కారణమైందనే కారణంతో తన పిన్నిని హత్య చేసినట్లుగా నమోదైన కేసులో సిసి కెమేరాల ద్వారా పోలీసులు నిందితుడిని పట్టుకున్న ఉదంతమిది.సిపి రాజశేఖరబాబు తలిపిన వివరాల ప్రకారం గొల్లపూడి లోని బొమ్మసాని సుబ్బారావు నగర్ వద్ద మురుగునీటిలో రెండు చేతులు,రెండు కాళ్ళు,తల లేని కేవలం ఒక మొండెం భాగం మాత్రమే ఉన్న మహిళ మృతదేహం ఉందనే సమాచారంపై భవానీపురం పోలీసులు అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పశ్చిమ జోన్ ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ,ఏసిపి దుర్గారావుల పర్యవేక్షణలో సిఐ ఉమామహేశ్వరావు అధ్యర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి చుట్టుపక్కల విచారించారు. ఈ నేపథ్యంలో పొత్తూరి విజయలక్ష్మి (70) చిట్టినగర్ లోని సాయిరాం థియేటర్ సమీపంలోని వాసవి కళ్యాణ మండపం వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదని వచ్చిన సమాచారం మేరకు అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన సిసి కెమేరాలను పరిశీలించి సదరు మహిళను ఒక వ్యక్తి బైక్‌పై తీసుకెళ్ళినట్లు గుర్తించారు. సదరు వ్యక్తి ఇంటి సమీపం లోని సీసీ కెమేరా ఫుటేజి పరిశీలించగా మృతురాలిని గత నెల 30ర సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి లోపలికి తీసుకువెళ్ళినట్లు అప్పటి నుండి మృతురాలు తిరిగిరానట్లు తర్వాత నిందితులైన వంకదార హనుమాన్ జి.సుబ్రహ్మణ్యం,అతని కుమారుడు వంకధార లక్ష్మీ నరసింహస్వామిలు పలుమార్లు ఇంటి నుండి బయటకు బ్యాగులతో బయటకు వచ్చి బండిపై వెళ్ళినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు.

## ప్రత్యేక ప్రాజెక్టుల కోసం ఎస్‌పివి ఏర్పాటు

**విజయవాడ.అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రత్యేక ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌పీవీ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం,స్మార్ట్ ఇండస్ట్రీలు, నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు,స్పోర్ట్స్ సిటీ,అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు రానున్నాయి. మరోవైపు రాజధానిలో భూసేకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకరణలో ఇవ్వని భూమిని తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కాన్పూర్‌మిశ్రీగంజ్‌లో భారీ పేలుడు
### మహిళ సహా ఆరుగురికి తీవ్రగాయాలు



**కాన్పూర్, అక్టోబరు 8:** నగరంలోని మిశ్రీ బజారులో బుధవారం సాయంత్రం రెండు పార్కింగ్‌చేసిన స్కూటర్లలో అమర్చిన బాంబులు పేలడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడులో కనీసం ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులను వెంటనే సమీపం లోని ఉర్సులా ఆసుపత్రికి తరలించారు. రాత్రి 7.15 గంటలప్రాంతంలో మిశ్రీ బజార్ ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. జెసిపి అశుతోష్‌కుమార్ మాట్లాడుతూ రెండు స్కూటర్లనుంచి ఈ పేలుడు సంభవించిందని మహిళ సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు. మా ఫోరెన్సిక్ బృందాలుసంఘటనాస్థలాలో వివరాలు సేకరిస్తున్నాయని అన్నారు. పేలుడు సంభవించిన స్కూటర్‌ఌు గుర్తించామని, ఇందుకు సంబంధించి అన్ని కోణాలనుంచి దర్యాప్తు జరుగుతోందని అశుతోష్ వెల్లడించారు. ఇది ప్రమాదమా లేక కుట్రపూరితమా అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్లు జెసిపి అశుతోష్ చెప్పారు. పోలీస్, బాంబు నిర్వీర్యంచేసే బృందాలతోపాటుఫోరెన్సిక్ టీమ్‌లుకూడా వెంటనే ప్రమాదస్థలానికి చేరుకు ఉన్నాయి. అంతేకాకుండా చెల్లాచెదురయిన ఈ ప్రాంతాన్ని మొత్తం సీజ్‌చేసి పేలుడుకు సంబంధించిన మొత్తం వివరాలను పరిశీలనచేస్తున్నారు.

## వైకుంఠ ద్వార దర్శనం రెండా? పదిరోజులా?
### డిసెంబరు 31న వైకుంఠ ఏకాదశి



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ప్రపంచప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రానున్న డిసెంబర్‌లో వైకుంఠద్వార దర్శనాలు ఎన్ని రోజులు తెరిచి ఉండనున్నారనేది ఇప్పుడు అటు శ్రీవారి భక్తుల్లో ఇటు టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ ఏడాది డిసెంబర్ 31వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియలు మొదలవుతాయి. 2026 నూతన సంవత్సరం జనవరి 1వతేదీ వైకుంఠ ద్వాదశిపర్వదినం మోక్షం లభించే ఘడియలు. అయితే దక్షణిభారతదేశంలోని పలు వైష్ణవాలయాలు అనాదికాలంగా పదిరోజులపాటు పవిత్రమైన వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇదే ఆనవాయితీని 2023వ సంవత్సరంలో తిరుమలతిరుపతిదేవస్థానం పాలకమండలి ,అధికారులు నిర్ణయించి పదిరోజుల వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శనం చేయిస్తున్నారు. గతంలో 2021వరకు తిరుమల ఆలయంలో ఆనందనిలయంలోని వైకుంఠద్వారాలను కేవలం అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల్లో మాత్రం తెరచివుంచి దాదాపు 2లక్షలమంది వరకు భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించేవారు. అయితే ప్రముఖుల నుండి, ఆగమపండితుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో తిరుమల ఆలయంలోనూ పదిరోజులపాటు తెరచివుంచి సామాన్యభక్తులకు ఈ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనం ప్రశాంతంగా చేయిస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరిలోనూ పది రోజులు వైకుంఠద్వార దర్శనాలు కల్పించడం, అందుకు భారీగా భక్తులు తరలిరావడం తో 2025 జనవరి 8వతేదీ రాత్రి తిరుపతిలో తొక్కిస లాటు, తోపులాట ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పో వడం, యాభైమందికి పైగా భక్తులు క్షతగాత్రులైన విషాద ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్పట్లోనే తీవ్రస్థా యిలో భక్తుల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అప్పట్లోనే రాష్ట్రప్రభుత్వం పదిరోజుల వైకుంఠ ద్వారదర్శనాలను ఆగమ సలహాదారులు, అర్చకులు పునరాలోచన చేయాలని భక్తులు కోరారు. 2025 జనవరి 10వతేదీ నుండి 19వతేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వారాలను తెరచివుంచి భక్తులకు దర్శనం చేయించారు. ఆ పదిరోజులు దాదాపు 8లక్షలమంది భక్తులు పవిత్రమైన మోక్ష మార్గంలో ఏడుకొండల స్వామిని దర్శించు కోగలిగారు. ఇప్పుడు తిరుమల బోర్డు, తిరుమల ఆలయ అధికారులు తీసుకునే నిర్ణయంపై వైకుంఠ ద్వారాలు ఎన్నిరోజులు తెరచివుంచనున్నారనేది సందిగ్ధంలో ఉంది. టిటిడిలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రస్తుత పాలకమండలి, ఉన్నతాధికారులు రానున్న డిసెంబర్ నెలలో 31వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియిలు,2026 జనవరి 1వతేదీ వైకుంఠ ద్వాదశి ఘడియలు వస్తున్నాయి. ఆ రెండురోజులు మాత్రమే వైకుంఠద్వారాలను తెరచి ఉంచుతారా?లేక పదిరోజుల వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు దర్శనం చేయిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయంపైకూడా భక్తుల నుండి అభిప్రాయసేకరణ చేపట్టేందుకు టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. మరీ దేశంలోని పలు వైష్ణవాలయాలలో పదిరోజులు వైకుంఠ ద్వారాలు తెరచి ఉంచుతున్నపుడు తిరుమల ఆలయంలో తీసుకోనున్న నిర్ణయాలుపై భక్తుల్లో సందిగ్ధత నెలకొంది. మరీ గతంలోలాగే వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతినిస్తారా,లేక పదిరోజులు దర్శనాలకు అనుమతినిస్తారా అనేది త్వరలోనే టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు భక్తులకు ఒక స్పష్టత నిచ్చే అవకాశం ఉంది.

## దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై రైల్వే గార్డులు, టిఎంఆర్‌లు..
### భావోద్వేగాల మధ్య రైల్వే పూర్వ గార్డుల ఆత్మీయ కలయిక



**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 08, ప్రభాత వార్త:** వారు కొన్ని దశాబ్దాలపాటు వృత్తి పట్ల బాధ్యత, నిబద్ధతలతో కలిసి విధులు నిర్వర్తించి రైల్వే అభివృద్ధిలో పాలుపంచుకున్నవారు. ఉద్యోగ విరమణ చేసి దశాబ్దాల విరామం అనంతరం తాము ఒకరినొకరు కలిసి యోగాక్షేమాలు తెలుసుకొని అలనాటి తమ తమ అనుభవాలను మరోసారి నెమరువేసుకుంటు ఆనందంగా గడపటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో పనిచేసిన అప్పట్టి గార్డులు, ట్రైన్ మేనేజర్లు ఉద్యోగ విరమణ చేసిన అనేక సంవత్సరాలకు దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ చారిత్రాత్మక కార్యక్రమం స్థానిక రైల్వే ఇన్స్‌టిట్యూట్ లో ఆనందోత్సాహాలమధ్య, ఆడంబరంగా జరిగింది పూర్వ గార్డుల సమ్మేళనం కార్యక్రమం. భారతీయ రైల్వే చరిత్రలో మొట్ట మొదటిసారిగా నిర్వహించిన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో అలనాటి పూర్వపు గార్డులు శ్రీనివాస మూర్తి, నీలకంఠారెడ్డి, రంగనాయకులు, జి.రామచంద్రారెడ్డి, ఎస్.ఎం. బాషా, యస్ మొహమ్మద్ అలీ, వాఘేశ్వరన్, బి.శ్రీనివాసులు,ధర్మన్న, రామనాయక్, శ్రీధరన్, చిట్టిబాబు, రవికుమార్, వై.పి.ఆంజనేయులతో పాటు అధిక సంఖ్యలో సీనియర్ గార్డులు ఈఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని తమ తమ అనుభవాలను, అనుబంధాలను గుర్తుచేసుకొని ఆనందోత్సాహాలు, భావోద్వేగాలకు లోనయ్యారు. తమ సహచరులను, మిత్రులను కలుసుకొని అలనాటి తమ తీపి,మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు... " చెదరని బెదరని చెలిమే తమది.. చెరగని తరగని స్నేహం తమది.. జీవితమంతా విడదీయలేని వాడని వీడని బంధం తమది.. అంటూవృత్తిపట్ల నిబద్ధతలతో చక్కగాఒక్కటిగా కలిసి మెలిసి పనిచేసినరోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పలువురు గార్డులు బరువెక్కిన వేదనాభరిత హృదయంతో భావోద్వేగానికి లోను కావడం చూపరులను కంటతడి పెట్టించింది. ఈసందర్భంగా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు రాబిన్ థామస్, వాఘేశ్వరన్, హనుమంతరావు,ధన్ రాజ్, సాయిశేఖర్ సభ్యులు తమ సీనియర్ లను భక్తిశ్రద్ధలతో ఘనంగా శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి పాదాభివందనాలుచేసి ఆశీస్సులు పొందారు... బతుకు తెరువుకై వెళ్తున్నాం.. మళ్లిఎప్పుడోఎక్కడో కలుసుకుందామంటూ టాటా చెప్పుకున్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవలో 1008 సత్యాత్మతీర్థస్వామి



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగంలో భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని, భక్తులు భగవంతుని ఆశీస్సులు పొందుతారని ఉడిపి మఠం పీఠాధిపతి 1008 సత్యాత్మ తీర్థస్వామి తెలిపారు. బుధవారం ఉదయం తిరుమలకు శిష్యులతో కలసి వచ్చిన స్వామికి పెద్దజీయర్ మఠం సమీపంలోని రాగిచెట్టువద్ద నుండి ఆలయ సాంప్రదాయాలతో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ మహద్వారం నుండి ఆలయంలోపలకు వెళ్ళిన స్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశవ్యాప్తంగా అందుబాటులోకి టిటిడి క్యాలండర్లు డైరీలు



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి సంబంధించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. వీటిని గతనెల 24వతేదీ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం తిరుమల,తిరుపతితోబాటు హైదరాబాద్, విజయవాడ,విశాఖపట్నం, హిమాయత్‌నగర్, న్యూఢిల్లీ,ముంబై, బెంగుళూరు, వేలూరు,చెన్నైలతోబాటు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులోని టిటిడి కల్యాణమండపాల్లో టిటిడి నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. 12పేజీలు క్యాలండర్, ఆరపేజీల క్యాలండర్, టేబుల్‌టాప్ క్యాలండర్, డీలక్స్‌డైరీలు, పెద్దడైరీలు ఇలా స్వామివారి ప్రతిమల క్యాలండర్లు కొనుగోలుచేసుకునే అవకాశం కలిగింది. టిటిడి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా భక్తులు బుక్‌చేసుకునే సదుపాయం టిటిడి కల్పించింది. ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్న వారికి తపాలశాఖ ద్వారా ఇంటివద్దే టిటిడి డైరీలు, క్యాలండర్లు అందజేయబడుతాయి. "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల.ఓఆర్‌జి,టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

## శ్రీవారి సేవలో విఐపిలు - అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయంనైవేద్యాల విరామ సమయంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి బోర్డుసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సినీనటుడు నారా రోహిత్, ఏపిఈఆర్‌సి ఛైర్మన్ పివిఎస్‌రెడ్డి, సినీరచయిత కోన వెంకట్, నటి అషరెడ్డి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించింది
### - ఎస్సార్సీ ఎంపి వైవి సుబ్బారెడ్డి



**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని వైకాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి ఆరోపించారు. ప్రజల పక్షాన తమ పార్టీ విరామం లేకుండా పోరాడుతుందన్నారు.తమ నేత జగన్ ప్రజల మధ్యకు వచ్చి జనం కోసం ఉద్యమిస్తున్నారన్నారు.తాము ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తుంటే ప్రభుత్వ అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. ఈ మేరకు వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వైవి సుబ్బారెడ్డి ఒక ప్రకటన విడుదల చేసారు.రైతుల పక్షాన పోరాడి యూరియా కష్టాలు తీర్చడానికి కృషి చేశామన్నారు.వైసీపీ,కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు.ప్రతి నియోజక వర్గంలో ఉన్న సమస్యలు మా దృష్టిలో ఉన్నాయన్నారు.ఎవరు కేసులకు భయపడాల్సిన పని లేదన్నారు.వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.డయేరియా భాధితులను అలాగే వదిలేసిందన్నారు.ఎవరు ఎన్ని తప్పులు చేసినా మీడియాని అడ్డంపెట్టుకొని వాస్తవాలు కప్పి పెడుతుంది.జగన్ దూరదృష్టితో 17 మెడికల్ కాలేజీలుకి శ్రీకారం చుడితే ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేస్తోంది.విద్యా,వైద్యం,పేదలకు అందుబాటులో ఉండాలని జగన్ పని చేశారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.కల్తీ మద్యం చేసింది కూటమి ప్రభుత్వం నిందలు వేసేది మాత్రం వైసీపీ మీద అన్నారు.ప్రతి ఇల్లకూ కల్తీ మద్యం ఫ్యాక్టరీ పెట్టేశామన్నారు.గ్రామ మండల స్థాయి కమిటీలు అన్నీ పూర్తి చేస్తామన్నారు,పార్టీ అధినేత జగన్ ఆదేశం ప్రకారం 29 అనుబంధ విభాగాల నియామకం జరుగుతుంది.కోటి సంతకాల సేకరణ చేస్తాం.దాని ద్వారా ప్రభుత్వపై పోరాడతాం.రాష్ట్రంలో తమ ప్రభుత్వంలో రోడ్ల మరమ్మత్తులకు 1000 కోట్ల నిధులు మంజూరు చేసామన్నారు.రాష్ట్రంలో 274 రోడ్డు పనుల కోసం రూ.1000 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.వీటిలో స్టేట్ హైవేస్ 108కి సంబంధించిన పనులకు రూ.400 కోట్లు మంజూరు చేసిందన్నారు.మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ 166 పనులకు రూ.600 కోట్లు మంజూరు చేసింది.చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమిటో చెప్పాలన్నారు.అంకెల గారడీతో జనాన్ని పదే,పదే మోసగించలేమన్నారు.

## నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు నాణ్యమైన భోజనం: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ట్రిపుల్ ఐటీల్లో మెస్ నిర్వహణ భాధ్యతను అక్షయపాత్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అప్పగించారు. లోకేష్ తన మాట నిలబెట్టుకున్నారని విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు విద్యార్థులు. ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీ భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. అయితే అక్షయపాత్ర ద్వారా నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లోకేష్ నిర్ణయం తీసుకున్నారు. అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం అందుతుండటంతో సంతోషం వ్యక్తం చేశారు విద్యార్థులు.

తమ సమస్య పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ కృషి చేశారని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అభినందనలు తెలిపారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన భోజనాలతో ఇప్పుడు నిజమైన మార్పు కనిపిస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు.

వార్త


పుస్తకం విలువ దాని ఖరీదుతో వెలకట్టకండి,
ఆ పుస్తకం ఇచ్చే అపార విజ్ఞానంతో
వెలకట్టండి.
-ఆస్కార్‌వైల్డ్

# ప్రతిష్టాత్మక భేరి !

బీహార్లో వైశాలి ప్రపంచానికి ప్రజాస్వామ్య మార్గాన్ని చూపినట్లే, ఈసారి బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళన దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నది ఎన్నికల కమిషన్ ఆకాంక్ష. అందుకేనేమో! ఇలా ప్రత్యేక ముమ్మర ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తవగానే బీహార్ ఎన్నికల నోటిఫికేషన్ అలా ప్రకటించేసింది ప్రధాన ఎన్నికల కమిషన్. 22ఏళ్ల తర్వాత బీహార్ రాష్ట్రంలో ఇలాంటి ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని సిఇసి ఎందుకలా గొప్పగా చెప్పుకుంటుందో అర్థంకాదు. ఇంతక్రితం అలాంటిదేమీ జరుగలేదని కాబోలు. కానీ ఏ స్థాయి ఎన్నికలైనా త్వరలో వస్తాయనగా లేదా ఏటా విస్తృత ఓటర్ల జాబితా సవరణ వంటి సవరణలు జరుగుతూనేఉంటాయి. అవన్నీ బూటకమేనా! అలాంటి సవరణల్లో కనీసం కొత్త నవయువ ఓటర్ల చేర్పింపు, అదే సమయంలో నకిలీ ఓటర్ల గుర్తింపు, జాబితాల నుంచి ఓటర్ల బదలీ వంటివి సాధారణం. వీటన్నిటినీ మించి బీహార్ జాబితా సవరణ లేదా ప్రక్షాళన సంపూర్ణమైందంటే ఆహ్వానించదగిన పరిణామమే. అయినా ఎన్నడూ లేనిది ఓటర్ల జాబితా తప్పొప్పుల విషయం మాత్రమే చర్చించే విపక్షాలు ఈసారి గొంతెత్తి అరిచాయి. వారి విమర్శలు చిరిగి చిరిగి కన్నం చాటయ్యిందన్న చందాన ఉన్నాయి. జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని సిఇసి సీరియస్‌గా తీసుకుని క్షమాపణలు కోరిన పరిస్థితి వచ్చింది. చెప్పాలంటే సిఇసి తన బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత స్థాయిలో విమర్శల్లోకి వెళ్లిపోవడాన్ని ఎవరూ సమర్థించలేదు. అన్ని అధికారాలు ఉన్న స్వతంత్ర సంస్థ ఎన్నికల కమిషన్. అలాంటి ఎంతో హుందాగా వ్యవహరించాల్సి ఉందని పలువురు బ్యూరోక్రట్స్ కూడా సూచించారు. అది సద్దుమణిగినా బీహార్ ఓటర్ల జాబితా విషయంలో ఎన్నికల కమిషన్ ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. భారతీయులు కానివారు, మరణించినవారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, ఒకటి రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటుంటే వారి ఓట్లను తొలగించారు. ఇవన్నీ వాస్తవంగా చేయగలిగి ఉంటే అంతకన్నా పెద్ద ప్రక్షాళన మరేదీ ఉండదు. ఎన్నికల కమిషన్‌ను అభినందించాల్సిందే. ఎప్పుడూ ఏ ఎన్నికకూ లేనట్లు బీహార్ ఎన్నికలపైనా శ్రద్ధ పెట్టడం అటుంచితే ఆగస్టులో ముసాయిదా ప్రచురణకు ముందే బీహార్ ఓటర్ల జాబితాలోంచి 65 లక్షల మంది పేర్లను తొలగించడం, ఎన్నో విమర్శలకు గురైనా సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో మరికొన్ని జాగ్రత్తలతో నెల రోజులపాటు స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియతో మరో 3.66 లక్షల మంది పేర్లను తొలగించడంలో ఎన్నికల కమిషన్ విశేష శ్రమ తీసుకుందనే చెప్పాలి. ఇప్పటికీ ఓటర్లు వ్యక్తిగతంగా వారి వారి హక్కుల కోసం ఎన్నికల కమిషనర్‌ను సంప్రదించవచ్చుననే వెసులుబాటును కూడా ఇచ్చింది. ఏది ఏమయినా బీహార్ ఎన్నికలప్రక్రియకు ముందే ఎన్ని ఆరోపణలున్నా వాటిని అంచెలంచెలుగా సర్దుబాటు చేసుకుని రావడం, అసాంతం కొత్త కొత్త విధానాలకు కమిషన్ శ్రీకారం చుట్టింది. గతంగతః బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అనుసరించిన పద్ధతులన్నీ ఇతర రాష్ట్రాలకువర్తింప చేయడంలో ఎన్నికల కమిషన్ ఔచిత్యాన్ని ప్రశంసించాల్సిందే. తగిన సమయంలో అన్ని రాష్ట్రాలకు ఇదేప్రక్రియ విస్తరించేందుకు కమిషన్ ముందుకువచ్చింది. 15రోజుల్లో ఓటర్లకు ఎపిక్ కార్డులను అందచేసేందుకు నడుం కట్టింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందే 17 నూతన సంస్కరణలకు అంకురార్పణ చేయడం విశేషం. ఈవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలను వినియోగిస్తారు. పార్టీ ఎన్నికల గుర్తు కూడా రంగుల్లోనే. వందశాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్. ఇవన్నీ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకేనని సిఇసి జ్ఞానేశ్ కుమార్ స్పష్టంచేశారు. ఈ ఎన్నికలు దేశానికే రోల్‌మోడల్ అవుతాయని విశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు. వెబ్‌కాస్టింగ్ వల్ల అనుమానాలకు తావుండదు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సిసిటివి కెమెరాల్లో రికార్డుచేశారు. ఈవిఎం కౌంటింగ్ యూనిట్లలో ఓట్లులెక్కింపు జరిగినప్పుడు వివిప్యాట్ల వ్యత్యాసం గుర్తించదగినట్లుగా ఉంటే రీకౌంటింగ్‌కు ఆస్కారమిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం తీసుకున్న చర్యలను ఎన్నికల కమిషన్ సభ్యులు ముగ్గురూ దేశానికి తేటతెల్లం చేశారు. నవంబరు 22తో బీహార్ శాసనసభ సభాకాలం ముగుస్తుంది. ఆలోగానే బీహార్ ఎన్నికలు పూర్తి చేసే తలంపుతో నవంబరు 6, 11న పోలింగ్, 14న కౌంటింగ్ జరుగుతుందని ఇసి ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ జారీచేసింది. అయినా సుప్రీంకోర్టు కూడా బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దేశమంతటా ఇదే తరహాలో వాస్తవ ఓటర్ల జాబితా కోసం చేపట్టాలనుకున్న ప్రక్రియను పరిశీలించాలనుకుంటోంది. ఆ నేపథ్యంలోనే బీహార్ తుదిఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల పేర్లు, వివరాలతో అందచేయాలని సుప్రీం కేంద్ర ఎన్నికలసంఘాన్ని ఆదేశించింది. ఎలక్టోరల్ జాబితాలు పటిష్టంగా ఉంటే ఎన్నికలుఎంత సజావుగా నిర్వహించవచ్చునో బీహార్ ఎన్నికల ద్వారానే దేశానికి వెల్లడించేందుకు ఇసి నడుం కట్టడం అభిలషించదగినదే. ఇప్పుడు బీహార్ ప్రతిష్టాకర అంకంలోకి అడుగు పెడుతోంది. ఎన్‌డిఎ కూటమి అండతో ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, మూడోసారి రంగంలోకి దిగుతుండగా, లాలూప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి నేతృత్వంలో విపక్ష కూటమి కూడా పోటీకి ఉరుకులు పరుగులు తీస్తోంది. వీటన్నిటిని మించి ఎన్నో ఎన్నికల్లో ప్రధాన పార్టీల విజయానికి ప్రభావితం చేసిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ 'జనసురాజ్' కూడా పకడ్బందీ వ్యూహంతో ముందుకు కదులుతోంది.



తెలిసినవాడు సత్యం కోసం వాడిగా వేడిగా వాదిస్తాడు. తెలియని వాడు తన అభిప్రాయం కోసం వాదిస్తాడు.
టాల్‌స్టాయ్



మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.
పాస్కల్

# జీవన ప్రమాణానికే కాటు..గుండెపోటు

**గుండెపోటు ఇప్పుడు చిన్న,మధ్య వయస్కుల జీవితాలను దెబ్బతీస్తోంది. ఛాతీనొప్పి, చేయి లేదా దవడ వరకు నొప్పి రావడం, అకస్మాత్తుగా ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్త వడాలి. ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడుతుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా, జీవనశైలి సరిగా లేకపోయినా, ఈసీజీ, కొలెస్ట్రాల్,రక్తపోటు వంటి కీలకమైన పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, చురుకైన జీవనం గుండె పోటు ప్రమాదాన్ని సగానికి తగ్గిస్తాయి. పొగాకును మానేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం కేవలం మందులు వాడ టం కంటే మెరుగైన ఫలితాన్నిస్తాయి. పెరుగుతున్న ఈ మరణాలకు తక్షణమే పరిష్కారం చూపాలి. గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, మనందరి ప్రవర్తనలో మార్పురావడం రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకం.**

డి జయరాం

గుండెపోటు ఈ రోజుల్లో ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ఇది కేవలం వృద్ధులకే కాకుండా, చిన్న వయసు వారికి కూడా వస్తోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అకాల మరణాల సంఖ్య అకస్మాత్తుగా పెరుగుతోంది. ఇటీవల, కర్ణాటకలోని హాసన్ జిల్లాలో కేవలం 40 రోజుల్లో 22 మంది గుండెపోటుతో మరణించారు. వీరిలో దాదాపు సగం మంది 45ఏళ్ల లోపు వారు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గమనిస్తే, మన దేశం ఈ హృదయ సంబంధిత జబ్బుల ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది. మనదేశంలో గత మూడు సంవత్సరాలుగా గుండెపోటు మరణాలు విపరీతంగా పెరిగాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపిన వివరాల ప్రకారం, 2022లో గుండెపోటు కారణంగా 32,457 మంది మరణించారు. ఇది అంతకుముందు సంవత్సరంలో నమోదైన 28,413 మరణాల కంటే చాలా ఎక్కువ. ఈ నివేదిక ప్రకారం 2022లోనే గుండెపోటు కేసులలో 12.5పెరుగుదల నమోదైంది. ప్రపంచ గణాంకాలలో భారతదేశం హృద్రోగ మరణాల రేటులో రెండవ స్థానంలో ఉంది. మన దేశంలో ఏటా మరణిస్తున్న వారిలో సుమారు 20శాతం పురుషులు,17శాతం స్త్రీలు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం మన దేశంలో స్త్రీల కంటే పురుషులలో హృదయ సంబంధిత మరణాల రేటు ఎక్కువగా ఉంది. లక్ష మందిలో పురుషులలో 349 మంది, స్త్రీలలో 265 మంది మరణిస్తున్నారు. ఈ రేట్లు యూనైటెడ్ స్టేట్స్ కంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువగా ఉండటంగమనార్హం. దేశంలో అకస్మాత్తుగా సంభవించే మరణాలలో దాదాపు 57 శాతం కేవలం గుండెపోటు వల్లే జరుగుతున్నాయి. మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన పురుషులే ఉన్నారు. అంతేకాకుండా 2020 నుంచి 2023 మధ్య వచ్చిన గుండెపోటు కేసుల్లో దాదాపు సగం మంది 40 ఏళ్లలోపు వారే. ఇది యువతలో గుండె జబ్బులు వేగంగా, తక్కువ వయసులోనే వస్తున్నాయనే ప్రమాదకరమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది. ముఖ్యంగా, 30ఏళ్ల లోపువారిలో మరణాలు గత కొన్ని సంవత్సరాలలో 40 శాతంపెరిగాయి. గుండెపోటు మరణాలు ప్రధానంగా మహారాష్ట్ర, కేరళ, గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ జాబితాలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు వంటి ఇతర పెద్ద రాష్ట్రాలలో కూడా వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సంక్షోభం కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించి ఉందని ఇది నిరూపిస్తుంది. జీవనశైలి, జనాభా, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల కొరత వంటి కారణాల వల్ల పశ్చిమ, రాష్ట్రాలపై దీని ప్రభావం ఎక్కువ కనిపిస్తోంది. హాస్పిటల్ అధ్యయనాలు కూడా 2020 నుంచి దాదాపు సగం మంది గుండెపోటు రోగులు 40ఏళ్లలోపు వారే అనిచెబుతున్నాయి. గతంలో హృద్రోగాలు వృద్ధులకే వస్తాయనే భావన ఉండేది. కానీ ఇప్పుడు గుండె సమస్యలతో యువకులు అకాల మరణాలకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా, యువతలో గుండెపోటు సమస్యప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. చాలా మందికి తమకు ప్రమాదం ఉందని కూడా తెలియదు. యువ నిపుణులు, విద్యార్థులు, కార్మికులు వంటి వివిధ వర్గాల వారు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్నారు. దేశంలో గుండెపోటు కేసులు పెరగడానికి ఒకదానితో ఒకటి



ముడిపడి ఉన్న అంశాలు దోహదపడుతున్నాయి. అందులో ముఖ్యమైనవి ఫాస్ట్‌ఫుడ్, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలతో నిండిన ఆధునిక జీవనశైలి యువతలో ఊబకాయం, అధిక రక్తపోటు, అనారోగ్యకరమైన కొవ్వునిల్వలకు (లిపిడ్ ప్రొఫైల్‌లో తేడాలు) దారితీస్తున్నాయి. యువత తమ దినచర్యలో ఎక్కువ భాగాన్ని పనిలో లేదా విశ్రాంతి పేరుతో కూర్చుని గడుపుతున్నారు. ఇది బరువు పెరగడానికి, హృదయనాళ ఫిట్‌నెస్‌లో క్షీణతకు, తద్వారా గుండె సమస్యలకు దారితీసే ప్రమాదాన్ని పెంచుతుంది. పొగాకు వినియోగం, మాదకద్రవ్యాలు, మద్యం వాడకం మరొక ముఖ్య కారణం. ఉద్యోగాల్లో ఒత్తిడి, ఎక్కువ పని గంటలు, సరైన విశ్రాంతి లేకపోవడంవల్ల దీర్ఘకాలికంగా ఒత్తిడి పెరిగి గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. దీర్ఘకాలిక ఒత్తిడి అనేక విధాలుగా గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. డిప్రెషన్‌ను ఎదుర్కొంటున్న యువకులకు, డిప్రెషన్ లేని వారితో పోలిస్తే, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు రెండింతలు ఎక్కువగా ఉన్నాయని కొత్త అధ్యయనాలు కనుగొన్నాయి. దీనికితోడు, వంశపారంపర్యంగా ప్రజలకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అత్యవసర సేవలు, గుండె పరీక్షా కేంద్రాలు లేకపోవడం వల్ల చికిత్స అందించడంలో ఆలస్యం అవుతోంది. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, గుర్తించని దీర్ఘకాలిక జబ్బులు అధిక సంఖ్యలో ఉన్నాయి. అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటివి చాలా మందిలో అసలున్నట్లు కూడా గుర్తించడం లేదు. ఒకవేళ గుర్తించినా 20శాతంకంటే తక్కువ మంది మాత్రమే వాటిని అదుపులో ఉంచుకుంటున్నారు. ఈ ప్రమాదకరమైన పరిస్థితిని మార్చడానికి తక్షణమే అనేక చర్యలు తీసుకోవాలి. మొదటగా, పెద్దఎత్తున గుండె ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గుండెఆరోగ్యం గురించి, దానిలక్షణాల గురించి ప్రజల్లో విస్తృతంగాప్రచారం చేయాలి. అంతేకా కుండా పనిప్రదేశాలు, పాఠశాలల్లో తగిన ఆరోగ్య చర్యలు తీసుకోవాలి. అంటే, ఆఫీసులు, స్కూళ్లలో సరైనపని వేళలు, ఒత్తిడిని తగ్గించే పద్ధతులు, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలి. తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం హృద్రో గాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ప్రపంచఆరోగ్య సంస్థ పెద్దలందరికీ ప్రతివారం కనీసం 150 నిమిషాల మితమైన వ్యాయామం చేయాలని సిఫార్సు చేసింది. ధూమపానం మానేయడం హృదయ సంబంధవ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆల్కహాల్ అధిక వినియోగం హృదయ సంబం ధిత వ్యాధులకు దోహదం చేయడంతో పాటు, రక్తపోటుకు కూడా దారితీస్తుంది. చిన్న పట్టణాలు, గ్రామాల్లో అత్యవసర ఆరోగ్య సేవలు, గుండె జబ్బుల మందులు తక్కువ ధరలో అందేలాచూడాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, స్క్రీన్‌సమయాన్ని తగ్గించడంవల్ల బరువుతగ్గడం, ఇతర సమస్యలు దూరమవుతాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి పేదలకు సబ్సిడీ ఆరోగ్య సేవలు, ఉచిత స్క్రీనింగ్ క్యాంపుల నిర్వహణను తమ ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకోవాలి. గుండెపోటు ఇప్పుడు చిన్న,మధ్య వయస్కుల జీవితాలను దెబ్బతీస్తోంది. ఛాతీ నొప్పి, చేయి లేదా దవడ వరకు నొప్పిరావడం, అకస్మాత్తుగా ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తపడాలి. ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడుతుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా, జీవనశైలి సరిగా లేకపోయినా, ఈసీజీ, కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి కీలకమైన పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, చురుకైన జీవనం గుండెపోటు ప్రమాదాన్ని సగానికి తగ్గిస్తాయి. పొగాకును మానేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం కేవలం మందులు వాడటం కంటే మెరుగైన ఫలితాన్నిస్తాయి. పెరుగుతున్న ఈ మరణాలకు తక్షణమే పరిష్కారంచూపాలి. గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, మనందరి ప్రవర్తనలో మార్పురావడం రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకం. ●

# కుండపోత వర్షాలతో రైతాంగం విలవిల

మేకిరి దామోదర్

దేశవ్యాప్తంగా వాతావరణ మార్పులు భూగోళానికి సవాలు విసురుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు ఒకవైపు, అకాల వర్షాలు మరొకవైపు. ఈ రెండింటి దెబ్బకు ఋతువులు గతి తప్పుతున్నాయి. ప్రకృతి పగబట్టి అన్నదాతల ఆరుగాలం శ్రమను ముంచేస్తోంది. దీని ప్రభావంతో దేశంలో ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, కూరగాయల ధరలు ఎగిసే అవకాశం ఉందని క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక హెచ్చరించింది. 2022-23లో వేడి తీవ్రత సాధారణంకంటే 30రెట్లు అధికంగా నమోదైంది. గత 40ఏళ్లలో 30శాతం జిల్లాల్లో తక్కువ వర్షపాతం, మరోవైపు కొన్ని జిల్లాల్లో అతివృష్టి పెరిగిందని గణాంకాలు తెలుపుతున్నాయి. వర్షాధారంగా సాగుచేస్తున్న 15-40శాతం ప్రాంతాల్లో 2050 నాటికి ప్రస్తుత పద్ధతులు అనుకూలం కాని పరిస్థితి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో నిరాశ పరిచినా, చివర్లో విరుచుకుపడి రైతులను ముంచింది. జూన్‌లో వర్షాల మధ్య విరామాలుఉండగా, తర్వాత ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాలు, ద్రోణాలతో రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురిశాయి. రాష్ట్ర సగటు వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 33శాతం అధికంగా 988.3 మి.మీ. నమోదైంది. నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టగా, అక్టోబర్15లోపు పూర్తిగా నిష్క్రమించనున్నాయి. నారాయణపేట జిల్లా మరికల్‌లో 64.8 మి.మీ., మహబూబ్‌నగర్ ముసాపేటలో 63.6 మి.మీ., దేవరకద్రలో 63.1 మి.మీ. వర్షపాతం నమోదయింది. రాష్ట్రవ్యాప్తంగా 137 మండలాల్లో అత్యధిక వర్షాలు (60పైగా), 294 మండలాల్లో అధిక వర్షాలు (20-59 ), 187 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఇలా ప్రకృతి పగతో రైతులు విలవిలలాడుతున్నారు. ముందస్తు వర్షాలు, అధిక వర్షాల పరిస్థితుల్లోనూ రైతన్నకు నష్టమే. మొదట్లో పత్తి సాగు ఉత్సాహంగా సాగినప్పటికీ, రెండు నెలల వర్షాభావం పంటల ఎదుగుదల దెబ్బతీసింది. ఇప్పుడు తిరిగి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. పత్తి చేలల్లో మొలకలు వస్తున్నాయి, మొక్కజొన్న కుళ్లిపోతోంది. మిర్చి మొక్కలు కాయలతోనే కూలిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 45.47లక్షల ఎకరాల్లో పత్తి, 6.44 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.2 లక్షల ఎకరాల్లో మిరప సాగు జరిగింది. పంటలపై క్రమపద్ధతిలో వర్షాభావం-అతివృష్టి దెబ్బ తగిలి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. నీటితో నిండిన పొలాల్లో వేర్లు ఊపిరాడక పంటలు పాడైపోతున్నాయి. పత్తిలో రసంపీల్చే పురుగులు, మొక్కజొన్నలో కాండం కుళ్లు వ్యాపించాయి. ఇది కేవలం వ్యవసాయ సమస్య మాత్రమేకాదు, వాతావరణ సంక్షోభానికి సంకేతం కూడా. అకాల వర్షాలు, భూకంపాలు, ఆమ్లవర్షాలు ఇవన్నీ మానవ జాతి మనుగడకే ముప్పుతెస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ స్థాయిలో చర్చించి నివారణ చర్యలు చేపట్టడం అత్యవసరం. ప్రభుత్వాలు శీఘ్రప్రగతి పేరుతో సహజ వనరుల నాశనానికి దారితీసే పారిశ్రామికీకరణను నియంత్రించాలి. భూతాప ఉద్గారాలను తగ్గించే విధానాలు రూపకల్పన చేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే రకాలవిత్తనాలను ప్రోత్సహించి, గ్రీన్‌హౌస్ సాగు, రక్షిత వ్యవ సాయ పద్ధతులు విస్తరించాలి. రైతులకు కోల్డ్‌స్టోరేజీలు, శీతల రవాణా వసతులు, మెరుగైన సరఫరా గొలుసు వ్యవ స్థలు అందుబాటులో ఉండాలి. మానవ మనుగడను కాపాడేమార్గం ప్రకృతిని గౌరవించడం ద్వారానే సాధ్యం. అందరూ తమవంతు బాధ్యత నిబద్ధతతో నిర్వర్తించినప్పుడే జీవకోటి నిలబడగలదు. ●

# న్యాయవ్యవస్థలో పారదర్శకత పెరగాలి

శిరందాసు నాగార్జున

దేశంలో ఎన్నడూ లేనంతగా న్యాయవ్యవస్థ కొంతమంది న్యాయమూర్తులు అవినీతికి పాల్పడుతున్నారనే అపప్రథ తలకెత్తుకుంది. హైకోర్టులతోపాటు సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్నితీర్పులు, చేసిన వ్యాఖ్యానాలు విస్మయం కలిగిస్తున్నాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగు మూల స్తంభాలు. వీటిలో ఏ ఒక్కటీ మరొకదాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం చేసినా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. ముఖ్యంగా అస్థిరమైన రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా న్యాయవ్యవస్థ ఉండాలి. ఆదిశగా న్యాయవ్యవస్థ స్వీయప్రక్షాళనకు దిగింది. అయినా, న్యాయం అందరికీ సమానంగా అందుతుందా? బెయిల్ విషయంలో పేదవాడికి ఒక రకంగా, రాజకీయ నాయకుడు, ఆర్థిక నేరగాళ్లకు ఒక రకంగా ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం, జైళ్లపాలు కావడంతో, న్యాయమూర్తులు తమకు అనుకూలమైన వారుగా ఉండాలనే భావన వారిలో మొదలైంది. ఈరకమైన ఆలోచనలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అయినా, న్యాయవ్యవస్థలో ప్రభుత్వం జోక్యానికి ఎమర్జెన్సీ కాలంలోనే బీజం పడింది. అప్పటి ప్రధానమంత్రి ఎన్నికను అలహాబాద్ కోర్టు రద్దు చేసింది. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో తీర్పుతమకు అనుకూలంగా రావాలన్న ఆలోచన ఆనాటి ప్రభుత్వ పెద్దల్లో వచ్చింది. దాంతో, అప్పుడు సీనియారిటీ ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని కాదని, 4వ స్థానంలో ఉన్న జడ్జిని ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఆ నియామకాన్ని వ్యతిరేకిస్తూ, సీనియర్ జడ్జీలు రాజీనామాలు చేశారు. అప్పటి నుంచి కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా, జడ్జీల నియామకాల్లో, బదలీల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ వస్తోంది. అవినీతికి పాల్పడిన కొందరు రాజకీయ నాయకులు, వ్యాపారులు న్యాయమూర్తులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రూ.1.9 కోట్ల మోసం కేసులో సరైన ఆధారాలు లేకుండా నిందితులైన దంపతులకు బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ సెషన్స్ కోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులకు గత సెప్టెంబరు నెలలో సుప్రీం కోర్టు శిక్ష విధించింది. గతంలో కూడా అనేక సంఘటనలు జరిగాయి. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఆరోపణలు రావడంతో, ఆయన రాజీనామా చేశారు. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఒకరు 2011లో రాజీనామా చేశారు. రాజ్యసభ అభిశంసనకు గురైన తొలి న్యాయమూర్తిగా ఆయన నిలిచారు. ఓబులాపురం మైనింగ్ కేసులో నిందితుడు గాలి జనార్దన రెడ్డి ప్రలోభాలకు లోనై బెయిలు ఇచ్చిన కేసులో 2012లో నలుగురు జడ్జీలు అరెస్ట్ అవడం అప్పట్లో సంచలనం కలిగించింది. ఇటీవల అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇంట్లో కోట్ల



రూపాయల నోట్ల కట్టలు దొరికాయి. ఆయనపై రాజ్యసభలో, లోక్‌సభలో వివిధ రాజకీయ పార్టీలు అభిశంసన నోటీసులు కూడా ఇచ్చాయి. ఇవన్నీ బహిరంగమైన అంశాలు. న్యాయమూర్తుల అవినీతికి సంబంధించిన అన్ని అంశాలు వెల్లడికావు. ఇందుకు సంబంధించి వారికి అంతర్గత విచారణ వ్యవస్థ ఒకటి ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులపై ఫిర్యాదులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే చేరతాయి. న్యాయవ్యవస్థ పనితీరు, అవినీతి ఆరోపణలకు సంబంధించి 2017 జనవరి 1నుంచి 2021 డిసెంబర్ 31వరకు 1631 ఫిర్యాదులు అందాయి. కేంద్ర మంత్రి లోక్‌సభకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ద్వారా ఈ విషయాలు తెలిశాయి. అయితే, అంతర్గత విచారణ వ్యవస్థ రహస్యంగా ఉంటుంది. అందువల్ల, ఈఫిర్యాదులపై విచారణ ఏ స్థాయిలో ఉందో, ఏ రకమైన చర్యలు తీసుకున్నారో బయటకు తెలియదు. ఇంతేకాకుండా, కోర్టు వ్యాఖ్యలు, తీర్పులపై కూడా అనేక భిన్నమైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెళ్లైన తర్వాత భార్య అయినా, భర్త అయినా మరొకరితో ఇష్టంగా శృంగారంలో పాల్గొంటే నేరం కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం జరపడం నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కుల వ్యవస్థపై నిర్మితమైన మన సమాజంలో న్యాయమూర్తుల నియామకాల విషయంలో కూడా కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2018 నుంచి మొత్తం 715 మంది హైకోర్టు న్యాయమూర్తులను నియమించారు. వారిలో 551 మంది (77.06 ) అగ్రవర్ణాలకు చెందినవారే ఉన్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి ఈ ఏడాదిలో మార్చిలో రాజ్యసభలో వెల్లడించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ తెలిపిన ప్రకారం, 2018 నుంచి ఈ ఏడాది జూలైవరకు హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన 743 మందిలో 93 మంది ఓబీసీలు (12.5 శాతం) మాత్రమే ఉన్నారు. పదవీవిరమణ చేసిన వెంటనే కొందరు న్యాయమూర్తులు పదవులలో నియమితులు కావడం పలు విమర్శలకు గురౌతోంది. ఆ విధంగా ప్రభుత్వ పదవులు పొందడం మంచి పద్ధతి కాదు. ఆ పదవులు ఆశించే, న్యాయమూర్తులు పదవిలో ఉండగా, ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు అనుకూలంగా తీర్పులుఇచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు భావించే అవకాశంఉంది. మరోవైపు, రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయేలా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, 600 మంది న్యాయవాదులు గత ఏడాది ఏప్రిల్‌లో సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అనవసర ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ఏ విధమైన ఒత్తిళ్లకు లొంగకుండా న్యాయవ్యవస్థ పవిత్రత, స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో, లోపాలను సరిదిద్దడంతోపాటు న్యాయవ్యవస్థ స్వతంత్రను కూడా కాపాడాలి. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లకుండా ఉండేందుకు అటు రాజకీయ వ్యవస్థ, ఇటు న్యాయ వ్యవస్థ తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, న్యాయవ్యవస్థ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, విశ్వసనీయతను పరిరక్షించడంలో పలువురు న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి ఎలాంటి పదవులు తీసుకోరాదని బహిరంగంగా ప్రతిన చేశారు. అలాగే, 21 మంది న్యాయమూర్తులు వారి ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఆ వివరాలను సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఇవన్నీ స్వాగతించదగినవే. ఈ విధంగా న్యాయవ్యవస్థ స్వీయ ప్రక్షాళన ఆవశ్యకత ఎంతో ఉంది. ●

# ప్రజావాక్కు



## అప్రమత్తతే మన రక్షణ కవచం

**ఇటీవలి** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఛింద్వారా జిల్లాలో జరిగిన చిన్నారుల మరణాలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించాయి. ప్రాథమిక విచారణలో ఈమరణాలు కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ సేవనంతో సంబంధం ఉన్నట్లు తేలింది. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం జిల్లాలో తయారైన ఈ సిరప్‌లో డైఎథిలీన్ గ్లైకాల్ అనే అత్యంత విషపూరిత రసాయనం అధిక మోతాదులో ఉన్నట్టు ప్రయోగశాల పరీక్షలువెల్లడించాయి. ఈసంఘటన తర్వాత మధ్యప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మందు విక్రయాన్ని, పంపిణీని, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాయి. ఔషధ తయారీ, పంపిణీ వ్యవస్థల్లో పారదర్శకత లేకపోతే ప్రజారోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుందో ఈ ఘటన స్పష్టంగా చూపించింది.

- డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ, హైదరాబాద్

## ప్రాణాలు తీస్తున్న ఆస్పత్రులు

**జైపూర్‌లోని** ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి సవాయి మాన్ సింగ్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళనరేపింది. ముఖ్యంగా అత్యవసరచికిత్స అవసరమైన రోగులు ఉన్న విభాగంలో మంటలు చెలరేగడం వలన పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మొదట షార్ట్ సర్క్యూట్ కారణమని చెప్పినా, వాస్తవానికి ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం, అగ్నిభద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పరికరాలు సరిగా పనిచేయకపోవడం వంటిఅంశాలే ప్రధాన కారణాలుగా స్పష్టమవుతున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో రోగులను తరలించే ప్రయత్నాలు జరిగినా గందరగోళం కారణంగా పరిస్థితిని అదుపులోకి తేలికగా తీసుకురాలేకపోయారు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## న్యాయమూర్తి మీద దాడి అమానుషం

**సుప్రీంకోర్టు** ప్రధానన్యాయమూర్తి జస్టిస్‌బీ.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, దేశంపై జరిగిన దాడే అని చెప్పవచ్చు. ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటంతో దేశ రాజ్యాంగాన్ని ఏమైనా చేయగలమనే ఉన్మాదానికి తెగించారు. బీ.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని అందరూ తీవ్రంగా ఖండిస్తున్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని కోరుకుందాం.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ఆచి తూచి మాట్లాడాలి

**రాజకీయ** నాయకులు ఓట్లకోసం పదవులకోసం ఏదైనా మాట్లాడతారు. కాని బాధ్యతాయుతమైన పదవులలో నున్నవారు ఆచి తూచి మాట్లాడాలి. ఆపరేషన్ సిందూర్ మరోమారు సంభవిస్తే పాకిస్థాన్ అనే దేశం ఉండదని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఓ వేదిక మీద అన్నారు. కాని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్థాన్‌ను ధ్వంసం చేస్తామని ప్రకటించడం సబబు కాదేమోనని అనిపిస్తోంది. నిజంగా మరోసారి యుద్ధమే సంభవిస్తే పాకిస్థాన్‌కు ఏలా బుద్ధి చెప్పాలో ప్రభుత్వమే సంకేతాలు ఇస్తుంది. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం సైనికులుకు యుద్ధంజరుగుతున్నప్పుడే. యుద్ధం అంటూ వస్తే భారత్‌ను సర్వనాశనం చేస్తామని పాక్ మంత్రి ఒకరు అన్నారని వార్త. భారత్‌తో పాకిస్థాన్ ఎన్నో యుద్ధాలు చేసింది. ఒక్కటైనా గెలవగలిగిందా? అమెరికా, సౌదీ అరేబియా, ఇరాన్ అండదండలు చూసుకుని పాక్ పేట్రేగిపోతున్నది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అమెరికా ఆర్థిక మాంద్యం

**జరుగుతున్న** పరిణామాలు చూస్తే అలాగే అనిపిస్తోంది దానికి కారణాలు రెండు ఉన్నాయి. ఒకటి ఆధిపత్య ధోరణికి ప్రపంచం బయపడడం లేదు రెండు వర్ధమాన దేశాలు అమెరికా వంటి అగ్ర దేశపు డాలర్‌ను ఉమ్మడి ఆర్థిక వస్తువుగా లేదా ఉమ్మడి చెల్లుబాటు నాణెంగా గుర్తించడానికి నిరాకరిస్తున్నాయి. అందుకే ఆసియాన్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పడింది. ఇప్పుడు ఎస్ సీవో అభివృద్ధి బ్యాంక్ కూడా ఫామ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆఫ్రికన్ కూటమిని జీ20 దేశాల కూటమిలోకి ఆహ్వానించి భారత్ ముందడుగు వేసింది. ఇప్పుడు అమెరికా నిజానికి మేకపోతు గాంభీర్యం తప్ప ఏమీ చేయలేకపోతోంది.

-యార కొమురయ్య, అక్కపల్లిగూడెం

## వికలాంగులకు రక్షణ కల్పించాలి

**వికలాంగుల** హక్కుల చట్టాలను కఠినతరం చేయాలి. వికలాంగుల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. దూషిస్తున్నారు. గ్రామపంచాయతీ నుండి మంచి నీటి కోసం సొంతగా తీసుకున్న నల్లా కలెక్షన్ పైప్‌కు రంధ్రాలు చేసి వికలాంగుల ఇళ్లకు మంచి నీళ్లు రాకుండా చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పోలీస్‌లకు ఫిర్యాదు చేసినా కూడా ఎవరు పట్టించుకోవడం లేదు. పోలీస్ స్టేషన్ నుండి వికలాంగులకు రక్షణ కలిపించాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మద్రాసు హైకోర్టు తీర్పుపై సుప్రీంలో విజయ్ సవాల్

## సిట్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నదని ఆరోపణ

**చెన్నై, అక్టోబరు 8:** తమిళనాడులోని కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 60 మందికిపైగా గాయపడ్డారు. ఇక ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీవీకే పార్టీ సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. ఐపీఎస్ అధికారి అశ్రా గార్గ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను టీవీకే సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఘటనపై దర్యాప్తునకు హైకోర్టు రాష్ట్ర పోలీసు అధికారులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, కరూర్ ఘటన విషయంలో విజయ్ తీరును మద్రాసు హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే. తొక్కిసలాట జరిగిన వెంటనే టీవీకే అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ అక్కడ నుంచి మాయం కావడం, ఆయనపై ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. ఇదేం రాజకీయ పార్టీ అంటూ టీవీకేని విమర్శించిన జస్టిస్ ఎన్ సెంథిల్‌కుమార్ తొక్కిసలాట మరణాల తర్వాత అక్కడి నుంచి ఆ పార్టీకి చెందిన బాధ్యులందరూ పారిపోయారని, ఎవరూ బాధ్యతను తీసుకోలేదని మండిపడ్డారు.

ముఖ్యంగా పిల్లలు, మహిళలు మరణించడాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి టీవీకే వ్యవహార శైలిని ఖండించారు. దుర్ఘటన పట్ల టీవీకే కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని, ఆ పార్టీ నాయకుడి మానసిక స్థితికి ఇది అద్దం పడుతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తును కోరుతూ దాఖలైన పిటిషన్‌ని తిరస్కరించిన కోర్టు సీనియర్ ఐపీఎస్ అధికారి, నార్త్ జోన్ ఐజీ అస్రా గర్గ్ నేతృత్వంలో సిట్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఘటనపై 'సిట్' దర్యాప్తు మొదలైంది. సిట్‌లో తనతోపాటు మరో ఇద్దరు ఐపీఎస్ స్థాయి అధికారులు సహా 11మంది పోలీసు అధికారులు ఉన్నారని సిట్ ప్రధాన అధికారి గార్గ్ చెప్పారు. ఘటనాస్థలాన్ని సిట్ అధికారులు పరిశీలించారు.

# దీపావళికి కాలిఫోర్నియాలో ప్రభుత్వ సెలవు



**కాలిఫోర్నియా, అక్టోబరు 8:** భారత్‌లో ఎంతో పవిత్రంగా జరుపుకునే దీపావళి పండుగకు అమెరికాలోని కాలిఫోర్నియాలో గుర్తింపు దక్కింది. దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఆ రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు ఏబీ-268 బిల్లుపై కాలిఫోర్నియా గవర్నర్ గ్యావిన్ న్యూసమ్ సంతకం చేశారు. దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రతిపాదిస్తూ గతంలోనే ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లును తీసుకొచ్చారు. ఇప్పుడు దానికి ఆమోదం లభించింది. తాజాగా ఈ బిల్లును గవర్నర్ కూడా ఆమోదించడంతో ఇది చట్టంగా మారింది. 2026 జనవరి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి రానుంది. దీని ప్రకారం కాలిఫోర్నియా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి రోజు వేతనంతో కూడిన సెలవు లభిస్తుంది. అలాగే పాఠశాలలు, కమ్యూనిటీ కాలేజీలకు కూడా సెలవు ఇవ్వొచ్చు. అయితే కోర్టులకు మాత్రం ఈ సెలవు వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పటికే అమెరికాలోని పెన్సిల్వేనియా, కనెక్టికట్ రాష్ట్రాలు దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించాయి. ఇప్పుడు ఈ జాబితాలో మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. కాగా, అమెరికాలో భారతీయ సంస్కృతికి ఇది గొప్ప గుర్తింపు అని సాంస్కృతిక వైవిధ్యానికి గౌరవం తెలిపే చారిత్రక అడుగు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఎగుమతుల స్థాయికి చేరిన మేడిన్‌ఇండియా 4జిస్టాక్

## ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** టెలికాం రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని అందుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన మేడ్‌ఇన్‌ఇండియా 4జీ స్టాక్ ఇప్పుడు ఎగుమతికి సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రకటించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 ప్రారంభ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం రంగం అద్భుతమైన పురోగతి సాధించిందని ప్రధాని గుర్తుచేశారు. ఒకప్పుడు 2జీ నెట్‌వర్క్ కోసం ఇబ్బంది పడిన స్థాయి నుంచి నేడు దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు 5జీ సేవలు విస్తరించాయని ఆయన తెలిపారు. ఒకప్పుడు వెనుకబడిన మనం, ఇప్పుడు చాలా దూరం ప్రయాణించాం. నేడు దేశం నలుమూలలా 5జీ అందుబాటులో ఉందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా లక్ష టవర్ల ఏర్పాటు ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, భారీ టెలికాం మౌలిక సదుపాయాలను నిర్మించడంలో మన సామర్థ్యాన్ని ఇది రుజువు చేసిందని పేర్కొన్నారు. ఈ కొత్త 4జీ టెక్నాలజీ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్, నమ్మకమైన సేవలు, అంతరాయం లేని కనెక్టివిటీ సాధ్యమవుతాయని, ఇది టెక్నాలజీలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని మోదీ చెప్పారు. 2014 నుంచి దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ల తయారీ 28 రెట్లు పెరిగిందని ప్రధాని మోదీ గణాంకాలతో వివరించారు. ఇదే సమయంలో మొబైల్ ఎగుమతులు ఏకంగా 127 రెట్లు పెరిగాయని చెప్పడం గమనార్హం. ఈ ఘనత వెనుక స్టార్టప్‌ల ఆవిష్కరణలు, యువత శక్తి ఉన్నాయని ఆయన ప్రశంసించారు. డిజిటల్ ఇన్నోవేషన్ స్క్వేర్, టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ వంటి పథకాలు కొత్త ఆలోచనలకు నిధులు అందించి ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఇప్పుడు ఆసియాలోనే అతిపెద్ద డిజిటల్ టెక్నాలజీ ఫోరంగా ఎదిగిందని, ఇది దేశ ప్రతిభకు, ఆవిష్కరణలకు ప్రపంచ వేదికగా నిలుస్తోందని మోదీ అన్నారు.

# జుబిన్‌గార్గ్ కజిన్ సందీపన్‌గార్గ్ అరెస్ట్

**గువాహతి, అక్టోబరు 8:** అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ మృతి కేసులో ఆయన కజిన్, అసోం పోలీస్ సర్వీస్ అధికారి సందీపన్ గార్గ్‌ను అరెస్టు చేశారు. జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జుబీన్ గార్గ్ మృతి చెందిన సమయంలో సందీపన్ ఆయనతోనే ఉన్నారు. ఈ మృతిపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ వరుస విచారణలు జరిపిన అనంతరం సందీపన్‌ను అదుపులోకి తీసుకుంది. జుబీన్ గార్గ్ ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించగా, వారి ఖాతాల్లో దాదాపు రూ. 1 కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్ట్ కోసం జుబీన్ గత నెలలో సింగపూర్ వెళ్లారు. సెప్టెంబర్ 19న యాట్ పార్టీలో భాగంగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు.




# బీహార్ కూటముల్లో సీట్ల తకరారు

## అడిగిన సీట్లు ఇవ్వాల్సిందే - లేదంటే మా దారి మాదే

### తేల్చి చెబుతున్న చిన్నపార్టీలు - తలపట్టుకుంటున్న కూటమి నేతలు

### కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు - రేపే తొలి దశ నోటిఫికేషన్

**పాట్నా, అక్టోబర్ 8:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. శుక్రవారం 10వ తేదీన తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, సీట్ల సర్దుబాటుపై పార్టీలు దృష్టి సారించాయి. అధిక బీహార్‌లో ఎన్‌డీఏ, మహాఘట్ బంధన్ కూటములు ఉన్న విషయం తెలిసిందే. ఈ కూటముల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. శుక్రవారం తొలి దశ నోటిఫికేషన్ రానుంది. ఈ నేపథ్యంలో కూటముల్లోని ఆయా పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుకు ప్రాథమిక చర్చలు ప్రారంభమయ్యాయి. కూటముల్లోని చిన్న పార్టీలు ఈసారి తమకు గతం కంటే ఎక్కువ స్థానాలు పట్టుబడుతున్నాయి. అధికార ఎన్‌డియే కూటమిలో సీట్ల పంపకాలపై ఇప్పటికే నేతల మాటల యుద్ధం జరుగుతోంది. కీలక భాగస్వామి, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ సారి తమకు 45-50 స్థానాలు ఇవ్వాల్సిందే, లేదంటే తమ దారి తాము చూసుకుంటామని బిజెపి పెద్దలకు తేల్చిచెప్పారు. మరో కేంద్ర మంత్రి, హెచ్ఏఎం అధినేత జితన్ రామ్ మాంజీ కూడా కూటమి నేతలకు అల్టిమేటమ్ జారీ చేశారు. తమకు 15 సీట్లకు తక్కువ కాకుండా చూడాలని ప్రతిపాదించారు. అయితే, బిజెపి అగ్రనాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులేస్తోంది. ఎన్‌డియేలో కీలక భాగస్వామ్య పార్టీలైన బిజెపి- జెడియులు చెరో 103, 102 స్థానాల్లో పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన 38 స్థానాలను కూటమిలోని పార్టీలకు సర్దుబాటు చేయడానికి బిజెపి పెద్దలు, సిఎం నితీశ్ కుమార్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చిరాగ్‌కు 20 సీట్లు, మాంజి, ఉపేంద్ర కుష్వాహకు 10, 8 సీట్లు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు ఎన్‌డియే వర్గాలు తెలిపాయి. రెండు మూడు రోజుల్లో కూటమి నేతల మధ్య చర్చలు కొలిక్కి వస్తాయని, సీట్ల సర్దుబాబుపై ప్రకటన ఉంటుందని బిజెపి నేతలు చెబుతున్నారు. ఇప్పటికే చిరాగ్‌తో తమ పార్టీ అగ్రనాయకత్వం చర్చలు జరుపుతోందని, అంతా సర్దుకుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అటు మహాఘట్ బంధన్‌లో కూడా సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అయితే, మహాఘట్ బంధన్‌లోని ఆయా పార్టీల సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించాలని ఆదేశించినట్లు పార్టీ వర్గాల సమాచారం. అనధికారిక సమాచారం ప్రకారం, ఆర్‌జెడీ ఈసారి 130 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయనుందని, కాంగ్రెస్ 50 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టే అవకాశముంది. వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఐ(ఎంఎల్), సిపిఐ(ఎం) మొత్తం 35 స్థానాలు, లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి) పరాస్ వర్గానికి 2 సీట్లు, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) 6 సీట్లు లభిస్తాయని మహాఘట్‌బంధన్ వర్గాలు తెలిపాయి. కూటమిలో అతిపెద్ద పార్టీగా ఆర్‌జెడి అత్యధిక సీట్లలో పోటీ చేయనుంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్ బరిలో దిగనున్నారు. ఈసారి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు ఆర్‌జెడి వర్గాలు తెలిపాయి. కొంతమంది కాంగ్రెస్ నాయకులు మొదట్లో 70 సీట్లకు పైగా డిమాండ్ చేయగా, రాహుల్ గాంధీ - తేజస్వి యాదవ్ మధ్య జరిగిన సమావేశం తర్వాత 50 సీట్లకు అంగీకారం కుదిరిందని సమాచారం. గత ఎన్నికల్లో దాదాపు 9శాతం ఓట్లతో కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది. ఈ సారి తమకు ఎక్కువ స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు వాదించినట్లు తెలుస్తోంది. కానీ మహాఘట్ బంధన్‌లో ఐక్యతను కాపాడటానికి, కాంగ్రెస్ పార్టీ రాజీ ఫార్ములాకు అంగీకరించాలని నిర్ణయించుకుని ఉండవచ్చు అని సమాచారం. గత ఎన్నికల్లో సిపిఐ(ఎంఎల్) అత్యుత్తన ఫలితాలు సాధించడంతోపాటు, ఆర్‌జెడి, కాంగ్రెస్‌కు అనేక నియోజకవర్గాల్లో సహాయ పడింది. దాంతో ఈసారి మహాఘట్ బంధన్‌లో వామపక్షాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఈసారి సిపిఐ (ఎంఎల్) 20 స్థానాల్లో, సిపిఐ 8, సిపిఎం 7 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. సీమాంచల్, మగధ్, తిర్హుట్ ప్రాంతాల్లో మహాపక్షాలకు పటిష్టమైన కేడర్‌తోపాటు గతంలో ఎన్‌డియేలో భాగమైన ముఖేష్ సాహ్నీ వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) ఈసారి మహాఘట్‌బంధన్‌తో చేతులు కలిపింది. విఐపికి 20 స్థానాలు కేటాయించే అవకాశముంది. జెఎంఎం సీమాంచల్, జార్ఖండ్ సరిహద్దులోని ఆరు స్థానాల్లో పోటీ చేయనుంది. పశుపతి కుమార్ పరాస్ వర్గమైన లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి-ఆర్‌వి)కి రెండు సీట్లు దక్కనున్నాయి. ఇదిలా ఉండగా, మహాఘట్ బంధన్‌లోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించిన రెండు రోజుల్లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం తీసుకుంటామని ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. కూటమిలోని పార్టీల మధ్య సీట్లకు సంబంధించి ఎలాంటి తకరారు లేదని, ఒకసారి అంతా కూర్చుని మాట్లాడుకుంటే సర్దుకుంటుందని పేర్కొన్నారు. మరోవైపు ప్రశాంత్ కిశోర్, అసదుద్దీన్, అరవింద్ కేజ్రీవాల్ కూటములతో సంబంధం లేకుండా ఒంటరిగా బరిలోకి దిగనున్నాయి. కేజ్రీవాల్ ఇప్పటికే 'ఆప్' తరఫున 11 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఎంఐఎం అధినేత మాత్రం ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఏదిఏమైనా రెండు మూడు రోజుల్లో కూటముల మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించి ప్రకటన వెలువడే అవకాశముంది.

# హైవేపై 65 కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్‌జామ్

**పాట్నా, అక్టోబరు 8:** దేశంలోని అత్యంత రద్దీ జాతీయ రహదారుల్లో ఒకటైన ఢిల్లీకోల్‌కతా హైవే (ఎన్‌హెచ్19)పై ప్రయాణం నరకంగా మారింది. బీహార్‌లో గత నాలుగు రోజులుగా ఏకంగా 65 కిలోమీటర్ల పొడవునా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వందలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు తిండి, నీళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే, బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో గత శుక్రవారం కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఈ దుస్థితి తలెత్తింది. జాతీయ రహదారి 19పై ఆరు వరుసల రహదారి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మళ్లింపులు, సర్వీస్ రోడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి, నీరు నిలిచిపోయింది. వాహనాలు బురదలో కూరుకుపోతుండటంతో ట్రాఫిక్ గంటగంటకు మరింత తీవ్రమవుతోంది. రోహ్‌తాస్ జిల్లాలో మొదలైన ఈ ట్రాఫిక్ జామ్ దాదాపు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔరంగాబాద్ వరకు విస్తరించింది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, వాహనాలు 24 గంటల్లో కేవలం 5 కిలోమీటర్లు కూడా ముందుకు కదలడం లేదు. గత 30 గంటల్లో మేము కేవలం 7 కిలోమీటర్లే ప్రయాణించాం. టోల్, రోడ్ ట్యాక్స్‌లు అన్నీ కడుతున్నా గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నాం. ఇక్కడ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సిబ్బందిగానీ, స్థానిక అధికారులుగానీ కనిపించడం లేదని ప్రవీణ్ సింగ్ అనే ట్రక్కు డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా ట్రాఫిక్‌లోనే ఉన్నాం. ఆకలి, దాహంతో అల్లాడుతున్నాం. కొన్ని కిలోమీటర్లు దాటడానికే గంటలు పడుతోందని సంజయ్ సింగ్ అనే మరో డ్రైవర్ వాపోయారు. ఈ ట్రాఫిక్ జామ్ వల్ల పండ్లు, కూరగాయల వంటి త్వరగా పాడైపోయే సరుకులను రవాణా చేస్తున్న డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. అత్యవసర సేవలు అందించే అంబులెన్సులు, పర్యాటక వాహనాలు, పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించాలని



ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ రంజిత్ వర్మను కోరగా, ఆయన కెమెరా ముందు మాట్లాడటానికి నిరాకరించారు. స్థానిక యంత్రాంగం గానీ, నిర్మాణ సంస్థ గానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# వద్దన్నా వినకుండా విహారయాత్రకు వెళ్లిన పంజాబీ గాయకుడు మృతి!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** పంజాబీ గాయకుడు రాజ్‌వీర్ జవాండా (35) బుధవారం మృతి చెందారు. భార్య వద్దన్నా విహారయాత్రకు వెళ్లిన ఆయనకు ఇటీవల ప్రమాదం జరిగింది. దీంతో 11 రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్న ఆయన బుధవారం ప్రాణాలు కోల్పోయారు. జవాండా తన మోటార్ సైకిల్‌పై ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాకు విహారయాత్రకు బయలుదేరారు. సోలన్ జిల్లా సమీపంలో అడ్డుగా వచ్చిన పశువులను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఆయన తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అక్కడి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మొహాలీలోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. దాదాపు 11 రోజులుగా ఆయన వెంటిలేటర్ పైనే ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన ప్రాణాలు కోల్పోయారు. అయితే విహారయాత్రకు వెళ్లవద్దని జవాండా భార్య ముందుగానే హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆమె మాటలు జవాండా వినలేదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఇక, గాయకుడి మృతిపై ఆప్ నేత మనీష్ సిసోడియా సహా పలువురు ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. జవాండా లుథియానా జాగ్రావ్‌లోని పోనా గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పంజాబీలో పలు పాటలు పాడారు. పాటలు పాడటమే కాకుండా సుబేదార్ జోగిందర్ సింగ్, 'జింద్ జాన్, మిండో తసీల్‌దర్ని' వంటి చిత్రాల్లోను నటించారు.

# అమెరికాలో కాల్పులు: మరో భారతీయుడు బలి

**పిట్స్‌బర్గ్, అక్టోబరు 8 :** అమెరికాలో కాల్పుల మోతకు మరో భారతీయుడు బలయ్యాడు. పెన్సిల్వేనియాలోని పిట్స్ బర్గ్‌లో మోటెల్ వ్యాపారి రాకేశ్ ఎహగబన్ (51)ను ఓ వ్యక్తి పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో తలపై గన్‌తో కాల్చాడు. ఈ ఘటనలో రాకేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గత శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాకేశ్ ఎహగబన్ పిట్స్ బర్గ్‌లోని రాబిన్సన్ టౌన్‌షిప్‌లో మోటెల్ నడిపిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తన మోటెల్ బయట గొడవ జరుగుతుండటంతో దాన్ని ఆపేందుకు రాకేశ్ బయటకు వెళ్లాడు. ఎందుకు గొడవ పడుతున్నారని అడగడంతో నిందితుడిని తన దగ్గర ఉన్న గన్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు మోటెల్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రాకేశ్‌పై కాల్పులు జరిపిన వ్యక్తిని స్టాన్లీ యుజెన్ వెస్ట్(37)గా పోలీసులు గుర్తించారు. రాకేశ్ తర్వాతే అక్కడే ఉన్న మరో యువతిపైనా నిందితుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు.

# పురుషులకంటే మహిళల్లోనే డిప్రెషన్ ఎక్కువ!

**మెల్‌బోర్న్, అక్టోబరు 8:** ఆరోగ్యపరంగా వైద్యపరిభాషలో మనం పిలుచుకునే కుంగుబాటు అంటే డిప్రెషన్ రుగ్మతలు పురుషులతో పోలిస్తే మహిళల్లోనే ఎక్కువ కనిపిస్తున్నదని ఎందుకు డిప్రెషన్ ఎక్కువగా కనిపిస్తుందనే ప్రశ్నలకు కూడా శాస్త్రవేత్తలు కీలక సమాధానం కనుగొన్నారు. దీని వెనుక బలమైన జన్యుపరమైన కారణాలు ఉన్నాయని ఆస్ట్రేలియా పరిశోధకులు తమ తాజా అధ్యయనంలో తేల్చారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో డిప్రెషన్ చికిత్స విధానంలో విప్లవాత్మక మార్పులకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. క్యూఐఎంఆర్ బెర్గోఫర్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే అతిపెద్ద అధ్యయనాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా లక్షలాది మంది డీఎన్‌ఏను విశ్లేషించారు. పురుషులతో పోలిస్తే మహిళల డీఎన్‌ఏలో డిప్రెషన్‌కు కారణమయ్యే జన్యుపరమైన లోపాలుదాదాపు రెట్టింపు సంఖ్యలో ఉన్నాయని ఈ బృంద ం గుర్తించింది. ఈ పరిశోధన వివరాలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బ్రిటనీ మిచెల్ వెల్లడించారు. సాధారణంగా మహిళలు తమ జీవితకాలంలో పురుషుల కన్నా రెండు రెట్లు ఎక్కువగా డిప్రెషన్‌కు గురవుతారని మాకు తెలుసు. అయితే దీనికి గల కచ్చితమైన కారణాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. మా అధ్యయనంలో స్త్రీ, పురుషులిద్దరిలో డిప్రెషన్‌కు కారణమయ్యే సుమారు 7,000 జన్యు మార్పులను గుర్తించాం. వీటికి అదనంగా, కేవలం మహిళల్లో మాత్రమే డిప్రెషన్‌కు దారితీసే మరో 6,000 జన్యు మార్పులను కనుగొన్నామని ఆమె తెలిపారు. మరో పరిశోధకురాలు డాక్టర్ జోడి థామస్ మాట్లాడుతూ, మహిళల్లో డిప్రెషన్ లక్షణాలు భిన్నంగా ఉండటానికి కూడా ఈ జన్యువులే కారణమని వివరించారు. మహిళల్లో డిప్రెషన్‌కు సంబంధించిన జన్యువులు, వారి శరీరంలోని జీవక్రియలకు (బరువు పెరగడం లేదా తగ్గడం, నీరసం వంటివి) సంబంధించిన జన్యువులతో ముడిపడి ఉన్నట్టు మేము గమనించాం. అందుకే డిప్రెషన్‌తో బాధపడే మహిళల్లో ఇలాంటి శారీరక లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయని ఆమె పేర్కొన్నారు.

ఈ పరిశోధన ఫలితాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

స్త్రీ, పురుషుల్లో డిప్రెషన్‌కు గల జన్యుపరమైన తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా, ఒక్కొక్కరికీ సరిపోయే ప్రత్యేకమైన చికిత్సలను అందించేందుకు ఈ అధ్యయనం మార్గం సుగమం చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంక్షిప్తంగా..

## ఆడంబరంగా విడాకుల వేడుక



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** సమాజంలో విడాకులు తీసుకోవడం అనేది ఎంతో బాధాకరమైనఅంశంగానే హైందవసాంప్రదాయంలో భావిస్తారు. కానీ, ఓ వ్యక్తి మాత్రం తన విడాకులను ఒక పండగలా జరుపుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. భార్య నుంచి విడాకులు మంజూరు కావడంతో ఏకంగా కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీరాదర్ డీకే అనే వ్యక్తికి ఇటీవల తన భార్య నుంచి చట్టపరంగా విడాకులు లభించాయి. ఈ ఆనందాన్ని పంచుకోవడానికి అతను వినూత్నంగా వేడుకలు జరుపుకున్నాడు.

## రష్యాకోసం యుద్ధంలో పనిచేసిన భారత్ వ్యక్తి అరెస్టు



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత సంతతి వ్యక్తి, 22 ఏళ్ల మజోతి సాహిల్ మొహమ్మద్ హుస్సేన్‌ను ఉక్రెయిన్ దళాలు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని మోర్బీకి చెందిన ఆ వ్యక్తి రష్యా ఆర్మీకి విధులు నిర్వహిస్తున్నట్లు ఉక్రెయిన్ ఆరోపించింది. అయితే సాహిల్ అరెస్టు విషయంలో భారతీయ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. తొలుత చదువు కోసం హుస్సేన్ రష్యాకు వెళ్లాడని, ఆ తర్వాత అతన్ని రష్యా ఆర్మీలో చేర్చుకున్నారని తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు చెందిన 63వ మెకనైజ్డ్ బ్రిగేడ్ ఓ వీడియో రిలీజ్ చేశారు. రష్యాలో డ్రగ్ సంబంధిత నేరంలో దొరికిన హుస్సేన్ ఏడేళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్నాడని ఆ బ్రిగేడ్ పేర్కొన్నారు. జైలులో ఉన్న సమయంలో రష్యన్ ఆర్మీలో చేరాలని హుస్సేన్‌తో కాంట్రాక్టు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ కోసం సైనికుల్ని రిక్రూట్ చేస్తున్నది.

## భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్జియోగోర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత్‌కు అమెరికా తదుపరి రాయబారిగా డొనాల్డ్ ట్రంప్ అత్యంత సన్నిహితుడు, విశ్వాసపాత్రుడు అయిన సెర్జియో గోర్ (38) నియామకం ఖరారైంది. అమెరికా సెనేట్‌లో జరిగిన ఓటింగ్‌లో ఆయన నియామకానికి ఆమోదముద్ర లభించింది. దీంతో భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేయనున్న అత్యంత పిన్నవయస్కుడిగా సెర్జియో గోర్ రికార్డు సృష్టించనున్నారు. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు కూడా ఆయన అత్యంత సన్నిహితుడు. గతంలో ట్రంప్ పరిపాలనలో 4,000కు పైగా కీలక నియామకాలను పర్యవేక్షించిన వైట్ హౌస్ ప్రెసిడెన్షియల్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా గోర్ పనిచేశారు. ఆగస్టు 22న తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా గోర్ పేరును ట్రంప్ ప్రతిపాదించారు. "ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న ప్రాంతానికి, నా ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు నేను పూర్తిగా విశ్వసించగల వ్యక్తి అవసరం. సెర్జియో ఒక అద్భుతమైన రాయబారి అవుతారు" అని ట్రంప్ ఆనాడు పేర్కొన్నారు.

## జావేద్ హబీబ్, అతని ఫ్యామిలీపై 20 కేసులు నమోదు

**లక్నో, అక్టోబరు 8:** దేశవ్యాప్తంగా పేరుగాంచిన ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావేద్ హబీబ్, ఆయన కుటుంబ సభ్యులు తీవ్రమైన మోసం ఆరోపణల్లో చిక్కుకున్నారు. కుటుంబంతో కలిసి ఒక గ్యాంగ్‌లా ఏర్పడి ప్రజలను కోట్ల రూపాయల మేర మోసగించారనే ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ పోలీసులు వారిపై ఏకంగా 20 కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారం సెలబ్రిటీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసు వివరాలను సంభల్ జిల్లా ఎస్పీ కృష్ణ బిష్ణోయ్ మీడియాకు వెల్లడించారు. జావెద్ హబీబ్, ఆయన భార్య, కుమారుడు కలిసి సుమారు రూ.7 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 35 మంది బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేశారని ఆయన పేర్కొన్నారు. 'ఫాలికల్ గ్లోబల్ కంపెనీ' అనే సంస్థ పేరుతో ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

## రూ60 కోట్లు డిపాజిట్ చేస్తే వెళ్లొచ్చు: శిల్పా దంపతులకు హైకోర్ట్ షాక్



**ముంబయి, అక్టోబరు 8:** బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్తకు బాంబే హైకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేశారన్న కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ దంపతులు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరగా, న్యాయస్థానం వారి పిటిషన్‌ను తిరస్కరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలనుకుంటే, ముందుగా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.60 కోట్లను డిపాజిట్ చేయాలని కఠిన షరతు విధించింది. ఈ ఆదేశాలను పాటించిన తర్వాతే వారి విజ్ఞప్తిపై తదుపరి విచారణ జరుగుతుందని స్పష్టం చేసింది. శిల్పాశెట్టి దంపతులపై రూ.60 కోట్ల ఆర్థిక మోసం కేసు విచారణలో ఉంది. ఈ కేసు నేపథ్యంలో ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) వీరికి వ్యతిరేకంగా లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసింది.

# పకడ్బందీగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు

● 16న కర్నూలు జిల్లాకు రాక ● శ్రీశైలంలో జ్యోతిర్లింగం దర్శనం ● శక్తిపీఠ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు
● ఓర్వకల్లులో జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ సభకు నరేంద్రమోడీ హాజరు ● ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రులు నారా లోకేష్, బిసి జనార్దన్ రెడ్డి, అనగాని, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సిఎస్, డిజిపిలు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖల్లో ప్రధాని పాల్గొన్న కార్యక్రమాలను మించిన స్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటనను సక్సెస్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తన పర్యటన సందర్భంగా ప్రధాని శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. కేంద్రం తెచ్చిన జిఎస్‌టి 2.0 సంస్కరణలను స్వాగతించి.. దేశంలోనే తొలిసారిగా అసెంబ్లీలో అభినందనల తీర్మానం చేసింది ఏపీ ప్రభుత్వం. అలాగే జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ పేరుతో దసరా నుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఈ క్రమంలో జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని పాల్గొనే ఈ సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ సభ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని పర్యటన సందర్భంగా వాతావరణ పరిస్థితులను చూసుకుని.. దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రధాని సభకు వచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలని, సభకు వచ్చే అప్రోచ్ రోడ్లను పూర్తి చేయాలని, పార్కింగ్ నిమిత్తం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.


అమరావతి ప్రెస్ క్లబ్ వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

### అమరావతి ప్రెస్ క్లబ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

అమరావతి జర్నలిస్టులు రూపొందించిన ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతా కలిసి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు నేడు వెబ్ సైట్‌ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి ఆలోచనల స్ఫూర్తితోనే 2018లో ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి పురుడుపోసుకుందని కమిటీ సభ్యులు చెప్పారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా... ఆయన సానుకూలంగా స్పందించారు.
రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అంది స్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్, మల్లేశ్వర రావు, శ్రీనివాస్, కె.గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షులు శరత్‌చంద్ర ఆహ్వానం అందిస్తున్న కలిమిశ్రీ

## సాంస్కృతిక ఉత్సవాలకు రండి

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో 22, 23 తేదీలలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం, ఆ ఉత్సవాలకు రావాలంటూ తెలుగు సాంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డి విల్సన్‌ను ఉత్సవాల కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ ఆహ్వానించారు. బుధవారంనాడు మంగళగిరిలోని తెలుగు సంస్కృత అకాడమీ కార్యాలయంలో ఆర్.డి.విల్సన్ కలిసి ఈమేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. తెలుగు భాష పరిరక్షణ కోసం, భాష, కళలు, సాహిత్యం, సంస్కృతుల పునర్ వైభవం కోసం ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు ఎన్నో జరగాల్సిన అవసరముందని ఆర్‌డి విల్సన్ అభిప్రాయపడ్డారు. విల్సన్‌ను కలిసిన వారిలో కలిమిశ్రీతో పాటు ఉత్సవాల కమిటీ బాధ్యులు చొప్పా రాఘవేంద్రశేఖర్, వై.డి. ఆనంద్, విష్ణుభొట్ల రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## రైతు కష్టాలపై సర్కార్ మొసలి కన్నీరు

### రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు



**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 8, ప్రభాత వార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన టమాటాకు కనీస మద్దతు ధర కాదు కదా అగాధంలో కూరుకు పోయే పరిస్థితి వుందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి మొసలి కన్నీరు కారుస్తుందని ధ్వజమెత్తారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వంత జిల్లా చిత్తూరులో రైతుల వద్దకు వెళ్ళే దమ్ము ఉందా అంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చిత్తూరు జిల్లా పర్యటించాలని సవాల్ విసిరారు. రైతుల కష్టాలు తెలుసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## సిజెఐ గవాయ్ పై దాడి రాజ్యాంగంపై దాడే

### బరవే ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెఐ బి.ఆర్. గవాయ్ పై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే అని బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగమే అందరికీ రక్షణ అని, అటువంటి రాజ్యాంగం పరంగా ఎన్నుకోబడిన సిజెఐ గవాయ్‌పై న్యాయవాది బూట్ విసరడం అంటే రాజ్యాంగాన్ని అవహేళన చేయటం, రాజ్యాంగాన్ని లెక్క చేయకపోవడమే అని, రాజ్యాంగం పట్ల నమ్మకం లేకపోవడమే వీటన్నిటికీ కారణమని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




## లాయర్ జ్యోత్స్నకు నివాళి

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త:** బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ భార్య గుళ్ళపల్లి జ్యోత్స్న మరణం న్యాయవాదులకే కాదు మహిళలందరికీ కూడ తీరని లోటని బెజవాడ బార్ అధ్యక్షులు ఎకె బాషా అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, న్యాయవాది, మహిళా హక్కుల ఉద్యమ నేత జ్యోత్స్న మొదటి వర్ధంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో బుధవారం ఆమె చిత్రపటానికి పూమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె చేసిన ఎన్నో సాంఘిక సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి బార్ కౌన్సిల్ మెంబరు సుంకర రాజేంద్రప్రసాద్ వారి కుటుంబ సభ్యులు, బిబిఏ గవర్నింగ్ బాడీ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు సప్పా రమేష్, బొమ్మసాని రవి, క్రాంతి, చిలువేరు మార్కండేయ తదితరులు పాల్గొని ఆమెకు నివాళి అర్పించారు.



# వదలని వర్షం

● మరో రెండు రోజులు తప్పని తిప్పలు ● విజయవాడలో కుండపోత ● లోతట్టు ప్రాంతాలు జలమయం
● రహదారులపై నిలిచిన వరద ● భారీగా ట్రాఫిక్ జామ్

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షం ఏపీని వదిలిపెట్టేటట్లు లేదు. బుధవారం రాత్రి విజయవాడ నగర వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో రహదారులన్నీ జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదారులైన బందరు రోడ్డు, పాలీక్లినిక్ రోడ్డుతో పాటు వన్ టౌన్‌లో ప్రాంతంలో రహదారులపై నీరు నిలవటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో డ్రైనేజీ, కాలువలు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారులపై నిలిచిన ట్రాఫిక్‌ను సరిదిద్దడానికి పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి గల్ఫ్ మన్నార్ వరకు తెలంగాణ, రాయలసీమ, అంతర్ తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రెండు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు.
గురువారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో విశాఖ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో మధురవాడ మార్కెట్ జలమయం అయ్యింది. మార్కెట్ అంతా నీరు చేరడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. కుండపోతగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లపై వెళ్లే వాహనదారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చిన్న చినుకు పడినా మధురవాడలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, రెండు మూడు రోజులు వర్షపు నీరు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీలైనంత త్వరగా వర్షపు నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# రైల్వే ఆదాయం అదుర్స్

### తొలి అర్ధ సంవత్సరంలో రూ.9606.24 ఆర్జన

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం, తొలి అర్ధ సంవత్సరం ఏప్రిల్ -సెప్టెంబర్ మధ్యకాలంలో రూ.9,606.24 కోట్లు ఆర్జించింది. ఇందుకు సంబంధించి డివిజన్ల వారీగా ఆర్జించిన స్థూల ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి. సరుకు రవాణా విభాగంలో: సికింద్రాబాద్ డివిజన్‌లో 39.576 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.3732.47 కోట్ల మేర ఆదాయం లభించగా, విజయవాడ డివిజన్‌లో 21.621 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.2114.62 కోట్లు, గుంతకల్లు డివిజన్‌లో 7.374 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.418.13 కోట్లు, గుంటూరు డివిజన్‌లో 1.662 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.173.41 కోట్లు, హైదరాబాద్ డివిజన్‌లో 0.668 సరుకు రవాణా ద్వారా రూ.116.73 కోట్లు, నాందేడ్ డివిజన్‌లో 0.242 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.54.46 కోట్ల చొప్పున మొత్తం 71.142 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.6609.82 కోట్ల రూపాయల ఆదాయాన్ని దక్షిణ మధ్య రైల్వే అర్జించింది.
ప్రయాణికుల విభాగంలో: సికింద్రాబాద్ డివిజన్‌లో అత్యధికంగా 40.99 మిలియన్ల ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.1,058.42 కోట్ల ఆదాయం లభించగా, విజయవాడ డివిజన్‌లో 36.84 మిలియన్‌ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.734.92 కోట్లు, గుంతకల్లు డివిజన్‌లో 22.18 మిలియన్‌ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.534.65 కోట్లు, నాందేడ్ డివిజన్‌లో 18.15 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.272.43 కోట్లు, హైదరాబాద్ డివిజన్‌లో 14.39 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.267.21 కోట్లు, గుంటూరు డివిజన్‌లో 9.85 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.128.80 కోట్ల ఆదాయం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆర్జించింది.
సరుకు రవాణా విభాగంలో రూ.6609.82 కోట్లు, ప్రయాణికుల విభాగంలో రూ.2,996.42 కోట్లు వెరసి మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలో రూ.9606.24 కోట్ల రూపాయల ఆదాయాన్ని దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆర్జించింది.

# ప్రతి ఇంటికి జిఎస్‌టి 2.0 ఫలాలు అందాలి

- సంస్కరణలతో దేశాభివృద్ధికి బాటలు
- నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి




**నెల్లూరు రూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిఎస్‌టి 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిఎస్‌టి సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎస్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జిఎస్‌టి 2.0 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు, వ్యాపారులకు కలిగే మేలును ఆయన వివరించారు. జిఎస్‌టి 2.0పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరి పరిధిలో వారు.. వీలైనంత మందికి జిఎస్‌టి 2.0పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరు మరో 10 మందికి అవగాహన కల్పిస్తే.. వారు మరికొందరికి అవగాహన కల్పించేలా చూడాలన్నారు. తమకు అందుతున్న మేలును వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఈ సంస్కరణలను స్వాగతిస్తూ, రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిఎస్‌టి 2.0పై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిఎస్‌టి వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు. రంగాలవారీగా జిఎస్‌టి లబ్ధిని ఆయన సభ ముందుంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్, ప్రోగ్రాం కన్వీనర్ కృష్ణమోహన్, మదీన వాచ్ అధినేత ఇంతియాజ్, ఎసిసి రాష్ట్ర అధ్యక్షులు రంగయ్యానాయుడు, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ల సేవలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**బుచ్చి (నెల్లూరు), అక్టోబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవన్నీ ఆలోచించకుండా ఆటోవాలలకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అకౌంట్లు వేశారని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు, ఎంకె లేవుట్ నుండి నారాయణాద్రి లేవుట్ వరకు భారీ స్థాయిలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ముందు చూపుతు ఆటో కార్మికులందరికి న్యాయం చేయాలని ఆయన రూ.15 వేలు ఆటో కార్మికుల ఖాతాలు వేశారని తెలిపారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ఉచిత బస్సు పెట్టినందు వల్ల ఆటో కార్మికులు నష్టపోకూడదని ఒక్కొక్కరి అకౌంట్‌లో ముఖ్యమంత్రి రూ.15 వేలు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామిని నెరవేరస్తు ముందుకు పోతుందని వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, నాయకులు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, ఎం.వి శేషయ్య, మోర్ల మురళీ, వింజం రామానాయుడు, వైస్ చైర్మన్ పుట్టా శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పటాన్ నస్రీన్, కౌన్సిలర్లు శ్రీదేవి, రాచూరు సత్యనారాయణ, మౌళి, యూత్ నాయకులు వింజ మహేష్‌నాయుడు, బుచ్చి రూరల్ బ్యాంకు అధ్యక్షులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసులురెడ్డి, దొడ్ల కోదండరామిరెడ్డి, తిరువాయి పాటి నందకుమార్, ఇమ్మడిశెట్టి మల్లికార్జున, తాళ్ళ నరసింహస్వామి, కోవూరు మండల నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.


డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేసిన సిపిఐ ప్రతినిధి బృందం

## తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో పిట్ లైన్‌లు నిర్మించాలి

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8, ప్రభాతవార్త:** గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంలో రైలు బోగీల మరమ్మతుల నిర్వహణ నిమిత్తం తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో అదనంగా పిట్ లైన్‌లు ఏర్పాటు చెయ్యాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. బుధవారం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ అధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, పట్టణ, గ్రామీణ కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాము ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్యలతో కూడిన ప్రతినిధులు డిఆర్‌ఎం గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గుంతకల్లు రైల్వే స్టేషన్లో అదనపు పిట్ లైన్‌లను నిర్మించేందుకు సరిపడా స్థలం లేనందున గూడ్స్ రైలును ఆపడానికి వెస్ట్ గుంతకల్లు స్టేషన్‌లో పెట్టి క్లీనింగ్ చేయిస్తున్నారు. అదే పద్ధతిలో ప్యాసింజరు రైళ్ళను పట్టణ శివారులోని తిమన్నచర్ల స్టేషన్‌లో అదనంగా ఐదు పిట్ లైన్‌లను ఏర్పాటు చేస్తే రైళ్ళ మరమ్మతులను నిర్వహించాలన్నారు. అలాగే హనుమాన్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న రైల్వే సమీపంలో రోడ్డు చాలా దెబ్బతిన్నది, అందువల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కావున రైల్వేగేటు రైల్వే స్థలంలో రోడ్డు మరమ్మతులు చేయుటకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, కసాపురం రైల్వే వంతెన కింద కూడా రోడ్డు మరమ్మత్తులు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని, గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులను వెంటనే చేపట్టాలని వారు డిఆర్‌ఎంను కోరారు.



## వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి

**ఉరవకొండ, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ అంశాల్లో చాలా వెనుకబడిన వీరశైవ లింగాయత్, లింగ బలిజ సమాజముల స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు దండిన శివానంద కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో శైవ క్షేత్రాల్లో వీరశైవులకు ప్రాధాన్యత కల్పిస్తామని, శ్రీశైలం, శ్రీకాళహస్తి క్షేత్రాల పాలక మండళ్లకు అధ్యక్షులుగా వీరశైవ లింగాయత్‌లను మాత్రమే నియమిస్తామని హామీ ఇచ్చారని అయితే ఇప్పుడు ప్రకటించిన పాలక మండళ్లలో అధ్యక్షులుగా, సభ్యులుగా ఒక్క వీరశైవుడు, జంగమ మహేశ్వరులను నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్రశాఖ విచారం వ్యక్తం చేసో_ందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు లింగాయత్ సమాజమును ఓబీసీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, ఆయనకు అఖిల భారత వీరశైవ మహాసభ, వీరశైవ లింగాయత్ సమాజము ధన్యవాదాలు తెలియజేస్తున్నదన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు పాటిల్ నాగన్నగౌడ్, అఖిల భారత వీరశైవ మహాసభ డైరెక్టర్లు గంగాధర్, మణికంఠ, సురేష్‌గౌడ్, గుంతకల్లు జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, ఉరవకొండ నాయకులు పి.నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జిఎస్‌టిపై అవగాహన ర్యాలీ

## పేదల సంక్షేమానికే కూటమి మొగ్గు

**శ్రీకాళహస్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** నిరుపేదలకు ధరలు అందుబాటులో ఉంచటానికే కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వ్యాపార సంస్థలు వెలసిన నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధుల్లోని దుకాణాల వద్దకు వెళ్ళి 'జిఎస్‌టిపై' అవగాహన నిర్వహించారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అనే కరపత్రాలను అందిస్తూ జిఎస్‌టి ఎందుకు తగ్గించాల్సి వస్తుందనే అంశాన్ని వ్యాపారులకు వివరించారు. ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టికి సంబంధించి ఉత్పత్తి దారులు, వ్యాపారులు సహకరించాలన్నారు. వస్త్రదుకాణాలు, మందుల షాపులు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్ తదితర వ్యాపారసంస్థల వద్దకు వెళ్ళి యజమానులను చైతన్యవంతుల్ని చేసారు. ఎమ్మెల్యేతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, జనసేనకు చెంది ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, తెలుగుదేశం నాయకులు విజయకుమార్ నాయుడు, రంగినేని చెంచయ్యానాయుడు, కాసరం రమేష్, సుబ్బయ్య, కంఠా రమేష్, అంజూరు చక్రధర్, మల్లీశ్వరి, బి.రేణుకమ్మ, ఢిల్లిబాబు, వాకచర్ల గుర్రప్పశెట్టి, బషీర్, నెమళ్లూరు బుజ్జి తదితరులు హాజరయ్యారు.

## సమర్థవంత పాలన అవసరం

**శ్రీకాళహస్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** భారత దేశ భవిష్యత్తును రూపొందించటంలో సమర్థవంతపైన పరిపాలన వ్యవస్థ ఎంతో అవసరమని ఉద్యమ వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. తిరుపతి ఐఐటిలో ఏర్పాటు చేసిన 'ఇండియా రోడ్ అహెడ్' కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సమావేశానికి తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెషర్ కె.ఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ... నేడు సామాజిక పరిస్థితిని బట్టి మార్పులు రావాల్సి ఉందన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ క్రమశిక్షణ, చట్టపాలన, విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను తీర్చటానికి ఎందుకు అవసరమో వివరించారు. పరిపాలన, సంస్కరణలలో తన అపార అనుభవం నుంచి స్థిరమైన సమానమైన సమాజానికి పాలన ఎలా వెన్నుముకగా పని చేస్తుందో వివరించారు. స్థిరమైన సమ్మిళిత వృద్ధి అనేది సమాన అభివృద్ధిని నిర్ధారించటానికి సమాజంలోని వివిధ వర్గాల మధ్య అభ్యంతరాన్ని తగ్గించటానికి రెండు స్తంభాలని జయప్రకాష్ నారాయణ వివరించారు.

# బొగ్గు కొనుగోలుకు ఇక విద్యుత్ జెన్కోలకు రుణాలు

**నిబంధనలు సడలింపునకు చర్యలు**

**10 నుండి 15 శాతం దిగుమతుల పెంపు**

**పవర్ ఫైనాన్స్ సంస్థపై విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒత్తిడి**

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** విద్యుత్ ఉత్పత్తి అవసరమైన బొగ్గు కొనుగోలు, దిగుమ తులకు సంబంధించి రుణ సౌకర్యం కల్పించాలని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. జనరేటర్లైన జెన్కోలకు నిర్దిష్ట బొగ్గు రుణాలు అందించడం ఇదే మొదటిసారి. దిగుమతి చేసుకున్న బొగ్గు కోసం విద్యుత్ ఉత్పత్తి సంస్థ లకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందిం చడానికి డిస్పెన్సే షన్‌తో కూడిన మార్గదర్శకాలను విద్యుత్ మంత్రిత్వ శాఖ రూపొందిస్తోంది. దీంతో త్వరలో బొగ్గు దిగుమతులకు విద్యుత్ జెన్కోలకు సులభమైన రుణాలు లభించనున్నాయి.

ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ రిటైలర్ల నుండి చెల్లింపులు అందకపోవడంతో దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి తమ వద్ద డబ్బు లేదని వివిధ రాష్ట్రాలకు చెందిన జెన్కోలతో పాటు, ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కేంద్రా నికి ఇప్పటికే తెలిపాయి. విద్యుత్ సంస్థలకు రుణాలు ఇవ్వడానికి, ముఖ్యంగా బ్లెండింగ్ ప్రయోజనాల కోసం దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి, దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్లను నడపడానికి వీలుగా అవసరమైన నిబంధనలను సడలించాలని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌పై కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వత్తిడి తెస్తోంది.

విద్యుత్ డెవలపర్లు బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ఆసక్తిగా ఉండడంతో పాటు, అందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ప్రభుత్వం నుండి ఫైనాన్సింగ్ విధానాన్ని కోరుతుండడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యుత్ ప్లాంట్లకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం 1.03 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక విద్యుత్ ప్లాంట్లలో దాదాపు 20 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉండగా, ఇవి దాదాపు ఎనిమిది రోజుల పాటు ఉంటాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి సంస్తలకు బొగ్గు అవసరం తప్పనిసరి అయ్యింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలను నిర్మించడానికి మరియు అధిక డిమాండ్ మధ్య ప్రాజెక్టులను కొనసాగించడానికి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు బొగ్గు దిగుమతుల కోసం అవసరమైన రుణాలను మంజూరు చేసేందుకు రుణదాతల ద్వారా కేంద్రం సులభతరం చేస్తుంది. ప్రధానంగా విద్యుత్ సంక్షోభాన్ని నివారించడానికి వర్షాకాలం ముందు నిల్వలను నిర్మించడానికి బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం ఉత్పత్తి సం స్థలపై ఆధారపడుతోంది. అన్ని ఉత్పత్తి ప్రాజె క్టులు వాటి అవసరంలో 10 శాతం దిగుమతి చేసుకోవాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉత్పత్తి సంస్థలు 22 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతులు చేసుకుంటాయి. అలాగే ప్రైవేట్ కంపెనీలు మరో 16 మిలియన్ టన్నులు తీసుకు వస్తాయి. విద్యుత్ మంత్రిత్వ శాఖ బుధవారం ఇచ్చిన ఆదేశాల్లో బొగ్గును దిగుమతి చేసుకోని ప్లాంట్లకు వాటి లక్ష్యాలను ప్రస్తుత 10 శాతం నుండి 15 శాతానికి పెంచుతామని తెలిపింది.

# ముమ్ముట్టి, దుల్కర్‌ల ఇళ్లలో ఇడి సోదాలు



**తిరువనంతపురం, అక్టోబరు 8:** భూటాన్ లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కుంభకోణం కేసు మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రముఖ నటులు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చక్కలక్కల్ నివాసాలతో పాటు మొత్తం 17 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘనల ఆరోపణలపై ఈడీ ఈ చర్యలు చేపట్టింది. భూటాన్, నేపాల్ మార్గాల ద్వారా టయోటా ల్యాండ్ క్రూయిజర్, ల్యాండ్ రోవర్ డిఫెండర్ వంటి ఖరీదైన వాహనాలను అక్రమంగా దిగుమతి చేస్తున్న ఓ ముఠాపై తమకు కచ్చితమైన సమాచారం అందిందని ఈడీ అధికారులు తెలిపారు. ఈ ముఠా భారత సైన్యం, అమెరికా రాయబార కార్యాలయం, విదేశాంగ మంత్రి త్వశాఖ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్రమంగా వాహన రిజిస్ట్రేషన్లు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఈ కార్లను సినీ ప్రముఖులతో సహా పలువురికి తక్కువ ధరకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఆపరేషన్ నుమ్‌ఖోర్ కింద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న తన కారును విడుదల చేయాలని కోరుతూ దుల్కర్ సల్మాన్ కేరళ హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి పొందిన మరుసటి రోజే ఈడీ దాడులు జరగడం గమనార్హం. దుల్కర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఆ కారును 2004లో రెడ్ క్రాస్ కోసం చట్టబద్ధంగా దిగుమతి చేశారని, ఆ తర్వాత తాము కొనుగోలు చేశామని కోర్టుకు తెలిపారు. అయితే, కేసు విచారణ కొనసాగుతున్నందున కారును సీజ్ చేసే హక్కు తమకుందని కస్టమ్స్ అధికారులు వాదించారు. కేరళలో ఇలాంటి అక్రమ దిగుమతి కార్లు 150కి పైగా ఉన్నాయని, వాటిలో ఇప్పటికే 40 వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఈడీ రంగంలోకి దిగడంతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం కానుందని, మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# 20 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,అక్టోబరు 8, ప్రభాతవార్త :** నాలుగు బ్యాగుల్లో గంజాయిని నింపుకొని, ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వచ్చే వోల్వో బస్సులో లోని లగేజ్ బాక్స్‌లోను పెట్టి దర్జాగా లోపల ఏసి బస్సులో కూర్చొని హైదరాబాద్‌కు వస్తున్న ఒడిశాకు చెందిన నాభి నాయక్ అలియాస్ హరి కి సంబంధించిన 20.600 కేజీల గంజాయిని రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ టీం పట్టుకున్నారు. గతంలో భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతంలో ఎస్‌టిఓ పోలీసులకు పట్టుబడిన నాభిన్ నాయక్ అలి యాస్ హరి ఒరిస్సా నుంచి నాలుగు బస్తాల్లో 20 కేజీలకు పైగా గంజాయిని తీసుకువస్తూ ఉన్నాడనే సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఈఎస్ జీవన్ కిరణ్ సిఐలు సుభాష్ చందర్ ఇతర సిబ్బందిని కలిసి రామోజీ ఫిలిం సిటీ వద్ద బస్సును నిలిపి తనిఖీలు నిర్వహించి అందులో ఉన్నటువంటి గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. గంజాయిని తూకం వేయగా 20.600 కేజీలుగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుకున్న గం జాయి విలువ రూ.11 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని పట్టుకున్న టీంలో ఏఈఎస్ జీవన్ కిరణ్, సిఐలు సుభాష్ చందర్ బాలరాజు, ఎస్ఐలు వెంకట్, రవి, అఖిల్‌తో పాటు ఏక్సైజ్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

# మద్యం దుకాణాలకు పెరుగుతున్న దరఖాస్తులు

**హైదరాబాద్,అక్టోబరు 8, ప్రభాతవార్త :** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తెలంగాణలో కొత్త మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నాటికి 1581 దర ఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలి పారు. మద్యం షాపులకు దరఖాస్తులు రోజు రోజు పెరుగుతూ వస్తున్నాయని, గత రెండేళ్ల క్రితం పిలిచిన మద్యం షాపులకు దరఖాస్తులకు కంటే ఈ సారి మద్యం షాపుల కోసం దరఖాస్తులు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

తెలం గాణలోని 2620 మద్యం దుకాణాలకు 1581 దదఖాస్తులు ఈ నెల 7 వరకు వచ్చాయి. బుధ వారం దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు. ఓపెన్ క్యాటగిరిలో 1834 మద్యం దుకాణాలకు 992 దరఖాస్తులు, గౌడ్‌లకు కేటా యించిన 393 దుకాణాలకు 223 దరఖాస్తులు ఎస్సీలకు కేటాయించిన 262 మద్యం దుకా ణాలకు 55, ఎస్టీలకు కేటాయించిన 131 షాపులకు 13 మొత్తంగా 2620 మద్యం షాపు లకు 1581 దరఖాస్తులు రాగా చివరి మూడు రోజులు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉండడంతో తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. అబ్కారీ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ దరఖాస్తులు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్కులు కూడా ఏర్పాటు చేశారు.

# కాన్పూర్ మిశ్రీగంజ్‌లో భారీ పేలుడు

**మహిళ సహా ఆరుగురికి తీవ్రగాయాలు**

**పార్కింగ్‌చేసిన స్కూటర్లలో పేలుడు**



**కాన్పూర్, అక్టోబరు 8:** నగరంలోని మిశ్రీ బజారులో బుధవారం సాయంత్రం రెండు పార్కింగ్‌చేసిన స్కూటర్లలో అమర్చిన బాంబులు పేలడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడులో కనీసం ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులను వెంటనే సమీపంలోని ఉర్సులా ఆసుపత్రికి తరలించారు. రాత్రి 7.15 గంటల ప్రాంతంలో మిశ్రీ బజార్ ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. జెసిపి అశుతోష్‌కుమార్ మాట్లాడుతూ రెండు స్కూటర్లనుంచి ఈ పేలుడు సంభవించిందని మహిళ సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు. మాఫోరెన్సిక్ బృందాలు సంఘటనా స్థలాలో వివరాలు సేకరిస్తున్నాయని అన్నారు. పేలుడు సంభవించిన స్కూటర్‌ను గుర్తించామని, ఇందుకు సంబంధించి అన్ని కోణాలనుంచి దర్యాప్తు జరుగుతోందని అశుతోష్ వెల్లడించారు. ఇది ప్రమాదమా లేక కుట్రపూరితమా అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్లు జెసిపిఅశుతోష్ చెప్పారు. పోలీస్, బాంబు నిర్వీ ర్యంచేసే బృందాలతోపాటుఫోరెన్సిక్ టీమ్‌లు కూడా వెంటనే ప్రమాదస్థలానికి చేరుకున్నాయి. అంతేకాకుండా చెల్లాచెదురయిన ఈ ప్రాంతాన్ని మొత్తం సీజ్‌చేసి పేలుడుకు సంబంధించిన మొత్తం వివరాలను పరిశీలనచేస్తున్నారు.



**చిన్నారుల మరణాలకు కారణమైన**

# దగ్గుమందు ఇతర దేశాలకు ఎగుమతి చేశారా?

**భారత్‌ను ప్రశ్నించిన డబ్ల్యూహెచ్ఓ**

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** దగ్గు మందుతో చిన్నారుల మర ణాల ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి కలిగిం చింది. మధ్య ప్రదేశ్ లో కోల్డ్‌రిఫ్ దగ్గు మందు కారణంగా పలువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. ఈ ఔషధం ఎగుమతులపై భారత్‌ను ఆరా తీసినట్లు తెలుస్తోంది. చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గుమందును ఇతర దేశాలకు ఎగుమత చేశారా అని డబ్ల్యుహెచ్ఓ భారత్‌ను అడిగింది. సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అనే దానిపై అంచనా వేయనుంది అని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దగ్గుమందు కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతుండటం కలవరపెడుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో మృతుల సంఖ్య 20కి చేరింది. ఒక్క చింద్వాడాలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మధ్యప్రదేశ్ ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా వెల్లడించారు.

మరో అయిదుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇలాంటి కల్తీ దగ్గుమందు తాగి రాజస్థాన్‌లోనూ కొందరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కోల్డ్‌రిఫ్ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు ఈ సిరప్‌పై ఇప్పటికే పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

**ఫోన్‌ట్యాపింగ్ కేసు**

# 14కు వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మరింత వేగంగా కొనసాగుతుంది. ఈ మేరకు ప్రభుత్వం సుప్రీం కోర్టులో ప్రధాన నిందితుడు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే బుధవారం విచారణ చేపట్టి ఇరువక్షాల వాదనలు జరిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఫోరెన్సిక్ నివేదికలో కీలకమైన ఆధారాలు లభించాయని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మహా దేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిం చారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్‌ఎస్ఎల్) నుంచి అందిన నివేదికలో, డిజిటల్ ఫోరెన్సిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత ముఖ్యమైన ఆధారాలు సేకరించినట్లు ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆధారాలు కేసు దర్యాప్తులో కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన విచారణ సందర్భంగా, ప్రభాకర్ రావు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని ప్రభుత్వం కోర్టుకు ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు అధికారులకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా బలమైన ఫోరెన్సిక్ ఆధారాలు లభించిన నేపథ్యంలో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం గట్టిగా వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను అక్టోబర్ 14కి వాయిదా వేసింది.

# దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోయిన పాకిస్థాన్

**ప్రపంచ బ్యాంకు హెచ్చరిక**



**న్యూయార్కు, అక్టోబరు 8:** పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆ దేశం దుర్భర దారిద్రంలో కొట్టుమిట్టాడుతోందని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వంటి సంస్థల నుంచి భారీగా రుణాలు తీసుకుంటున్నా దేశంలో పేదరికం తగ్గకపోగా మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. పాక్‌లోఅమలవుతున్న ఆర్థిక వృద్ధి నమూనా పూర్తిగా విఫలమైందని, పేదల జీవితాలను మెరుగుపరచడంలో ఘోరంగా విఫలమైందని స్పష్టం చేసింది. ఈ మేరకు రిక్లెయి మింగ్ మొమెంటం టువార్డ్స్ ప్రాస్పరిటీ: పాకిస్థాన్స్ పావర్టీ, ఈక్విటీ అండ్ రెసిలియెన్స్ అసెస్‌మెంట్ పేరుతో గతనెల 23న విడుదల చేసిన నివేదికలో కీలక సమాచారం వెల్లడించింది. పాకిస్థాన్‌లో పేదరికం హెడ్‌కౌంట్ నిష్పత్తి (హెచ్‌సీఆర్) గత ఎనిమిది సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి, అంటే 25.3 శాతానికి చేరింది. కేవలం 2023 నుంచి చూస్తేనే ఇది 7 శాతం పెరుగుదల కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒకప్పుడు పాకిస్థాన్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించింది. 2001లో 64.3 శాతంగా ఉన్న పేదరికాన్ని 2018 నాటికి 21.9 శాతానికి తగ్గించగలిగింది. 2015 వరకు ఏటా 3 శాతం చొప్పున పేదరికం తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత దాని వేగం సంవత్సరానికి ఒక శాతం కంటే తక్కువకు పడిపోయింది. ప్రభుత్వాల విధానాలు, వరుస సంక్షోభాల కారణంగా కష్టపడి సాధించిన ఈ ప్రగతి పూర్తిగా తలకిందులైందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొంది. పేదరిక నిర్మూలనకు గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టాల్సింది పోయి, పాకిస్థాన్ ప్రభుత్వం రక్షణ రంగ వ్యయాన్ని పెంచుకోవడంపైనే అధికంగా దృష్టి సారించిందని నివేదిక విమర్శించింది. దేశ జనాభాలో 42.7 శాతంగా ఉన్న మధ్యతరగతి వర్గాలు సైతం పూర్తి ఆర్థిక భద్రతను సాధించే దుకు తీవ్రంగా పోరాడుతున్నారని, ఇది కేవలం పేదల సమస్య మాత్రమే కాదని, దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులే బలహీనంగా ఉన్నాయని సూచిస్తోందని తెలిపింది. గతంలో సత్ఫలి తాలిచ్చిన ఆర్థిక నమూనా ఇప్పుడు పరిమితులను చేరుకుందని, చిన్నపాటి ఆర్థిక కుదుపులకే ప్రజలు తిరిగి పేదరికంలోకి జారిపోయే ప్రమాదం ఉందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి, దేశాన్ని అతలాకుతలం చేసిన వరదలు, రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం, ఆర్థిక అస్థిరత వంటి వరుస సంక్షోభాలు పాకిస్థాన్ వ్యవస్థలోని బలహీనతలను నివేదిక స్పష్టం చేసింది. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజలు విఫలమవు తున్నారని, తక్కువ ఉత్పాదకత ఉన్న రంగాల్లో చిక్కుకుపోయారని ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ ప్రభుత్వం సాహసోపేతమైన విధాన సంస్కరణలను తక్షణమే చేపట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. వ్యవస్థాగత అసమతుల్య తలను సరిదిద్దడం, సంక్షోభాల సమయంలో ప్రజలు తిరిగి పేదరికంలోకి జారకుండా చూడటం, మారుమూల ప్రాంతాల్లోని సవాళ్లను పరిష్కరించడం అత్యవసరమని సూచించింది. 2000ల ప్రారంభం తర్వాత పాకిస్థాన్‌పై విడుదల చేసిన మొట్టమొదటి సమగ్ర పేదరిక అంచనా నివేదిక ఇదేనని, విధాన రూపకర్తలకు, భాగస్వామ్య పక్షాలకు ఇది ఒక మార్గదర్శిగా మారుతుందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. దేశంలో పేదరికం, అసమానతల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ నివేదిక దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

# 25 నిమిషాల్లోనే ఎస్ఎంఇలకు రూ.25కోట్ల రుణాలు

**బ్యాంకింగ్ వ్యవస్థలో డిజిటైజేషన్ కీలకం**

**ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి**



**ముంబయి, అక్టోబరు 8:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న డిజిటైజేషన్ ఆర్థిక రంగం రూపు రేఖలను మార్చేసిందని భారతీయ స్టేట్‌బ్యాంకు ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొన్ని నిమిషాల వ్యవధిలోనే రుణాలు అందుతున్నాయని గుర్తు చేశారు. డిజిటల్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చిన క్రమంలో 25 నిమిషాల్లోనే ఎస్ఎంఈలకు రూ.5 కోట్ల వరకు రుణాల జారీకి ఆమోదం లభిస్తోందని పేర్కొన్నారు. ముంబైలో జరుగు తోన్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో కార్యక్రమంలో ఎస్‌బీఐ చేపట్టిన కార్యాచరణను వివరించారు. డిజిటలీకరణ కారణంగా ఇన్సూరెన్స్ వంటి ఫైనాన్షియల్ ఉత్పత్తుల వినియోగం భారీగా పెరిగిందని యూపీఐ ద్వారా అందించే రుణాల విషయంలో బ్యాంకులు తమ కలెక్షన్ సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందన్నారు. ఒక్క స్టేట్ బ్యాంక్ ద్వారానే 15 కోట్ల జన్‌ధన్ జీరో బ్యాలెన్స్ అకౌంట్లుతెరిచినట్లు చెప్పారు. అందులో 99.5 శాతం అకౌంట్లలో నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం సగటున రూ.4 వేల చొప్పున ఒక్కో జన్‌ధన్ ఖాతాలో బ్యాలెన్స్ ఉందన్నారు. ఈ అకౌంట్ల ద్వారా రోజుకు 35 లక్షలకు పైగా ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఖాతాల్లో 56 శాతం మహిళలవే ఉన్నట్లు పేర్కొన్నారు.

జీరో బ్యాలెన్స్ అకౌంట్లతో మొదలై ఇప్పుడు కరెంట్ ఖాతాలు తెరిచే స్థాయికి చేరుకున్నట్లు శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. తమ ఎస్‌బీఐ యోనో యాప్‌ను అప్‌గ్రేడ్ చేస్తామని వివరించారు.

ఇందు కోసం 12 ఫిన్‌టెక్ కంపెనీలతో కలిసి పని చేస్తున్నామని గుర్తు చేశారు. మొబైల్ బ్యాంకింగ్ మాత్రమే కాకుండా మరిన్ని సేవలను అతి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామని బ్యాంకు ఛైర్మన్ చెపుతూ యోనో యాప్ ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవడం ఒకప్పుడు గంటకు పైగా సమయం పట్టేదని కానీ, ఇప్పుడు 15 నిమిషాల్లోనే పూర్తవుతున్నట్లు తెలిపారు. కేవైసీ రూల్స్ మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో పాటుగా ఆర్‌బీఐ వంటి నియంత్రణ సంస్థలను తమ బ్యాంక్ సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు.



బుధవారం సునీత రావు అధ్యక్షతన గాంధీభవన్‌లో జరిగిన మహిళకార్యవర్గ సమావేశం

# ఓట్ చోరీతో మూడోసారి ప్రధాని అయిన మోడీ

**సంతకాల సేకరణ చేసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు**

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** దేశంలో ఓట్‌చోరీ చేసి మూడోసారి మోడీ ప్రధాని అయ్యారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆరోపించారు. ఆమె అధ్యక్షతన బుధవారం మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో ఓట్ చోరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రాహుల్‌గాంధీ ఓట్ చోర్ విషయంలో అన్ని రకాలుగా ఆధారా లతో బయటపెట్టడంతో మోడీ, బిజెపి బెంబేలెత్తిందని అన్నారు. మోడీ మూడోసారి ప్రధాన మంత్రి అయ్యేందుకు ఎన్నికల కమిషన్‌ను వాడుకు న్నారని ఆరోపించారు. అన్ని రకాలుగా ఆధారా లతో రాహుల్ గాంధీ ఎన్నికల అక్రమాలను, ఓట్ చోర్ లను చూపించినా కూడా ఎన్ని కల కమిషన్ ఏ మాత్రం స్పందించలేదని విమ ర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా మహిళా కాం గ్రెస్ పెద్ద ఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి రాహుల్‌గాంధీ న్యాయపోరాటానికి మద్ద తుగా నిలవాలని సునీతరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రెటరీలు, సెక్రటరీలు, కాన్స్టిట్యువెన్సీ, బ్లాక్, మండల్, బూత్, టౌన్ స్థాయి నాయకులు భారీగా పాల్గొన్నారు.

# శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నిలిచిన ఉత్పత్తి

**విజయదశమి నాడే పునఃప్రారంభం**

**మరోసారి సాంకేతిక సమస్యలు**

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. విద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్‌లో మరోసారి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కరెంటు ఉత్పత్తి నిలిచిపోయింది. పునరుద్ధరించేందుకు కొంత సమయం పడుతుందని జెన్‌కో ఇంజనీర్లు భావిస్తున్నారు. కాగా 2020 ఆగస్టు 20న షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి నాలుగో యూనిట్ అగ్నిప్రమాదానికి గురికాగా, ఆ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. తదుపరి ఢిల్లీకి చెందిన వాయిత్ ఇంజనీరింగ్ కంపెనీ ఈ యూనిట్ మరమ్మతు పనులు చేపట్టింది. 2021 సెప్టెంబరులో పనులు ప్రారంభించి 2023 జూలై నాటికి పూర్తి చేసి జెన్‌కోకు అప్పగించింది. ఆ నెల 17న నాలుగో యూనిట్‌ను ప్రారంభించి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. అయితే మళ్లీ 2023 ఆగస్టు 17న స్టేటార్ వైండింగ్ బార్స్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మరోసారి మంటలు చెలరేగి యూనిట్ కాలిపోయింది. గత సంవత్సరం మరోసారి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇందుకు చైనా నుంచి స్టేటార్ బార్స్‌ను రప్పించి బిగించారు. ఏడాది పాటు మరమ్మతు పనులు కొనసాగగా, ఈ నెల 2న విజయదశమి రోజున రాత్రి పూజలు నిర్వహించి ప్రారంభించారు. పది గంటలు తిరగకుండానే సాంకేతిక సమస్యలతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. స్టేటార్ మొరాయించడంతో సమస్య మొదటికొచ్చిందని ఇంజనీర్లు అంటున్నారు. సాంకేతిక సమస్యలు, ప్రమాదాలను ముందుగా గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సెన్సార్లు కూడా పనిచేయడంలేదని తెలుస్తోంది. తరచూ సాంకేతిక సమస్యలతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం, అందుకు గల కారణాలు, లోపాలు, వాటిని అధిగమించాల్సిన చర్యలు తదితర వాటిపై తదుపరి కార్యాచరణపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వనున్నట్లు తెలియవచ్చింది.

# గవాయ్‌పై దాడిని కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి

**మందకృష్ణ మాదిగ**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ

**హైదరాబాద్(కంటోన్మెంట్),అక్టోబరు 8 ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ దాడి విషయమై పోలీసు శాఖ సుమోటోగా కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్‌తో పాటు బడుగు బలహీన వర్గాల సంఘాలు పది రోజుల పాటు జిల్లా, మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపుని చ్చారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేసి దాడి చేసిన వ్యక్తి వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతైన పరిశీలన జరపాలన్నారు. గవాయ్‌పై జరిగిన దాడి దేశంలో ఉండే దళితులందరిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో ఉండే న్యాయమూర్తులు ఏకతాటిపై నిలబడి ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాని మోడీ దాడి ఘటనపై వెంటనే స్పందించి సీజేతో మాట్లాడా రని, దాడి జరగడంపై లోతైన దర్యాప్తు జర గాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కంటోన్మెంట్ ఇన్చార్జి ఇటిక శ్రీకిషన్ మాదిగ, హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజిత్ వాల్మీకి, జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివ మాదిగ, దుప్పల అనిల్ దావు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన

## - జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వీయ పర్యవేక్షణలో విస్తృత ఏర్పాట్లు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజక వర్గంలో పర్యటనకు రానున్న సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వీయ పర్యవేక్షణలో విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టారు .గన్నవరం విమానాశ్రయం నుంచి రాజమండ్రి విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్ ద్వారా కాకినాడ పోలీసు గ్రౌండ్ చేరుకుని కలెక్టర్ కార్యాలయంలో ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యలపై అధికారులు, మత్స్యకార నాయకులతో సమావేశమై స్వయంగా తెలుసుకుంటారు.సమీక్ష అనంతరం ఉప్పాడ చేరుకుని సముద్ర జలాలు కాలుష్యం అవుతున్నాయని మత్స్యకారులు చెబుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని...

ఆ ప్రాంతం పరిశీలించేందుకు సముద్రంలో ప్రయాణించనున్నారు. ఉప్పాడలో మత్స్యకారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.పిఠాపురం నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. అనంతరం రాజమండ్రి విమానాశ్రయం నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని తమ నివాసానికి చేరుకుంటారు. పోలీస్ కళ్యాణ మండపంలో కాకినాడ జిల్లా పోలీసులతో రహదారి భద్రత,




ట్రాఫిక్ రూట్ మ్యాప్, ప్రజా నియంత్రణ, వీఐపీ మూవ్ మెంట్ సెక్యూరిటీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

గురువారం 09 - అక్టోబర్ - 2025




# ఐదు బుధవారల స్వామి ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు




**ఆత్రేయపురం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
ఐదు బుధవారల స్వామిగా ప్రసిద్ధి కేక్కిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి ఆలయానికి బుధవారం భక్తులు పోటె త్తారు. ఐదు వారలు, ఐదు ప్రదీక్షణాలు చేసే భక్తులతో ఆలయాపరిసరాలు భక్తజనంతో కిట కిటలాడాయి.అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. విశాఖపట్నం చెందిన వి. కృష్ణకాంత్, నాగమణి, దంపతులు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116లు. గుంటూరు జిల్లా తుళ్లూరుకి చెందిన ఇక్కుర్తి శ్రీనివాసరావు, సామ్రాజ్యం, దంపతులు స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.5,116లు. విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

# ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అంబాజీపేట విద్యార్థులు

**అంబాజీపేట , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త )**
అంబాజీపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీ ఎఫ్) ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 నెట్ బాల్ విభాగంలో కె.ఎల్.డి.ఎస్. పూర్ణిమ (జూనియర్ ఇంటర్), అండర్-14 నెట్ బాల విభాగంలో పి.జాహ్నవి ,వై.జనార్ధన్ లు, అండర్ - 19 బాస్కెట్ బాల్ విభాగంలో ఎం.మౌనిక, టైక్వాండో అండర్-14 విభాగంలో కె.కావ్య , అండర్ -17 విభాగంలో పి.చరణ్యశ్రీ లు ఎంపికయ్యారని పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పిఈటీ ఆకుల ఉమామహేశ్వర రావు, టైక్వాండో చీఫ్ కోచ్ పితాని త్రిమూర్తులు



తెలిపారు. రాష్ట్రాయ్ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కదలి సాయిరావ్,ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు బిఎస్ఎన్ఎల్ మూర్తి,కాలేజ్ ఇంచార్జ్ ఫణి, పిఈటి అంది సూర్యకుమారి,ఉపాధ్యాయులు అభినందించారు.

# జిఎస్టి పై జిల్లా స్థాయి పోటీల్లో అలివేలు కు ప్రథమ బహుమతి



**మామిడికుదురు , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో జిఎస్టి పై నిర్వహించిన వ్యాసరచన పోటీల జూనియర్స్ విభాగంలో మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ.తరగతి చదువుతున్న విద్యార్థిని చింతలపూడి అలివేలు మంగతాయారు ప్రథమ బహుమతిని సాధించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బొండాడ చిరంజీవి, ఉపాధ్యాయులు మంగతాయారును అభినందిస్తూ సత్కరించి,జ్ఞాపిక ను అందజేశారు.పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకు వచ్చిందంటూ అభినందించారు.ఆమె కు గైడ్ గా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు ఎం.గంగాభవానీకి కూడా అభినందనలు తెలిపారు.

# లైన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**రాజమహేంద్రవరం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
లైన్స్ క్లబ్ రాజమహేంద్రవరం నారాయణపురంలో గల వాంబే గృహాల వద్ద క్లబ్ ప్రెసిడెంట్ఎం. వి.ఎన్ కిరణ్ కుమార్ సారథ్యంలో లైన్స్ డిస్ట్రిక్ట్ ఐ హాస్పిటల్ జగ్గంపేట వారి సహకారంతో బుధవారం ఫ్రీ మెగా కంటి శిబిరం నిర్వహించారు. లైన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లైన్ వజ్రపు కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా ప్రారంభించగా అందు ప్రత్యేక అతిథి లైన్ గ్రంధి వెంకటేశ్వరరావు గెస్ట్ ఆఫ్ హానర్ లైన్ కొయ్యను కుమారి , జోన్ చైర్పర్సన్ మద్దుల శ్రీరామ్ గుప్తా ఈ కార్యక్రమం చాలా బాగా జరిగినది వాంబే గృహాల సముదాయం ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి సహకారంతో 250 మందిని పరిశీలించగా 20 కంటి ఆపరేషన్



లో మరియు 45 కళ్ళజోళ్ళు ఇవ్వడం జరిగినది. తెలుగు దేశం నాయకులు కదలి రామకృష్ణ, జగదీష్, ఇతర రాజకీయ నాయకులు, సప్లై కంపెనీ ప్రసాద్ సహకరించారు. ప్రాజెక్ట్ చైర్ పర్సన్ గా క్లబ్ అడ్మిన్ గ్రంధి లక్ష్మీ వసంతకుమారి వ్యవహరించిరి .మరియు కళ్ళజోళ్ళను పసుమర్తి వెంకటేశ్వర్లు, కక్కిరాల బుచ్చిరాజు ఇవ్వడం జరిగినది. క్లబ్ సభ్యులు మాధవరావు, సురేష్ కుమార్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛ పురస్కార గ్రహీతలను ఆదర్శంగా తీసుకోవాలి

**స్వచ్ఛ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలి : కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**రావులపాలెం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
ప్రతీ ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, మంచి ఆహారం ఎంత అవసరమో, మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం స్వచ్ఛ ఆంధ్ర పురస్కార అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, కె.ఎస్ కృష్ణమాచార్యులు,రావులపాలెం డిపో మేనేజర్ వై వి వి ఎమ్ కుమార్ ను జిల్లా స్థాయిలో స్వచ్ఛ పురస్కారాలను అందుకున్నవారిని మిగిలినవారు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. వచ్చే ఏడాది నియోజ కవర్గం నుంచి మరిన్ని పురస్కా రాలు సాధించాలని అన్నారు. స్వచ్ఛ నియోజక వర్గంగా తీర్చిది ద్దడానికి ప్రతి గ్రామ పంచాయతీ మొదలుకొని ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆకుల రామకృష్ణ, ముదు నూరి వెంకట రాజు (గబ్బర్ సింగ్ ),గుత్తుల రాంబాబు,కేతా శ్రీను, మూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు

# వి.సావరం బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం

**- ఏడుగురు మృతి**
**- ఆరుగురు సజీవదహనం**
**- మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది**
**- హెూంశాఖామంత్రి అనిత**



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం జరిగి ఏడుగురు మృతి చెందగా వీరిలో ఆరుగురు సజీవదహనమైన విషాద సంఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి.సావరం లో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ కేంద్రంలో జరిగింది.ఈ సంఘటనలో బాణాసంచా తయారీ కేంద్రం యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ(65),సాకా అరుణ(35),చిట్టూరి శ్యామల(35),పెంకె శేషారత్నం(40),కుడిపూడి జ్యోతి (38) తో పాటు మరో వ్యక్తి సజీవదహనం కాగా మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. అదేవిధంగా మరో ఏడుగురుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే హుటాహుటిన రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోనసీమ జిల్లా బాణసంచా తయారీ కేంద్రానికి వచ్చే ఏడాది వరకు అనుమతి ఉందని ఇలాంటి ప్రమా దాలు జరగకుండా చర్యలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుదాఘాతం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు చెప్పడం జరిగిందన్నారు. మృతుల కుటుం బాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. మృతుల కుటుంబాలకు త్వరలో పరిహారం ప్రకటిస్తామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు ముందస్తు జాగ్రత్త నిబం ధనలు తప్పనిసరిగా పాటిం చాలన్నారు. బాణ సంచా తయారుచేసే కార్మికులకు బీమా కల్పించేలా చూస్తా మన్నారు. బాణ సంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అయిన ప్పటికీ దురదృష్టవశాత్తు ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఆమె తొలుత గా కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి సావరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ తయారీ కేంద్రం పరిశీలించిన అనిత సహాయ చర్యలు, ఇతర వివరాలు తెలుసుకున్నారు. లింగం చిన్న బాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని అనే క్షతగాత్రు లను కాకినాడ జిజిహెచ్ కు మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలించారు. బాధిత కుటుంబాలకు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతిని తెలిపారు. విద్యుత్ ఘాతంతో జరిగిన ఈ దురదృష్టకర సంఘ టనలో ఆరుగురు కార్మికు లు సజీవ దహనం కావడం బాధాకరమన్నారు. గాయ పడిన వారు త్వరగా కోలు కోవాలని ఆమె భగవంతుని ప్రార్ధించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండ పేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో దేవరకొండ అఖిల,జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన శాఖ అధికారి సారథి, డీఎస్పీ మురళీమోహన్ తదిత రులు పాల్గొన్నారు



## అమలాపురంలో ప్యూర్ ఈవీ షోరూం ప్రారంభం

**అమలాపురం ( కోనసీమ బ్యూరో ) , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
భారతదేశంలోని అగ్రగామి ఎలక్ట్రిక్ టూ వీలర్ ప్యూర్ తయారీదారులలో ఒకటైన ప్యూర్ తన నూతన షోరూమ్‌ను అమలాపురంలో ఏర్పాటు చేసింది. దక్షిణ భారతదేశంలో తన స్థితిని బలోపేతం చేయాలనే లక్ష్యంలో ఇది ఒక కీలక ముందడుగు అని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. కోనసీమ అమలాపురం మండలం పేరూరు వై జంక్షన్ వద్ద ఉన్న ఈ షోరూమ్‌లో ప్యూర్ ఈవీ యొక్క పూర్తి శ్రేణి ఎలక్ట్రిక్ టూ వీలర్లను ప్రదర్శించనున్నారు. వీటిలో ప్రజాదరణ పొందిన ఈ ఫ్లూటో 7 జీ మాక్స్ మరియు ఈ ట్రస్ట్ ఎక్స్ మోడళ్లు ఉన్నాయన్నారు. ప్యూర్ ఈవీ అమలాపురం ప్రజలకు అత్యుత్తమ ఎలక్ట్రిక్ రైడింగ్ అనుభవాన్ని అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అత్యాధునిక ఎలక్ట్రిక్ స్కూటర్లు మరియు మోటార్‌సైకిళ్లతో పాటు, ఈ కొత్త షోరూమ్‌లో ప్యూర్ పవర్ శక్తి నిల్వ ఉత్పత్తి శ్రేణి కూడా ప్రదర్శించబడుతుందన్నారు. ఇది గృహాలు మరియు వ్యాపారాలకు శుభ్రమైన శక్తి స్థిరత్వాన్ని అందించేందుకు రూపొందించబడిందన్నారు. ఈ షోరూమ్ ప్రారంభం ప్యూర్ ఈవీ యొక్క విస్తరణ వ్యూహానికి నిదర్శనం అని చెప్పారు. దేశవ్యాప్తంగా తన ఉనికిని గణనీయంగా పెంచుతూ, ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత విస్తృత ప్రజలకు చేరవేయాలనే ప్యూర్ ఈవీ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోం దని, స్వదేశీ ఆర్ అండ్ డి మరియు తయారీపై దృష్టి సారించి, ప్యూర్ ఈవీ ఆవిష్కరణకు నడిపిస్తూ వినియోగదారులను సుస్థిర ఎంపికల వైపు ప్రోత్సహిస్తోందని చెప్పారు . తదుపరి 30 నెలల్లో 250 కొత్త డీలర్‌షిప్‌లు ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# బాణాసంచా పేలుళ్ల సంఘటనపై తోట త్రిమూర్తులు దిగ్భ్రాంతి

**కోనసీమ బ్యూరో ( రాయవరం ) , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
రాయవరం మండలం కొమరిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీతోట త్రిమూర్తులు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బుధవారం తమిళనాడులో పర్యటనలో ఉన్న తోట త్రిమూర్తులు స్థానిక మీడియాతో మాట్లాడారు. తోట త్రిమూర్తులు ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరుగురు మరణించడం ఎంతో తీవ్రమైన విషాదం అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆయన కలెక్టర్ మహేష్ కుమార్ ను కోరారు. సాధారణంగా బాణాసంచా తయారీ కర్మాగారాలకు రెవెన్యూ శాఖ అనుమతులు ఇవ్వడంలో కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకుండా అనుమతులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు . కార్మికులకు భీమ సదుపాయాన్ని కల్పించిన తరువాతే ఇటువంటి సంస్థలకు అనుమతులు జిల్లా యంత్రాంగం ఇవ్వాలన్నారు. ఎక్కడపడితే అక్కడ అనుమతులు ఇవ్వడం వల్ల భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలో అమాయక కూలీలు మృతి చెందడం వారి కుటుంబాలు వీధిని పడడం జరుగుతుందన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబాలకు పెద్ద ఎత్తున ఎక్స్ గ్రేసియా ఇచ్చి వాళ్లను ఆదుకోవాలని శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు ప్రభుత్వాన్ని కోరారు.



# స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 2025 అవార్డు అందుకున్న సర్పంచ్ను అభినందించిన కూటమి నాయకులు



**ఆత్రేయపురం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త )**
స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 2025 ఉత్తమ గ్రామ స్వచ్ఛ పంచాయతీగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న లొల్ల గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథంని ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణంరాజు( బాబు ) వద్దిపర్రు సర్పంచ్ జుజ్జవరపు హరిబాబు, మద్దూరి సుబ్బారావు, పెండం వెంకన్న , వెచ్చా అనిల్ కుమార్, తరుణ్, ఆత్రేయపురం మండల కుటమి నాయకులు అభినందించారు.

# ర్యాలి జగన్మోహని కేశవస్వామి హుండీ ఆదాయం రూ.11,96,లక్షలు

## - శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం. రూ. 2,64,918లు

**ఆత్రేయపురం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
స్వయంభు క్షేత్రంగా విరాజిలుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాల స్వామి వారి హుండీ ఆదాయం రూ, 11,96,790లు ఆదాయం సమాకూరినట్లు ఆలయ కార్యనిర్వాహ్నధికారి భగవతుల రమణమూర్తి అన్నారు.ఆలయంలో బుధవారం జరిగిన హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.19 రోజులకుగాను ఆదాయం లెక్కించగాఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ.8,29,515 లు, అన్నదానం రూ. 3,67,275లు మొత్తం రూ. 11,96,790 లు ఆదా



యం స్వామికి సమకూరినట్లు తెలిపారు.. అలాగే.. వీటితో పాటుగా..దేశ విదేశీ కు చెంది కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. అలాగే శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం. రూ. 2,64,918లు సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధి కారి భాగవతుల వెంకటరమణ మూర్తి వెల్లడించారు. పరివేక్షణ అధికారిగా మీసాల రాధాకృష్ణ ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం కార్యనిర్వాహణాధికారి. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవ సమితి సభ్యులు, అర్చకులు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వన్డేల్లో టాప్ కెప్టెన్లు

## అత్యధిక విక్టరీల హీరోస్

### టాప్ 2లో ధోనీ, 7లో అజరుద్దీన్

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్ చరిత్రలో వివిధ దేశాలకు చెందిన పలువురు కెప్టెన్లు అత్యధిక విజయాలు సాధించారు. ఇందులో భారత్‌కెప్టెన్లు కూడా స్థానం సంపాదించారు. అత్యధిక విజయాలు సాధించిన టాప్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ నిలిచాడు. వన్డే ల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, మహ్మద్ అజారుద్దీన్ కూడా ఉన్నారు. కానీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ కెప్టెన్ల పేర్లు ఈ రికార్డు జాబితాలో లేవు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 230 మ్యాచ్‌లకు ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించాడు, వాటిలో 165 విజయాలు సాధించాడు. పాంటింగ్ కెప్టెన్సీలో, ఆస్ట్రేలియా రెండుసార్లు (2003, 2007) వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. టాప్ 7 కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్ ధోని రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 200 మ్యాచ్‌లకు భారత జట్టుకు నాయకత్వం వహించాడు. వాటిలో 110 మ్యాచ్‌లలో గెలిచింది. ధోని కెప్టెన్సీలో భారత్ 2011లో వన్డే ప్రపంచ కప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ మూడవ స్థానంలో ఉన్నాడు. అతను 178 మ్యాచ్‌లకు ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించగా, వాటిలో 107 మ్యాచ్‌లలో విజయం సాధించాడు. బోర్డర్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా 1987 వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ హాన్సీ క్రోంజే వన్డే నాల్గవ స్థానంలో ఉన్నాడు. అతను దక్షిణాఫ్రికాకు 138 మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా, వాటిలో 99 విజయాలు సాధించాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఐదవ స్థానంలో ఉన్నాడు. అతను 218 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి, వాటిలో 98 విజయాలు సాధించాడు. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ ఆరో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాకు 150 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి, వాటిలో 92 విజయాలు సాధించాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక విజయాలు సాధించిన టాప్ ఏడుగురు కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ ఏడవ స్థానంలో ఉన్నాడు. అతను 174 మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు, వాటిలో 90 విజయాలు సాధించాడు.

# టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

## 2-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. సొంత గడ్డపై ఆసీస్‌ను క్వీన్ స్వీప్ చేసింది. మూడు మ్యాచ్‌ల వన్డే, రెండు మ్యాచ్‌ల టెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత్ వన్డే సిరీస్‌ను 3-0తో, టెస్ట్ సిరీస్‌ను 2-0 తేడాతో ఊడ్చేసింది. మెక్‌కే వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 7 వికెట్లు తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ బౌలర్లు మూకుమ్మడిగా చెలరేగడంతో ఆస్ట్రేలియా బెంబేలెత్తింది. తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. భారత్ సైతం తొలి ఇన్నింగ్స్ 171 పరుగులకే ఆలౌట్ అయినా, 36 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. అనంతరం భారత్ బౌలర్లు మరోసారి చెలరేగిపోయారు. ఈ సారి ఆసీస్‌ను 116 పరుగులకే (రెండో ఇన్నింగ్స్‌లో) కుప్పకూల్చారు. తద్వారా భారత్ ముందు నామమాత్రపు 81 పరుగుల లక్ష్యం నిలిచింది. స్వల్ప ఛేదనలో భారత్ సైతం ఆదిలో తడబడింది. 13 పరుగుల వద్దే కెప్టెన్ ఆయుశ్ మాత్రే 13 వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత బంతికే స్టార్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ డకౌటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, సిక్స్) మంచి ఆరంభం లభించినా భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. రెండో ఇన్నింగ్స్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. ఈ దశలో వేదాంత్ త్రివేది, విహాన్ మల్హోత్రా భారత్ ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశారు. అయితే 52 పరుగులవద్ద విహాన్ (21) కూడా ఔటయ్యాడు. ఈ సారి వేదాంత్ (33 నాటౌట్) మరో ఛాన్స్ తీసుకోకుండా రాహుల్ కుమార్ (13 నాటౌట్) సహకారంతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు.



# ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌గా కజికిస్థాన్

## జపాన్ చేతిలో 11-35తో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియన్ అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2025లో కజకిస్తాన్ విజయం సాధించి ఛాంపియన్‌గా నిలవగా, భారత్ పురుషుల, మహిళల జట్లు ఓటమితో నిష్క్రమించాయి. ఈ అక్వాటిక్స్‌లో 10 పతకాలతో (6 బంగారు, 2 రజత, 2 కాంస్య) కజకిస్తాన్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఛాంపియన్‌షిప్ చివరి రోజు బుధవారం భారత పురుషుల వాటర్ పోలో జట్టు జపాన్ చేతిలో 11-35 తేడాతో, మహిళల జట్టు ప్రాథమిక రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్ చేతిలో 4-23 తేడాతో ఓడిపోయాయి. పురుషుల గ్రూప్ బిలో లోరీ జున్ 6 గోల్స్‌తో జపాన్ స్కోర్‌బోర్డ్‌ను ముందుకు తీసుకెళ్లగా, కెప్టెన్ ఉరా ఎనిషి, మోరియా యుకీ తలా 4 రన్స్, మైదా తోషియుకి, సకామకి నరు, జో హిరోటో, మట్సునో ర్యోసుకే తలో 3, షోయామా యు, టకేడా ర్యూటా 2 జోడించగా, యమమోటో రియోటారో ఒక గోల్ చేశారు. భారత్ అంకిత్ ప్రసాద్ అత్యధికంగా 4 గోల్స్ చేయగా, సారంగ్ రవీంద్ర వైద్య 2, శ్రేయాస్ వైద్య, భాగేష్ కుతే, ప్రణవ్ మ్హే, ఉదయ్ ఉత్తేకర్, విభవ్ కుతే



తలో ఒక గోల్స్ చేశారు. ఇక మహిళల గ్రూప్ ఎ లో, ఉజ్బెకిస్తాన్ 23-4 తేడాతో భారత్‌ను ఓడించింది. గవాషెలాష్విలి ఎలెనా 6 గోల్స్‌తో రాణించగా, కెప్టెన్ యుసు పోవా ఖిలోలా, సలామాటోవా అజీజా, వెర్మోవా అలెక్సా తలా 4 గోల్స్ చేశారు. ఖుస్నియాబోను అబ్దుల్లావా 2, ముర్తజేవా కొమిలా, ఆండ్రియాఖినా సోఫియా, తలీనా సోఫియా తలో ఒక గోల్ జోడించారు. భారత్ తరఫున కృపా రాణిచిత్ర, ప్రచేత రాఘవేంద్రరావు చెరో 2 గోల్స్ చేశారు.



# వరల్డ్ కప్‌లో విఫలమైనా స్మృతి అగ్రస్థానం పదిలం

## టాప్ 10లో భారత్ మహిళలు నిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనా ఐసీసీ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మంధాన అగ్రస్థానం పదిలంగా నిలిచింది. స్మృతి మినహా మరే భారత ప్లేయర్ టాప్10లో లేరు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 16వ స్థానంలో, దీప్తి శర్మ 17వ స్థానంలో ఉన్నారు. ఇక మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో శ్రీలంక, పాకిస్తాన్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో విఫలమైనప్పటికి కూడా స్మృతి తన స్థానాన్ని కాపాడుకుంది. 791 రేటింగ్ పాయింట్లు మంధాన ఖాతాలో ఉన్నాయి. ఇంగ్లాండ్ చెందిన నాట్ స్కైవర్‌బ్రంట్ 731 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మంధాన, నాట్ స్కైవర్‌బ్రంట్ కు మధ్య 60 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. 713 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఆస్ట్రేలియా ప్లేయర్ బెత్ మూనీ కొనసాగుతోంది. న్యూజిలాండ్ పై శతకం బాదిన దక్షిణాఫ్రికా బ్యాటర్ టాజ్మిన్ బ్రిట్స్ రెండు స్థానాలు మెరుగుపరచుకుని నాలుగో స్థానానికి చేరుకుంది. ఆమె ఖాతాలో 706 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. న్యూజిలాండ్‌పై విధ్వంసక శతకం బాదిన తంజిమ్ బ్రిస్త్ టాప్5లోకి దూసుకొచ్చింది. ఇండోర్ స్టేడియంలో రికార్డు శతకంతో సఫారీ జట్టును గెలిపించిన బ్రిస్త్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానం సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 706 పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాకే చెందిన అష్ గార్డ్‌నర్ 697 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్ పట్టేసింది.

# ఆర్కిటిక్ ఓపెన్‌లో తరుణ్ సంచలన విజయం

## లక్ష్యసేన్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు ఓటమి

**న్యూఢిల్లీ:** ఆర్కిటిక్ ఓపెన్‌లో మన్నేపల్లి తరుణ్ సంచలన విజయం సాధించగా, మిగిలిన భారత్ ప్లేయర్లు ఓటమిపాలయ్యాయి. ఫిన్లాండ్‌లోని వంటాన్ ఎనర్జియా అరీనాలో బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 ఈవెంట్ అయిన ఆర్కిటిక్ ఓపెన్ 2025 ప్రారంభ రౌండ్‌లో ప్రపంచ 46వ ర్యాంకర్ తరుణ్ అద్భుతమైన విజయం సాధించాడు. గంటా ఎనిమిది నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన మూడు సెట్ల పోరులో తరుణ్ ఫ్రాన్స్‌కు చెందిన ఏడో సీడ్ టోమా జూనియర్ పోపోవ్‌ను ఓడించాడు. మొదటి గేమ్ ఓడిపోయిన తర్వాత తరుణ్ పుంజుకుని 11-21, 21-11, 22-20 తేడాతో విజయం సాధించాడు. ఇక లక్ష్య సేన్ నిరాశపరిచాడు, 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఐదో సీడ్ కొడై నరోకా (జపాన్) చేతిలో 15-21, 17-21 తేడాతో ఓడిపోయాడు. అలాగే కిదాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జ్, ఎస్ సుబ్రమణియన్ వంటి ఇతర భారత షట్లర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. శ్రీకాంత్ టోర్నమెంట్ నుండి వైదొలగగా, కిరణ్ జార్జ్ ఆట ప్రారంభమైన 13 నిమిషాలకే నిష్క్రమించాడు. 10-21, 1-4 తేడాతో వెనుకబడిన తర్వాత జపాన్‌కు చెందిన కె వటనాబే చేతిలో ఓడిపోయాడు. ఎస్ సుబ్రమణియన్ 44 నిమిషాల్లో ఫ్రాన్స్‌కు చెందిన మూడవ సీడ్ క్రిస్టో పోపోవ్ చేతిలో 17-21, 11-21 తేడాతో, ఎ శెట్టి తన ప్రారంభ రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ కె విటిడ్సార్న్ చేతిలో 15-21, 16-21 తేడాతో ఓడిపోయారు.



# 'సూపర్ బోర్డు' టాటా ట్రస్ట్ ప్రతిష్టను పరిరక్షించాలి

## కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌ల భేటీ

**ముంబయి, అక్టోబరు 8:** దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. టాటా ట్రస్ట్‌లో నలుగురు ట్రస్టీలు "సూపర్ బోర్డు"గా వ్యవహరిస్తూ గ్రూప్ స్థిరత్వానికి భంగం కలిగిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో, కేంద్రం నేరుగా రంగంలోకి దిగింది. ఎలాంటి పరిస్థితు ల్లోనైనా గ్రూప్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని, అవసరమైతే అందుకు బాధ్యులైన ట్రస్టీలను



తొలగించడానికి కూడా వెనుకాడొద్దని టాటా యాజమాన్యానికి సూచించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, వైస్‌ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో పాటు ట్రస్టీ దారియస్ ఖంబటాతో దాదాపు గంటసేపు సమావేశమయ్యారు. టాటా గ్రూప్ పరిమాణం, ఆర్థిక వ్యవస్థలో దానికున్న ప్రాధాన్యత దృష్ట్యా, ట్రస్ట్‌కు ప్రజా బాధ్యత ఉందని మంత్రులు గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 9న రతన్ టాటా మరణించిన నాటి నుంచి ట్రస్ట్‌లో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ముఖ్యంగా నలుగురు ట్రస్టీలు దారియస్ ఖంబటా, జహంగీర్ హెచ్‌సీ జహంగీర్, ప్రమిత్ ఝవేరి, మెహ్లీ మిస్త్రీ ఒక వర్గంగా ఏర్పడి ఛైర్మన్ నోయెల్ టాటా అధికారాన్ని ప్రశ్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. టాటా సన్స్ బోర్డు సమావేశ మినిట్స్‌ను సమీక్షించడం, స్వతంత్ర డైరెక్టర్ల నియామకాలను ఆమోదించడం వంటి చర్యలతో వీరు కార్పొరేట్ పాలనా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రతన్ టాటా ప్రథమ వర్ధంతికి ఒకరోజు ముందు ఈ కీలక సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# రూ.3 లక్షలకోట్లకు మీడియా వినోదరంగం

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత మీడియా, వినోద రంగం అద్భుతమైన వృద్ధి పథంలో దూసుకెళుతోంది. కంటెంట్, సృజనాత్మకత, సాంకేతికత కలయికతో ఈ రంగం ఆర్థిక వ్యవస్థకు కీలక చోదక శక్తిగా మారుతోంది. 2024లో రూ.2.5 లక్షల కోట్ల విలువ కలిగిన ఈ రంగం, రాబోయే మూడేళ్లలో అంటే 2027 నాటికి రూ.3 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుందని ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ లహోటి అంచనా వేశారు. ఫిక్కీ ఫ్రేమ్స్ 25వ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఈ రంగం భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలను పంచుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో మీడియా, వినోద రంగం ప్రాముఖ్యతను లహోటి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతేడాది ఈ రంగం నుంచి రూ.2.5 లక్షల కోట్ల ఆదాయం సమకూరగా, అందులో కేవలం టెలివిజన్, ప్రసార విభాగం వాటాయే దాదాపు రూ.68,000 కోట్లుగా ఉందని ఆయన తెలిపారు. అనలాగ్ నుంచి డిజిటల్, అక్కడి నుంచి 4జి ప్రసారాల వరకు ఈ రంగం సాంకేతికంగా ఎంతో పరిణితి సాధించిందని అన్నారు. స్మార్ట్ టీవీలు, 5జి టెక్నాలజీ, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల రాకతో వినియోగదారుల సంఖ్య 60 కోట్లు దాటిందని, ఇది అసాధారణమైన మార్పు అని పేర్కొన్నారు. అయితే, ఈ డిజిటల్ విప్లవం కొనసాగుతున్నప్పటికీ, దేశంలోని 190 మిలియన్ల గృహాల్లో ఇప్పటికీ సంప్రదాయ లీనియర్ టెలివిజన్‌దే ఆధిపత్యమని ఆయన గుర్తుచేశారు. ఈ వేగవంతమైన వృద్ధిని సమర్థవంతంగా నిర్వహించేందుకు నియంత్రణ, ఆవిష్కరణల మధ్య సమతుల్యత చాలా అవసరమని లహోటి స్పష్టం చేశారు. "ఆవిష్కరణలు, ఆరోగ్యకరమైన పోటీ ద్వారా క్రమబద్ధమైన వృద్ధిని ప్రోత్సహించడమే ట్రాయ్ విధానం. అదే సమయంలో, వినియోగదారులకు పూర్తి పారదర్శకత కల్పించడం, చిన్న సంస్థల ప్రయోజనాలను కాపాడటం కూడా మా బాధ్యత" అని ఆయన వివరించారు. వ్యాపార ప్రక్రియలను సులభతరం చేసేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నిబంధనలను సరళీకరించేందుకు ట్రాయ్ అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

కేబుల్, టీవీ ప్రసార చట్టాల్లో చేసిన సవరణలు, టెలికమ్యూనికేషన్ చట్టం, 2023 కింద ప్రతిపాదించిన కొత్త అధికారాల వ్యవస్థ ఈ దిశగా వేసిన అడుగులేనని ఆయన అన్నారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, దేశంలోని ప్రధాన నగరాల్లో డిజిటల్ రేడియో ప్రసారాలను ప్రారంభించేందుకు ట్రాయ్ చేసిన సిఫార్సులను లహోటి ప్రస్తావించారు. ఎఫ్‌ఎం రేడియో రంగాన్ని బలోపేతం చేసి, ఆడియో ప్రపంచంలో ఆధునికతను తీసుకురావడమే దీని లక్ష్యమని చెప్పారు. ఈ సిఫార్సుల ప్రకారం, ప్రస్తుతం ఉన్న అనలాగ్ ఎఫ్‌ఎం రేడియో ఛానెళ్లు అదే ఫ్రీక్వెన్సీలో డిజిటల్ ప్రసారాలను కూడా అందించవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే టెక్నాలజీ ప్రమాణాన్ని పాటించడం, 13 నగరాల్లో కొత్త ఫ్రీక్వెన్సీలను వేలం వేయడం వంటివి ఈ డిజిటల్ మార్పులో కీలక ఘట్టాలని పేర్కొన్నారు. కంటెంట్, క్రియేటివిటీ, సంస్కృతి ఆధారిత ఆరెంజ్ ఎకానమీని నిర్మించాలన్న ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేసేందుకు పరిశ్రమ వర్గాలతో కలిసి పనిచేస్తామని లహోటి పునరుద్ఘాటించారు.

# వచ్చే రెండేళ్లలో రూ.18 లక్షల కోట్లకు పసిడిపై తాకట్టు రుణాల టర్నోవర్!

## బంగారం ధరలు శరవేగంగా పెరుగుతుండటమే ఇందుకు కారణం అంటున్న 'ఇక్రా'




**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత్‌లో గోల్డ్ మార్కెట్ 2026 మార్చి నాటికి రూ.15లక్షల కోట్లకు అధిగమిస్తుందని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గత కొన్ని నెలలుగా బంగారం ధరలు స్థిరంగా పెరగడం, అన్ని సమయాలలో గరిష్ట స్థాయికి చేరుకోవడం వేగవంతమైన వృద్ధికి కారణం. ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కోగ్రూప్ హెడ్ (ఫైనాన్షియల్ సెక్టార్ రేటింగ్స్) ఏఎం కార్తీక్ మాట్లాడుతూ వ్యవస్థీకృత గోల్డ్ లోన్ మార్కెట్ పరిమాణం 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.18 లక్షల కోట్లకు పెరగవచ్చన్నారు. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ బంగారు రుణ పోర్ట్‌ఫోలియో 30 నుంచి 35శాతానికి పెరగవచ్చని తెలిపింది. భారీగా పలుకుతున్న బంగారం ధరలు, అన్‌సెక్యూర్డ్ రుణ ఉత్పత్తుల్లో నెమ్మదిగా వృద్ధి చెందడం దీనికి కారణం. ఇవి సాధారణంగా ఒకే రుణగ్రహీత విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ రంగంలో అనేక కంపెనీల వైవిధ్యీకరణ, దేశంలో అందుబాటులో ఉన్న పెద్ద మొత్తంలో ఉచిత బంగారం నిల్వలు ఈ వృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడతాయని కార్తీక్ అన్నారు. ప్రధానంగా బంగారం ధరలు పెరగడం వల్ల వృద్ధి జరిగినప్పటికీ 2020-2025 ఆర్థిక సంవత్సరంలో పూచీకత్తుగా ఉంచుకున్న బంగారం టన్నులు 1.7 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు వద్ద స్వల్పంగా పెరిగాయి. ఈ కాలంలో సగటు రుణ పరిమాణాలు రెండింతలయ్యాయి. 2425 ఆర్థిక సంవత్సరంలో బంగారు రుణాలు సుమారు 26శాతం సీఏజీఆర్ వద్ద విస్తరించి మార్చి 2025 నాటికి 11.8 ట్రిలియన్లకు చేరుకున్నాయి. బ్యాంకులు ఎన్‌బీఎఫ్‌సీల కంటే వేగంగా వృద్ధిని నమోదు చేశాయి. మార్చి 2025 నాటికి బ్యాంకులు మొత్తం వ్యవస్థీకృత బంగారు రుణ మార్కెట్‌లో సుమారు 82 శాతం వాటాను కలిగి ఉండగా, మిగిలిన 18 శాతాన్ని ఎన్‌బీఎఫ్‌సీలు కలిగి ఉన్నాయని ఇక్రా తెలిపి ంది. జూన్ 2025 నాటికి నిర్వహణలో ఉన్న మొత్తం ఎన్‌బీఎఫ్‌సీ బంగారు రుణాల విభాగంలో నిర్వహణ ఆస్తులు 2.4 ట్రిలియన్లుగా ఉన్నాయని ఇక్రా డేటా చూపించింది. ఇది దాదాపు 41 శాతం బలమైన వార్షిక వృద్ధిని సూచిస్తుందని చెప్పింది.

## వాణిజ్యం





# ఇండిగోకు డిజిసిఎ రూ.20 లక్షల జరిమానా!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు రూ.20 లక్షల జరిమానా విధించారు. పైలట్ శిక్షణ కోసం 'క్వాలిఫైడ్ సిమ్యులేటర్లు' ఉపయోగించకపోవడాన్ని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తప్పుపట్టి సంస్థకు జరిమానా విధించింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బుధవారం ఈ విషయం తెలిపింది. సెక్యూరిటీస్ ఫైలింగ్‌లో దీనిని ప్రస్తావించింది. 'కేటగిరీ సీ' ఏరోడ్రోమ్‌లలో పైలట్ శిక్షణ కోసం 'అర్హత కలిగిన సిమ్యులేటర్‌లను' ఉపయోగించనందుకు డీజీసీఏ రూ.20 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొంది. సెప్టెంబర్ 26న ఈ ఉత్తర్వు జారీ చేసినట్లు వివరించింది. కాగా, అంతర్గత కమ్యూనికేషన్ల సమస్య కారణంగా ఈ విషయాన్ని వెల్లడించడంలో ఆలస్యం జరిగినట్లు సెక్యూరిటీస్ ఫైలింగ్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తెలిపింది. అయితే ఈ చెల్లింపును తాము సవాల్ చేస్తామని చెప్పింది. అలాగే ఇండిగో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలపై ఇది ఎటువంటి ప్రభావం చూపబోదని పేర్కొంది. మరోవైపు బుధవారం నాటి స్టాక్‌మార్కెట్‌లో ఇండిగో షేర్ల విలువ స్వల్పంగా తగ్గింది.

# నష్టాలతో వణికిన సెన్సెక్స్, నిఫ్టీలు

## ఐటి, కన్స్యూమర్ మినహా అన్నింటా అమ్మకాలజోరు!

**ముంబయి, అక్టోబరు 8:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయ. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు కనిపించాయి. దాంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు ఉదయం ఫ్లాట్‌గానే మొదలయ్యాయి. ఆ తర్వాత మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లిన కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి స్వల్పంగా కోలుకోవడంతో భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. ఉదయం 81,899.51 పాయింట్ల ప్రారంభమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 81,646.08 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. అత్యధికంగా 82,257.74 పాయింట్ల గరిష్టానికి పెరిగింది. చివరకు 153.09 పాయింట్లు తగ్గి 81,773.66 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ సైతం 62.15 పాయింట్లు తగ్గి 25,046.15 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పతనమయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.7 శాతం, ఐటీ 1.5శాతం లాభపడ్డాయి. ఇక రియాల్టీ, టెలికాం,ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో 0.3శాతం నుంచి 2శాతం వరకు పతనమయ్యాయి. నిఫ్టీలోటాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, జియో ఫైనాన్షియల్, ఓఎన్‌జీసీ, ట్రెంట్ నష్టాల్లో ముగియగా.. టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభపడ్డాయి. రూ.695.83 ఫ్లోర్ ధరతో క్యూఐపీని ప్రారంభించిన అనంత్ రాజ్ షేర్లు 5శాతం తగ్గాయి. రూ.707 కోట్ల విలువైన ఆర్డర్ల తర్వాత సాత్విక్ గ్రీన్ ఎనర్జీ షేర్లు 10శాతం వృద్ధి చెందింది. క్యూవన్ లాభం 67శాతం పెరిగినప్పటికీ మంగళసూత్ర షేర్ల శ్రింగర్ హౌస్ 2శాతం పతనమయ్యాయి. నీలా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేర్ ధర 11శాతం పెరిగింది. ది కార్డ్ కంపెనీతో సహకారంతో డ్రీమ్‌ఫోక్స్ సర్వీసెస్ షేర్ ధర 5శాతం పెరిగింది. జాగ్వార్ ల్యాండ్ రోవర్ క్యూ2 హోల్‌సేల్స్ 24.2శాతం తగ్గడంతో టాటా మోటార్స్ షేర్లు 2.5శాతం పడిపోయాయి. క్యూ2లో రూ.4,570 కోట్ల ప్రీసేల్స్ ఉన్నప్పటికీ లోధా డెవలపర్స్ షేర్లు 1.5శాతం తగ్గాయి. త్రైమాసిక గణాంకాలు మెరుగ్గా ఉండడంతో టైటాన్ షేర్లు 4శాతం పెరగ్గా.. బార్వాహా ప్లాంట్‌లో తయారీ ప్రారంభించడంతో అసోసియేటెడ్ ఆల్కహాల్, బ్రూవరీస్ షేర్లు దాదాపు 3శాతం వృద్ధిని నమోదు చేశాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఆదిత్యలో రోబోటిక్స్ ఓరియెంటేషన్



**గండేపల్లి , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారిచే " ఫ్లాగ్షిప్ రోబోటిక్స్ ఓరియెంటేషన్ సెషన్ " జరిగినదని కళాశాల ప్రో వైస్ -ఛాన్సలర్ డా. ఎ.రమేష్ తెలిపారు. ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా హాక్ బోట్స్, హైదరాబాద్, ఫౌండర్ అండ్ సీఇవో మహాన్ ఆర్.కె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ ఈ సి ఈ విద్యార్థులకు రోబోటిక్స్ ఫండమెంటల్స్ నూతన ప్రాజెక్ట్స్ ఎలా అభివృద్ధి చేయవచ్చు అని విషయాల గురించి వివరించారు. ప్రో వైస్ -ఛాన్సలర్ డా . ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని రంగాలలో రోబోటిక్స్ యొక్క విశిష్టత మరియు ప్రాధాన్యత గురించి వివరించారు. ఎలక్ట్రానిక్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతులు డా. ఆర్. వి. వి. కృష్ణ సిహెచ్ జానకి దేవి మాట్లాడుతూ విద్యార్థులందరూ రోబోట్స్ ని తయారు చేసే విధానంలోని మెళకువలు రోబోటిక్స్ పరిశ్రమల్లో వచ్చే ఉద్యోగాలు అందిపుచ్చు కోవాలని తెలిపారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డా. వై. సుబ్బారావు డీన్ కెరీర్ గైడెన్స్ డా. జి. సంజీవ్ రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యతను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కోర్ బ్రాంచెస్ యొక్క ప్రాధాన్యతను వివరించారు.

# యశోద ఆస్పత్రిలో అత్యాధునిక "ఎలెక్టా యూనిటీ ఎం.ఆర్-లినాక్" చికిత్సలు

**- సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు మరియు క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత**






**రాజమహేంద్రవరం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
భారతదేశ చరిత్రలో క్యాన్సర్ చికిత్సలో ఒక సరికొత్త ఒరవడి మొదలైందని, రేడియోథెరపీ తీసుకునే రోగులకు యశోద ఆస్పత్రిలో ఎంఆర్ లినక్ ద్వారా అత్యధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, ఈ అత్యధునాతన పరికరాలు యశోద ఆసుపత్రి హైటెక్ సిటీలో ఆవిష్కరించబడిందని సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు మరియు క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత (ఎంబీబీఎస్, ఎండీ, డిఎన్బి, ఎఫ్.ఆర్.సి.ఆర్) పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్ర వరంలో స్థానిక జంపేట వద్దగల యశోద ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణంగా రేడియేషన్ థెరపీ తీసుకునే రోగులకు చాలా టెన్షన్ కు గురవుతారని, రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయా?', 'భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా?' అనే ప్రశ్నలు చాలా సాధారణంగా ఉంటాయని అలాంటి భయాలను తగ్గించి, మరింత కచ్చితమైన మరియు సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి ఎంఆర్ లినాక్ అనే అత్యాధునిక టెక్నాలజీని హైటెక్ సిటీలో యశోదా హాస్పిటల్స్ ప్రవేశపెట్టామన్నారు. రేడియేషన్ థెరపీలో పేషెంట్లకు తలనొప్పి, స్కిన్ ఇరిటేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో లేదా మోషన్‌లో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చునని, కాని ఎంఆర్ లినాక్ టెక్నాలజీతో ఇవన్నీ చాలా వరకు నివారించవచ్చునన్నారు. రియల్ టైమ్ అడాప్టివ్ రేడియోథెరపీ మరియు రియల్ టైమ్ మానిటరింగ్ ఈ సాంకేతికత సొంతమన్నారు.

**వివిధ క్యాన్సర్లకు..**

' 'ప్రోస్టేట్ క్యాన్సర్, రెక్టల్ క్యాన్సర్, యుటరస్, సర్విక్స్, బ్లాడర్, లంగ్, ప్యాంక్రియాస్, బ్రెయిన్ ట్యూమర్లు వంటి కష్టమైన క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ అద్భుతమైన ఫలితాలు ఇస్తోంది. ముఖ్యంగా బ్రెయిన్ ట్యూమర్లలో ఎమ్మారై గైడెన్స్ వల్ల ట్యూమర్ స్పష్టంగా కనిపించడంతో, రేడియేషన్‌ను మిల్లీమీటర్ స్థాయిలో ఇవ్వగలుగుతున్నామన్నారు.

**తక్కువ కాలంలో ఎక్కువ ఫలితం..**

"ఎంఆర్ లినాక్ ట్రీట్మెంట్ సమయంలో కొన్ని సందర్భాల్లో కేవలం ఐదు రోజుల్లోనే చికిత్స పూర్తవుతుందని, ఇది రోగులకు మానసికంగా, శారీరకంగా కూడా పెద్ద ఉపశమనం ఇస్తుందని డాక్టర్ సునీత తెలిపారు. ఈ మీడియా సమా వేశంలో యశోద హాస్పిటల్ - హైటెక్ సిటీ డిజియం సంతోష్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ మార్కెట్ టీం లీడర్ ఎన్ బాల వీరబద్ర, అసిస్టెంట్ మేనేజర్ ఎండీ హుస్సేన్ షరీఫ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# వాడపల్లి 'వెంకన్న' కళ్యాణం, అష్టోత్తరపూజలలో పాల్గొన్న భక్తులు

**- శ్రీ స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.2,42,లక్షలు**

**ఆత్రేయపురం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.స్వామివారి నిత్య కళ్యాణం, అష్టోత్ర పూజలలో భక్తులు పాల్గొని మొక్కులు





తీర్చుకున్నారు. ఉదయం మేలుకొలుపు, శ్రీ లక్ష్మీ వెంక టేశ్వర ఐశ్వర్య హెూమం, బాలభోగం, నివేదన, పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించు కుని అన్నప్రసాదాలు స్వీకరించారు.వివిధ సేవల ద్వారా శ్రీ స్వామివారికి రూ. 2,42,379 లక్షల ఆదాయం సమా కూరినట్లు దేవస్థానం అధికారులు తెలియజేసారు.

# బాణాసంచా పేలుళ్లు మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి సుభాష్

**- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు**

**కోనసీమ బ్యూరో ( రాయవరం) , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. ఈ విచారకర సంఘటన విషయం తెలియగానే హుటాహుటిన అమరావతి నుండి బయలుదేరి రాయవరం చేరుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లా డుతూ బాణాసంచా పేలుడు సంఘటనలో ఏరుగురు మరణించడం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.



బాణాసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రినాయకులు సుభాష్ వెంట రామచంద్రపురం ఆర్డీవోఅఖిల,డి.ఎస్.పి రఘువీర్, అగ్నిమాపక సిబ్బం ది, కూటమిపార్టీ ఉండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

# మందుగుండు సామాగ్రి స్వాధీనం..ఇద్దరిపై కేసు నమోదు

**సీతానగరం , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మందుగుండు సామాగ్రిని నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై బి.సురేష్ బుధవారం తెలిపారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన పజ్జూరి వెంకట సూర్యప్రకాశరావు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 50 తారాజువ్వలు, 190 అవుట్లను స్వాధీనం చేసుకున్నారు. రఘుదేవపురానికి చెందిన మండవల్లి జయబాబు వద్ద ఐదు కేజీల తయారీ మందును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అనుమతులు లేకుండా మందుగుండు సామాగ్రిని అమ్మకాలు చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మంత్రి కందుల దుర్గేష్ కృషితో నిడదవోలు రోడ్ల మరమ్మత్తులకు రూ.8.30 కోట్ల నిధులు మంజూరు



**ఉమ్మడితూర్పు గోదావరిజిల్లా బ్యూరో ( నిడదవోలు ) , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
మంత్రి కందుల దుర్గేష్ నిరంతర సమ న్వయం, కృషితో నిడద వోలు నియోజకవర్గంలోని పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. మంత్రి కందుల దుర్గేష్ చొరవతో నిడదవోలు లో దాదాపు 17 కి. మీ పొడవైన రెండు రహదారుల మరమ్మత్తు లకు రూ. 8.30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అందులో భాగంగా 8.65 కిమీల పొడవైన కానూరు-గోపవరం రోడ్డు, ఖండవల్లి ప్రధాన రహదారి మరమ్మతులకు రూ. 4.15 కోట్లు,8.25 కి. మీ పొడవైన దువ్వ-తీతలి మునిపల్లి రహదారికి రూ. 4.15 కోట్లు విడుదల అయ్యాయి. మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవతో గత ప్రభుత్వంలో అడుగుకో గోతితో ఇబ్బంది పడిన వాహనదారుల కష్టాలకు ఇక కాలం చెల్లినట్లే. త్వరలోనే టెండర్లు పిలిచి వాహనదారులకు మార్గం సుగమం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి చర్చించి నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు కేవలం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రిందే దాదాపు రూ. 15.5 కోట్లు ఖర్చు చేసి రోడ్లను వేశామన్నారు. లింకు రోడ్లను సీసీ రోడ్లుగా మార్చామన్నారు. ఇప్పటికే చాలా రోడ్లు ప్రారంభించామని, రాబోయే రోజుల్లో మరిన్ని రోడ్లు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉ న్నాయన్నారు. పట్టణంలో, ఇతరత్రా మండలాల్లో మరిన్ని లింకు రోడ్లు ఏర్పాటు చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# ప్రజాదరణ పొందాలంటే స్థానిక ప్రజా ప్రతినిధులతోనే సాధ్యం

**- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి**

**అంబాజీపేట , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త )**
పార్టీలు,వ్యక్తులతో సంబంధం లేకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నానని, చేసిన అభివృద్ధి ద్వారా ప్రజాదారణ పొందాలంటే స్థానిక సంస్థల ప్రతినిధులతోనే సాధ్యమని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్య నారా యణ అన్నారు. అంబాజీపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుకపూడితో పాటు పలు గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న స్మశాన వాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని, ఓఎన్జిసి నిధులు రూ. 1.55 కోట్లతో నిర్మాణ చేపట్టేందుకు ఆ సంస్థ అంగీకరించిందని తెలిపారు. బస్ స్టేషన్ ఎదురుగా నిర్వహిస్తున్న మద్యం షాపును తొలగించాలని నందంపూడి ఎంపీటీసీ సభ్యురాలు వడ్లమాని పద్మావతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. వాకలగరువు గ్రామంలో గతంలో నిర్మిం చిన సురక్షిత మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో తాగునీరు కలుషితం అవుతుం దని, అలాగే వాటర్ ట్యాంక్ ఎక్కేందుకు నిచ్చెన మెట్లు లేవని, నిచ్చెన మెట్లు ఏర్పాటు చేయించి వాటర్ ట్యాంకును శుభ్రం చేయించాలని వాకలగరువు ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు కోరారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీలు సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల



ప్రశాంత్, పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం సర్పంచిలు జల్లి బాలరాజు, దొంగ నాగేశ్వరరావు,ముక్కామల ఎంపిటిసి సభ్యురాలు వనచర్ల విజయదుర్గలు తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు మండలంలోని వివిధ శాఖల వారీగా సంబంధిత అధికారులు వారి శాఖలలో సాధించిన పురోభివృద్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను ఎంపీపీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమ ంలో ఎంపీడీవో బి. మమత, సూపరింటెండెంట్ ఏఎస్ఎల్ నరసింహం, జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు,రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, సొసైటీ చైర్మన్లు,నీటి సంఘాల అధ్యక్షులు, ఏఎంసి డైరెక్టర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు కష్టాలపై మొసలి కన్నీరు

**- అగాధం లో టమాటా ధర**

**- దమ్ముఉంటే చిత్తూరు జిల్లా లో పర్యటించాలని అచ్చయ్య నాయుడు కు కామన ప్రభాకరరావు సవాల్**

**కోనసీమ బ్యూరో ( మండపేట ) , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
ఆరుగాలం శ్రమించి పండించిన టమాటా కు కనీస మద్దతు ధర కాదు కదా అగాధం లో కూరుకుపోయే పరిస్థితి వుందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి మొసలి కన్నీరు కారుస్తుందని ధ్వజమెత్తారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన బుధవారం మీడియా తో మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం స్వయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు స్వంత జిల్లా చిత్తూరు లో రైతుల వద్ద కు వెళ్ళే దమ్ము ఉందా అంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చిత్తూరు జిల్లా పర్యటించాలని సవాల్ విసిరారు.రాష్ట్ర వ్యవసాయశాఖ కింజరపు అచ్చిన్న నాయుడు టమోటా రైతులు కు న్యాయం చేస్తున్నామని ప్రకటన విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆయన చేతకానితనానికి ఇది నిదర్శనమన్నారు. ఆయన ప్రకటన ను కామన ఖండించారు.భాధ్యత కల్గిన మంత్రి ఆయన చిత్తూరు జిల్లా లో ఒక్క మార్కెట్ కు తనిఖీకి పోకుండా ప్రెస్ నోట్ రిలీజ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. అక్కడి రైతులు నష్టాల్లో ఉన్న ప్రస్తుత సందర్భంలో రైతులు వీరిని ప్రతిఘటిస్తారని భయపడి అక్కడికి పోవడం లేదన్న వాస్తవం ఆయన చర్యవల్ల తెలుస్తుందని విమర్శించారు. ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న అధికారులు రైతులకు ఏమి సహాయం చేయడం లేదని వాపోయారు. మండీలలో మధ్య దళారులు, బడా వ్యాపారస్తులు దోచుకు తింటున్నారని విమ ర్శించారు. జాక్ పాట్ల పేర్లు తో రైతులు పండించిన టమోటా లను ఉచితంగా తీసుకొని రైతులుకు తీవ్రంగా నష్టపెడుతుంటే అధికారులు పిడెలు వాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. అసలే గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్క పై తాటి పండు పడ్డ సామెత లా కమిషన్ రూపంలో వ్యాపా రస్తులు దోచుకోవడం పై ఏవిధమైన చర్యలు లేవన్నారు.



మామూళ్ళ మత్తులో అధికారులు వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. అన్ని తెలిసి మంత్రి అచ్చయ్య నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రని మండి పడ్డారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి జిల్లాలోనే ఈ పరిస్థితిలు ఉంటే రాష్ట్రం లోని మిగిలిన జిల్లాల పరిస్థితి ఏమిటీని కామన ప్రశ్నించారు. అచ్చయ్య నాయుడు కు దమ్ము ఉంటే చిత్తూరు జిల్లా లోని అన్ని మార్కెట్ కమిటీలను సందర్శించాలని సవాల్ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. టమాటా రైతుల పంటలకు గిట్టుబాటు ధర్లను ప్రకటించాలని డిమాండు చేశారు. తక్షణమే టమోటా రైతులును ఆదుకోవాలని కామన డిమాండ్ చేశారు. ఇప్పటికే తోతపురి మామిడి రైతులకు ఇచ్చిన ప్రభుత్వం హామీ నేటికీ నెరవేరక పోవడం తో చిత్తూరు జిల్లా మామిడి రైతులు ఈ నెల 15 వ తేదీన పోరాటం, ఆందోళన చేయడానికి సిద్ధపడుతున్నారని తెలిపారు. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వం ను రైతులు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ విజయ భేతాళ స్వామి వాహన మహోత్సవం, తీర్థం

**- అలరించిన సాంస్కృత కార్యక్రమాలు, అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు**
**- శ్రీ విజయ బేతాళుడుని దర్శించుకున్న ఎమ్మెల్యే 'గిడ్డి'**

**అంబాజీపేట , అక్టోబర్ 08 ( ప్రభాతవార్త ) :**
అంబాజీపేట అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం, శ్రీ విజయ బేతాళ స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన. శ్రీ విజయ బేతాళ స్వామి 59వ వాహన మహెూత్సవం, తీర్థం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. అంబాజీపేట,మాచవరం పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 13 వాహనాలు (దేవతా స్వరూపులు) ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగుతూ బేతాళస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. శ్రీ విజయ భేతాళ స్వామివారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో పాటు పలువురు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీరు మెట్లు గొలిపే విద్యుత్ కాంతులు,డిజె సౌండ్ సిస్టమ్స్, చేడీ తాలింఖానా, అగ్గి బరాటాలు, కత్తి విద్య విన్యాసాలు, మేళ తాళాలు, తీన్మార్ వాయిద్యాలు, గరగ నృత్యాలు, శక్తి వేషాలు వంటి సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. శ్రీ విజయ బేతాళ స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భీమవరం వారిచే స్వాతి ఆర్కెస్ట్రా, సూర్య ఈవెంట్స్, ఎంటర్టై న్మెంట్ జూనియర్ మహేష్ బాబు డాన్స్ బేబీ డాన్స్, శ్రీకృష్ణ వాహన కమిటీ ఆధ్వర్యంలో మాచవరం రోడ్లో సినీ ఈవెంట్స్, శ్రీ విజయ బేతాళ స్వామి యువజన సంఘం ఆధ్వ ర్యంలో బస్టాండ్ రోడ్లో ఆర్కెస్ట్రా, శ్రీ విజయ దుర్గ అమ్మవారి వాహన కమిటీ ఆధ్వర్యంలో పి.గన్నవరం రోడ్డు స్టేట్ బ్యాంక్ వద్ద భీమవరం వారిచే మోహన్ ఆర్కెస్ట్రా, గంగలకుర్రు మలుపు లక్ష్మి గణపతి యువజన సంఘం ఆధ్వర్య ంలో అమలాపురం రోడ్ లో ఆర్కెస్ట్రా, శ్రీ విజయ బేతాళ యువజన సంఘం





ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా లు ఏర్పాటు చేశారు. అనంతరం నాలుగు రోడ్ల సెంటర్లో భారీగా బాణా సంచాను కాల్చారు.

**కొలువుదీరిన వాహనాలు :**

శ్రీనివాసనగర్, పెచ్చెట్టి వారి పాలెం-గరుత్మంతుడు, శ్రీరామ్ నగర్- శ్రీశ్రీ విజయ దుర్గ అమ్మవారు, దొమ్మేటివారి పాలెం-శ్రీకృష్ణుడు, దొమ్మేటివారిపాలెం స్త్రీల ఆసుపత్రి రోడ్డు- శ్రీ ఆంజనేయస్వామి, పోతాయి లంక- శ్రీ భక్త ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు-శ్రీ విజయ గణపతి, రాజహంస వారిపాలెం-రాజహంస, కొత్తపాలెం- హంస వాహనం, చప్పిడివారిపాలెం -శ్రీ షిరిడి సాయిబాబా, గుత్తులవారి పాలెం- సింహ వాహనం,నందంపూడి - శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీనివాస నగర్- శ్రీ విజయ బేతాళస్వామి వారి ఊరేగింపు ఏనుగు వాహనం.

**భారీ బందోబస్తు :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళి మోహన్ పర్యవేక్షణలో పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. వాహన మహెూత్సవం తీర్థం లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి వాహనం వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps